సాక్షి 24|7
మంచిర్యాల
గురువారం 31-8-2017

భూ రక్షణపై కదలిన యంత్రాంగం

- ప్రభుత్వ భూముల సర్వేకు రెండు బృందాల ఏర్పాటు
- రాముని చెరువు హద్దులను పరిశీలించిన కలెక్టర్ కర్ణన్
- చెరువు భూమిని జీపీఎస్‌కు అనుసంధానించాలని ఆదేశాలు
- సాక్షిలో వచ్చిన వరుస కథనాలకు కలెక్టర్ స్పందన

సర్వే షురూ



345 సర్వే నంబర్‌లో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

రాముని చెరువు శిఖం భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్, డీఆర్వో ప్రియాంక

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:

మంచిర్యాలలో భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారుల్లో కదలిక వచ్చింది. గత రెండు వారాలుగా 'సాక్షి' దినపత్రికలో మంచిర్యాల పట్టణం పరిధిలోని వివిధ సర్వే నెంబర్లలో జరిగిన భూ ఆక్రమణలు, అవకతవకలపై వస్తున్న వరుస కథనాలపై ఎట్టకేలకు కలెక్టర్ ఆర్వీ కర్ణన్ స్పందించారు. ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీ పురాణం సతీష్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో మంగళవారం భూకబ్జాల అంశంపై స్పందించిన తీరుతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ కర్ణన్ ఆదేశాల మేరకు పట్టణం పరిధిలోని ప్రభుత్వ భూములను పరిరక్షించే ప్రక్రియలో భాగంగా ముందుగా వాటి సర్వే కోసం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పరాధీనమైన ప్రభుత్వ భూముల వివరాలతో పాటు భూముల పుట్టు పూర్వోత్తరాలను, ప్రస్తుతం ఎవరి పేరు మీద పట్టాలుగా ఉన్నాయే విషయాన్ని ఈ బృందాలు క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. ప్రభుత్వం చేపట్టిన భూ ప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా జీపీఎస్ విధానం ద్వారా భూముల వివరాలను సేకరించనున్నారు. వివాదాస్పదమైన 324 సర్వే నెంబర్‌తో పాటు రాముని చెరువు, పోచమ్మ చెరువు, నస్పూరులోని వివిధ సర్వే నెంబర్లలోని భూములకు సంబంధించి ఆయా బృందాలు సర్వే జరిపి పూర్తిస్థాయి నివేదిక అందించనున్నాయి. తద్వారా కబ్జాకు గురైన ప్రభుత్వ భూములతో పాటు ప్రభుత్వం లావని పట్టాలుగా అసైన్‌మెంట్ చేసిన

- మిగతా 2లో ▶

పోరు బాట

- 1న సీపీఎస్ ఉద్యోగుల మూకుమ్మడి సెలవు
- అదే రోజున హైదరాబాద్‌లో మహాధర్నా
- ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం


ఆర్డీవో కార్యాలయం ఎదుట టీఎన్‌జీవోల నిరసన


మంచిర్యాలలో టీఎన్‌జీవోల ర్యాలీ

మంచిర్యాలటౌన్: ఉద్యోగుల మెడపై కత్తిలా వేలాడుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరుబాట పట్టారు. ఇప్పటికే వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు, వినతిపత్రాల అందజేత కొనసాగుతుండగా, ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు వారు సమాయత్తమయ్యారు. సెప్టెంబర్ ఒకటిన సీపీఎస్ వర్తించే ఉద్యోగులందరూ మూకుమ్మడిగా సెలవు పెట్టేందుకు సిద్ధమయ్యారు. అదే రోజున సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని హైదరాబాద్‌లోని వరంగల్ రోడ్డు, బోడుప్పల్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మహాధర్నా చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. టీఎన్జీవోస్, ఉపాధ్యాయ, ఉద్యోగల సంఘాలు, సీపీఎస్ రద్దు కోరుతూ ఏర్పడిన సంఘాల ఆధ్వర్యంలో ఈ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు.

2004 నుంచి కొత్త పెన్షన్ విధానం

కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం సీపీఎస్‌పై 2004 సెప్టెంబర్ 1న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సర్కారు 653, 654, 655 జీవోలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం 2004 సెప్టెంబర్ ఒకటి తర్వాత ఉద్యోగాల్లో చేరిన ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్

- మిగతా 2లో ▶



ముద్రించిన తేదీకంటే ముందుగానే మార్కెట్లోకి వచ్చిన చిప్స్ ప్యాకెట్స్



'నెల ముందే తయారీ'

- పది రోజుల క్రితమే మార్కెట్లో ప్రత్యక్షం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఇష్టారీతిన వ్యాపారుల ఆగడాలు

మంచిర్యాలక్రైం: ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఒక వస్తువు మార్కెట్లో అమ్మాలంటే ఆ వస్తువును తయారు చేసిన తేదీ, ఎన్ని రోజుల్లో వాడుకోవాలి స్పష్టంగా ముద్రించి.. కంపెనీ లేబుల్, అడ్రస్, ఫోన్ నంబర్, ప్రభుత్వ గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా ముద్రించాలి. కానీ ఇందుకు విరుద్ధంగా ఓ కంపెనీకి చెందిన చిప్స్ ప్యాకెట్లు తయారీ తేదీతో నెల రోజులు ముందుగానే

- మిగతా 2లో ▶

‘నెల ముందే తయారీ’

▶మొదటిపేజీ తరువాయి

మార్కెట్‌లోకి వచ్చాయి. ఆ వివరాలు ఇవీ... మంచిర్యాలకు చెందిన ఓ వినియోగదారుడు బుధవారం పట్టణంలోని ఒక దుకాణంలో ఓ కంపెనీకి చెందిన చిప్స్ ప్యాకెట్ కొన్నాడు. ప్యాకింగ్‌పై ఉన్న లేబుల్‌ను చూసి కంగు తిన్నాడు. ముద్రణ తేదీ 2017 సెప్టెంబర్ 10 అని ఉండడమే కాకుండా... గడువు ‘తయారీ తేదీ నుంచి నెలరోజుల వరకు’ అని ఉండటమే దానికి కారణం. దుకాణాదారుని వద్దకు వెళ్లి ఈ చిప్స్ ప్యాకెట్స్ మీ దుకాణానికి ఎప్పుడు వచ్చింది అని అడిగాడు. పది రోజుల క్రితమే వచ్చిందని చెప్పడంతో మరింత షాక్‌కు గురయ్యాడు. అంటే ఆగస్టు 20వ తేదీకి ముందే తయారు చేసిన వస్తువుపై తర్వాత నెల 10 తేదీ ముద్రించారన్నమాట. గడువు తేదీ 30 రోజులతో కలిసి వస్తువు వాడకానికి 50 రోజులపైనే అవుతుంది. దీనివల్ల చిప్స్ నాణ్యత తగ్గి వాటిని తిన్నవారు అనారోగ్యం పాలయ్యే అవకాశం లేకపోలేదు.

పర్యవేక్షణ ఏదీ..?

ఆయా కంపెనీలు తయారు చేసే వస్తువుల ముద్రణ, గడువు తేదీలను పర్యవేక్షించాల్సిన అధికారులు ఇవేమీ పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది. జిల్లాలో పలు చిన్న చిన్న వ్యాపార సముదాయాలకు చెందిన వ్యాపారులు ప్రతిరోజు తయారు చేస్తున్న వస్తువులపై ఇష్టారీతిన తేదీలను ప్రచురిస్తూ వినియోగదారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనడానికి ఇదో ఉదాహరణ మాత్రమే..!

జిల్లాకు వర్ష సూచన

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బుధవారం నుంచి సెప్టెంబర్ 3వరకు ఆకాశం మధ్యస్తంగా మేఘావృతమై ఉండి ఓ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్ చౌహన్ తెలిపారు. 31న 8మి.మీ., సెప్టెంబర్ 1న 7మి.మీ., 2న 4మి.మీ., 3న 6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 30 నుంచి 31 డిగ్రీలు గాను, కనిష్ట ఉష్ణోగ్రత 22 నుంచి 23 డిగ్రీలు గాను ఉంటుందన్నారు. గాలిలో తేమ ఉదయం 81 నుంచి 83శాతం, మధ్యాహ్నం 70 నుంచి 72 డిగ్రీలు గాను ఉండే అవకాశముందన్నారు. పశ్చిమ వాయువ్య దిశగా గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.

పాత పెన్షన్ మంజూరు చేయాలి



మాట్లాడుతున్న గోలి మనోహర్

మంచిర్యాలసిటీ: ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను మంజూరు చేయాలని పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి గోలి మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సంఘం మండల, పట్టణ బాధ్యులతో సమావేశం నిర్వహించారు. కొత్త పెన్షన్ విధానంతో ఉపాధ్యాయులకు మేలు కంటే నష్టం ఎక్కువగా ఉందన్నారు. ఇప్పటివరకు ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబసభ్యులకు పింఛన్ మంజూరు చేయకపోవడంతోపాటు, వారికి ఉపాధి చూపించడం లేదన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను కొనసాగించాలనే డిమాండ్‌తో శుక్రవారం అన్ని మండల కేంద్రాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలన్నారు. సమావేశంలో వై.వీరశంకర్, వేణుగోపాల్, ఓవీ.భారతి, ఎంవీఎస్.ప్రసాద్, రవికాంత్, అర్చన ఉన్నారు.

సర్వే షురూ

▶మొదటిపేజీ తరువాయి

భూముల రికార్డులు కూడా వెలుగులోకి రానున్నాయి.

‘సాక్షి’ కథనాలతో స్పందన

భూ ఆక్రమణలపై సాక్షాధారాలతో ‘సాక్షి’ దినపత్రికలో వస్తున్న వరుస కథనాలపై ప్రతిపక్షాలతో పాటు అధికార పార్టీకి చెందిన నేతల్లోనూ అలజడి మొదలైంది. అధికార పార్టీ, టీఆర్‌ఎస్ నేతల పేరుతో వస్తున్న కథనాలతో పార్టీ ప్రతిష్ట దెబ్బతింటుందని అదే పార్టీకే చెందిన ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీ పురాణం సతీష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్రికల్లో వరుసగా కథనాలు వస్తున్నా కలెక్టర్ చర్యలు తీసుకోకపోవడంపై మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో అసంతృప్తిని వ్యక్తం చేశారు. ‘అన్ని ఆధారాలతో రామాయణంలా ఏపీసోడ్లు వస్తున్నా పట్టించుకోకుంటే ప్రేక్షక పాత్ర వహించాలా? ఎవరి ప్రమేయం ఉన్నా భయపడకుండా పూర్తిస్థాయిలో విచారణ చేసి, ప్రభుత్వ భూములను కాపాడాలి. ప్రభుత్వ ప్రతిష్ట దిగజారకుండా చూడాల్సిన అవసరం కలెక్టర్‌పైనే ఉంది’ అని వారు తమదైన శైలిలో స్పందించారు. అంతకు ముందు ఈనెల 28న జరిగిన ప్రజావాణిలో మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి అఖిలపక్షంతో కలిసి కలెక్టర్‌కు భూ అక్రమాలపై ఫిర్యాదు చేశారు. 324 సర్వే నంబరులో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తండ్రి నడిపెల్లి లక్ష్మణ్‌రావు పేరిట 57.04 ఎకరాలు వెబ్ పహాణీల్లోకి ఎలా ఎక్కిందని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములన్నీ అన్యాక్రాంతం అవుతుంటే రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్నారని, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు రోజుల్లో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. గత పది రోజులుగా చెరువులు, ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేసి, ప్లాట్లుగా మార్చి అమ్ముకున్న వైనంతో పాటు, ఎమ్మెల్యే తండ్రి పేరిట 324 సర్వే నంబరులో 57.04 ఎకరాల భూమి ఎలా పహాణీలోకి ఎక్కిందని, సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి.

వారం రోజుల్లో నివేదిక

మంచిర్యాలటౌన్: బుధవారం పట్టణంలోని రాముని చెరువును కలెక్టర్ కర్ణన్, ఇన్‌చార్జి డీఆర్వో ప్రియాంక పరిశీలించారు. ప్రభుత్వ భూములను సర్వే చేసి వారం రోజుల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువు శిఖం భూములు సైతం ఫుల్ ట్యాంక్ లెవల్ వరకు హద్దులను ఏర్పాటు చేసి, జీపీఎస్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. ఈ మేరకు 345 సర్వే నంబరులో సర్వే బృందం పరిశీలించింది. మొత్తం 210 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు, 120 ఎకరాల జంగు సిపాయి భూమి ఈ సర్వే నంబరులో ఉందని, పట్టాదారులు పూర్తి ఆధారాలతో సర్వే బృందం వచ్చినప్పుడు చూపించాలని సర్వే టీం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వేణుగోపాల్, డీఈ సత్యనారాయణ, ఏఈ ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బృందంలో ఉన్నది వీరే..

మంచిర్యాల, నస్పూర్ మండలాల్లోని ప్రభుత్వ భూముల సర్వే బృందాల్లో ఆ మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బందిని కాకుండా ఇతర మండలాలకు చెందిన సిబ్బందిని నియమించారు. టీంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్, కలెక్టరేట్ తహసీల్దార్ ఆర్.శేఖర్, మంచిర్యాల మండల సర్వేయర్ నరసింహారాజు, నెన్నెల సర్వేయర్ మణిరాజ్, తాండూర్ ఆర్‌ఐ శ్యాంలాల్, మందమర్రి ఆర్‌ఐ దేవరాజ్, కన్నెపల్లి వీఆర్వో వెంకటేశ్, నెన్నెల మండలం ఆవడం వీఆర్వో డి.వెంకటేశ్‌లను నియమించారు.

పోరుబాట

▶మొదటిపేజీ తరువాయి

విధానం వర్తించదు. వీరందరూ కొత్తగా రూపొందించిన సీపీఎస్ పరిధిలోకి వస్తారు. ఈ విధానంలో తమకు ఏమాత్రం రక్షణ లేదని, కనీస సదుపాయాలు లేవని, ఎవరైనా ఉద్యోగి మరణించినా సదరు కుటుంబానికి పెన్షన్ కూడా వచ్చే పరిస్థితి లేదని ఉద్యోగులు వ్యతిరేకించారు. ఈ స్కీంపై అప్పటి నుంచే వ్యతిరేకత కొనసాగుతోంది. సీపీఎస్ పరిధిలోకి వచ్చే ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఈ సమస్యపై ఎవరూ పెద్దగా స్పందించలేదు. 2004 సెప్టెంబర్ తర్వాత జరిగిన నియామకాల్లో ఎక్కువగా పోలీస్, టీచర్ పోస్టులే ఉన్నాయి. అటెండర్ నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు అందరూ సీపీఎస్ పరిధిలోని ఉద్యోగులే అయ్యారు. రానురాను కొత్తగా వచ్చే ఉద్యోగుల సంఖ్య పెరుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మూడు వేలకు పైగా సీపీఎస్ ఉద్యోగులు ఉన్నట్లు అంచనా.

సీపీఎస్ విధానంలో నష్టమే..

సీపీఎస్ వర్తించే ఉద్యోగులకు ఎటువంటి సౌకర్యాలను ప్రభుత్వం అందించడం లేదు. 2004లో కేంద్రం పీఎఫ్‌డీఆర్‌ఏ చట్టం కింద ఏర్పాటు చేసిన నూతన పింఛన్ విధానంలో రిటైర్‌మెంట్ గ్రాట్యుటీ, డెత్ గ్రాట్యుటీ, డిజెబులిటీ గ్రాట్యుటీని చెల్లిస్తుంది. కాని మన రాష్ట్రంలో ఇవేవీ లేకపోగా, సర్వీసులో ఉన్న ఉద్యోగి మరణిస్తే అప్పటివరకు అతడి ప్రాన్ అకౌంట్ (సీపీఎస్)లో జమ ఉన్న డబ్బులు తీసుకునేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సరైన విధానాలను రూపొందించలేదు. దీంతో సీపీఎస్ ఉద్యోగులు ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇలా...

నూతన పింఛన్ విధానంలో ఉద్యోగి బేసిక్ పే, డీఏ మొత్తం నుంచి 10శాతం అతడి జీతం నుంచి మినహాయించి, ప్రభుత్వం అంతే మొత్తాన్ని కాంట్రిబ్యూట్ చేస్తుంది. ఇలా జమచేసిన మొత్తం డబ్బులను ప్రభుత్వం షేర్ మార్కెట్‌లో పెడుతుంది. ఇందులో నుంచి 85 శాతం డబ్బును ఫిక్స్‌డ్ ఇన్‌కం వాటిల్లో, ఇన్‌ఫ్రా బాండ్స్‌లలో డిపాజిట్ చేస్తుంది. మిగిలిన 15 శాతం డబ్బును ఈక్విటీ లింక్డ్ షేర్‌లలో పెట్టుబడి పెడుతుంది. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగి ఏడాదిలోపు చనిపోతే రెండురెట్ల నెల వేతనం, ఒకటి నుంచి ఐదేళ్లలోపు అయితే ఆరురెట్ల నెల వేతనం, ఐదు నుంచి ఇరవై ఏళ్లలోపు చనిపోతే 12 రెట్ల నెల వేతనం డెత్ గ్రాట్యుటీగా చెల్లిస్తుంది. ఇరవై సంవత్సరాల కన్నా ఎక్కువ సర్వీసు ఉంటే గరిష్టంగా 33 అర్ధ సంవత్సరాలు అంటే 16.5 రెట్ల నెల వేతనాన్ని డెత్ గ్రాట్యుటీగా చెల్లిస్తుంది.

చెల్లింపులపై కానరాని స్పష్టత

పాత పెన్షన్ విధానంలో ఉన్న వారికి వర్తించే నియమాలు సీపీఎస్ పెన్షన్ రూల్స్ 1972 ప్రకారం చెల్లిస్తారు. అందులో రిటైర్‌మెంట్ గ్రాట్యుటీని, డెత్ గ్రాట్యుటీని, డిజెబులిటీ గ్రాట్యుటీని చెల్లించడం లేదు. ప్రభుత్వ ఉద్యోగి 58 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసి రిటైర్ అయిన తర్వాత అతను నిల్వ ఉంచిన డబ్బులో నుంచి 60 శాతం మాత్రమే చెల్లించి, మిగతా 40 శాతం డబ్బును ఐఆర్‌డీఏ వారు సూచించిన లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలలో పెట్టుబడి పెడతారు. తన డబ్బులపై ఉద్యోగికి ఎలాంటి అధికారం లేదు. ఆ డబ్బులు 70 ఏళ్ల వయస్సు వచ్చే వరకు ప్రతి నెలా ఉద్యోగికి పెన్షన్‌ను అందిస్తామని చెబుతున్నారు. కాని ఎంత అందిస్తారు, చేతికి ఎంత వస్తుందనే దానిపై స్పష్టం ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఉద్యోగి రాజీనామా చేస్తే కేవలం 20 శాతం చెల్లించి, మిగిలిన 80 శాతం డబ్బులను ప్రతి నెలా పెన్షన్ రూపంలో చెల్లిస్తారని ప్రభుత్వం చెబుతోంది. ప్రభుత్వ ఉద్యోగి చనిపోతే నామినీ ఉంటే ఆ డబ్బులను చెల్లిస్తారు, లేదంటే ఆ డబ్బులు ఇవ్వరు. కేంద్ర ప్రభుత్వం పింఛన్ నిబంధన 1972 ప్రకారం గ్రాట్యుటీ, కుటుంబ పింఛన్ చెల్లించాలని, ఆ విధంగా కుటుంబ పింఛన్ చెల్లించేట్లు అయితే ఉద్యోగి సర్వీసులో ఉన్నప్పుడు వారి ఖాతాలో జమచేస్తున్న మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వం మెమో నంబర్ 38/41/06–పి అండ్ పి(ఏ)తో 5వ తేదీ మే 2009లో స్పష్టం చేసింది. ఇందుకోసం ఉద్యోగి కుటుంబం నుంచి 1972 నిబంధన ప్రకారం కుటుంబ పింఛన్ కావాలో లేదా జాతీయ పెన్షన్ పథకం కావాలో ఆప్షన్ తీసుకోవాలని కూడా 2014లో స్పష్టం చేసింది. కాని ఇవేవీ మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఉద్యోగులు పోరుబాట పట్టారు.

సెప్టెంబర్ 1న మూకుమ్మడి సెలవు



సీపీఎస్ విధానను రద్దు చేసే వరకు పోరాటం చేస్తాం. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ సెప్టెంబర్ ఒకటిన మూకుమ్మడిగా సెలవులు పెట్టి, హైదరాబాద్‌లో మహాధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నాం. అన్ని సంఘాల ఉపాధ్యాయులు, ఉద్యోగులు మద్దతు తెలుపుతున్నారు. సీపీఎస్ రద్దు పాత పెన్షన్ విధానం అమలు నినాదంతో ముందుకెళ్తాం.

గాదె మహిపాల్, సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు

సీపీఎస్ రద్దయ్యే వరకు పోరాటం



సీపీఎస్ వల్ల ఉద్యోగులు పెన్షన్ నష్టపోతున్నారు. పాత పెన్షన్ విధానంలో ఉన్న స్పష్టత ప్రస్తుతం కొత్త పెన్షన్ విధానంలో లేదు. సీపీఎస్ పొందడంలో ప్రభుత్వం మార్గదర్శకాలను సరైన రీతిలో రూపొందించలేదు. దీంతో ఉద్యోగులు నష్టపోయే ప్రమాదం ఉంది. సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసే వరకు పోరాటం చేస్తాం.

సంతోషం గోపాల్‌రెడ్డి, సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం కార్యదర్శి




సారంగాపూర్ మండలం రవింద్రన గర్‌తండాకు చెందిన చౌహాన్ అశ్విని(11) ఐదవ తరగతి. స్కూల్‌కు వెళ్లనని మారం చేయడంతో తల్లిగట్టిగా మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన బాలిక ఆత్మ హత్య చేసుకుంది.

ఈనెల 11న గాదిగూడ మండలం లోకారి గ్రామానికి చెందిన తరుణ్(25) అనే ఇంటర్ పూర్తిచేసిన యువకుడు చెడువ్యసనాలకు అలవాటు పడుతున్నావని అతని సోదరుడు మందలించడంతో మన స్థాపానికి గురై ఇంట్లో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

అదే రోజు ఇంద్రవెల్లి మండలం గోపాల్‌పూర్‌కు చెందిన అనిత(20) అనే యువతిని తన తల్లి ఇంటి పనుల విషయంలో మంద లించడంతో క్షణికావేశానికి గురై పురుగుల మందుతాగి తనువు చాలించింది.


ఈనెల 5న నేరడిగొండ మండలం యేసుగూడ గ్రామానికి చెందిన దుశ్యంత్‌రావు(17) అనే యువకుడు తండ్రి తరచూ మందలించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



ఒక్క క్షణం..

- క్షణికావేశంతో ప్రాణాలు తీసుకుంటున్న పిల్లలు
- చేతికొచ్చిన పిల్లలు దూరం చేసుకుంటున్న వైనం
- పిల్లల మానసిక పరిస్థితిపై దృష్టి పెడితేనే ప్రయోజనం

స్పెషల్ స్టోరీ



ఆలోచిస్తే ఆనందమే..!

ఆదిలాబాద్: క్షణికావేశం నూరేళ్ల నిండు జీవితాలకు మరణశాసనం అవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఇటీవల చిన్నచిన్న విషయాలకు కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇందులో పిల్లలు, యువతీ యువకులే ఎక్కువగా ఉన్నారు. చేతికందిన పిల్లలు చేజారిపోతుంటే ఆ తల్లిదండ్రులు ఎంతో మనోవేదనకు గురవుతున్నారు. తల్లిదండ్రులు మందలించారని, పరీక్ష ఫెయిల్ అయ్యామని, ప్రేమ విఫలమైందని ఇలా విలువైన జీవితాలను అర్థంతరంగా చాలించుకుంటున్నారు. ప్రతి రోజు ఎక్కడో ఒకచోట ఇలాంటి ఆత్మహత్య సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

రాలుతున్న విద్యాకుసుమాలు..

ప్రస్తుత సమాజంలో ఎక్కువ మంది విద్యార్థులే ఆత్మహత్యలకు పాల్పడడం గమనార్హం. పల్లె నుంచి చదువుల కోసం వెళ్తున్నవారు పోటీ ప్రపంచంలో తట్టుకోలేకపోతున్నారు. విద్యార్థి దశలో కుటుంబ పరిస్థితులు, పాఠశాల వాతావరణం అన్నింటిని ఎదిరించి కళాశాల చదువులకు వెళ్తున్నారు. మరికొందరు ఒకటవ తరగతి నుంచే ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. ఇలా తోటి విద్యార్థుల నుంచి పోటీ తట్టుకోలేక.. అమ్మనాన్నలకు చెప్పుకోలేక.. మానసికంగా ఛిద్రమవుతున్నారు. వారి సున్నితమైన మనస్సులు పరిస్థితులను తట్టుకోవడం లేదు. దీంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

పిల్లలను అర్థం చేసుకోవాలి..

తల్లిదండ్రులు పిల్లల మానసిక పరిస్థితిని గమనించాలి. వారిని ఒక మాట అనే ముందు పిల్లలు ఎలా స్పందిస్తారనేది తెలుసుకోవాలి. ఇతర పిల్లలతో పోలిక చేసి చూడకూడదు. ఒక వేళ పోలిక చేస్తే వారు మానసికంగా కుంగిపోతారు. పిల్లలతో ఆవేశంగా మాట్లాడకూడదు. సాధ్యమైనంత వరకు వారికి అప్యాయంగా నచ్చజెప్పాలి. పిల్లల మానసిక పరిస్థితిని గమనించకుండదా వారిపై చదువు, ఇతర విషయాల్లో ఒత్తిడి చేయరాదు. పిల్లలు ఏదైనా తప్పు చేశారంటే దానికి తల్లిదండ్రులే బాధ్యతనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

– ఓంప్రకాశ్,
మానసిక వైద్య నిపుణులు, రిమ్స్

కౌన్సెలింగ్‌తో మేలు..

ఎవరైనా ఆత్మహత్యకు పాల్పడే క్షణాలను గుర్తించినా లేదా ఆత్మహత్యాయత్నం చేసినా.. వారికి కౌన్సెలింగ్ అత్యవసరం. కౌన్సెలింగ్‌ను స్నేహితులు, కుటుంబసభ్యులు, ఎదుటి వారి మాటలు విని ఓపికగా అర్థం చేసుకునేవారు, మానసిక వైద్య నిపుణులు, వ్యక్తిత్వ నిపుణులు ఎవరైనా చేయవచ్చు.

- యుక్త వయసులో పిల్లలు గుర్తింపును కోరుకుంటారు. తల్లిదండ్రులు వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వాలి. పాఠశాల, కళాశాలల్లో ఉపాధ్యాయుల వేధింపులు కూడా ఆత్మహత్యలకు కారణమవుతాయి. అందుకే పిల్లలతో కుటుంబసభ్యులు మనసు విప్పి మాట్లాడాలి. వారి సమస్యలను తెలుసుకోవాలి.
- ఏదైనా సమస్యల కారణంగా మానసిక క్షోభ ఎదుర్కొంటున్న వారికి వాటి నుంచి బయటపడే మార్గాలను వివరించి ధైర్యం చెప్పాలి.
- బలహీనమైన క్షణాలను దరి చేరకుండా కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి. కుటుంబం గురించి ఆలోచించాలి.
- పిల్లలు ఆవేశానికి లోనైప్పుడు వారిని చస్తే చావు అంటూ రెచ్చగొట్టొద్దు. వారికి ప్రశాంతంగా నచ్చజెప్పాలి.

నేరం-శిక్ష

కట్నం వేధింపుల కేసులో పదకొండేళ్ల జైలు

జన్నారం(ఖానాపూర్): జన్నారం మండలం కామన్‌పల్లికి చెందిన తేజావత్ భరత్‌నాయక్‌కు 11 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.6వేలు జరిమానా విధిస్తూ మంచిర్యాల న్యాయమూర్తి వెంకటేశ్వర్లు బుధవారం తీర్పు ఇచ్చినట్లు జన్నారం ఎస్సై రమేశ్ తెలిపారు. 2011లో రోటిగూడ గ్రామానికి చెందిన బుక్య శంకర్‌నాయక్ కుమార్తె వసంతతో భరత్‌నాయక్‌తో వివాహమయ్యింది. వివాహ సమయంలో రూ.2 లక్షల కట్నం ఇచ్చి, ఇతర సామగ్రి ఇచ్చారు. రెండేళ్ల తర్వాత వీరికి బాబు జన్మించాడు. అనంతరం అర ఎకరం పొలం, ఒక ప్లాట్ కావాలని, అదనంగా కట్నం తేవాలని భరత్‌నాయక్ వేధించేవాడు. వేధింపులు తాళలేక వసంత ఆత్మహత్య చేసుకుంది. అప్పటి డీఎస్పీ రమణకుమార్ ఆదేశంతో ఎస్సై బుద్దె స్వామి 2014లో కేసు నమోదు చేశారు. కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో బుధవారం జిల్లా న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

అటవీ భూమి ఆక్రమణ కేసులో నలుగురి అరెస్టు

వేమనపల్లి(బెల్లంపల్లి): సూరారం సమీప అటవీ భూమిలో సాగు చేసేందుకు యత్నించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు అటవీ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. 11 మంది అటవీ భూమిలో చెట్లు నరికి ఆక్రమణకు పాల్పడ్డట్లు తమ విచారణలో తేలిందన్నారు. వీరిలో సూరారానికి చెందిన దుర్గం ధర్మయ్య, తలండిఅశోక్, మడేసురేష్, బాగాల లస్మయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. మిగతావారు పరారీలో ఉన్నారన్నారు. ఎవరైనా అటవీ భూమిలో అక్రమ సేద్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు రేంజర్ తెలిపారు. ఇందులో ఎఫ్ఎస్‌వోలు బాబుపటేకర్, మల్లయ్య, ఎఫ్‌బీవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆచూకీ లభ్యం

జైనథ్(ఆదిలాబాద్): ఈ నెల 19న అదృశ్యమైన మండలంలోని సిర్సన్న గ్రామానికి చెందిన యువకుడు అడెల్లు ఆచూకీ లభించింది.



అడెల్లు

సిర్సన్న గ్రామానికి చెందిన శివయ్య కుమారుడు అడెల్లు మానసిక పరిస్థితి బాగాలేదు. దీంతో గతంలో కొన్నిసార్లు ఇంట్లో నుంచి వెళ్లిపోయి మళ్లీ వచ్చాడు. ఈ నెల 19న మేకలు మేపడానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు అతడి ఆచూకీ కోసం వెతికారు. బోథ్ మండలంలో సంపత్‌నాయక్ తండాలో ఉన్నట్లు సమాచారం అందగా బుధవారం అతడిని ఇంటికి తీసుకువచ్చినట్లు ఎస్సై పుల్లయ్య తెలిపారు.

అధికారుల వేధింపులతో ఓవర్‌మెన్ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సత్యనారాయణ

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియా కాసిపేటగనిలో అధికారుల వేధింపులు భరించలేక బుధవారం ఇంటివద్ద పల్లెపాటి సత్యనారాయణ అనే ఓవర్‌మెన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మందమర్రి డిస్పెన్సరీలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. బాధితుడి కథనం ప్రకారం మందమర్రిలో నివాసం ఉండే సత్యనారాయణ బుధవారం విధులకు రాగా ఉదయమే వచ్చిన కాసిపేట గ్రూప్ ఏజెంటు నాగేశ్వరరావు డిస్ట్రిబ్యూషన్ విషయమై ప్రశ్నించారు. ఆరోగ్యం బాగా లేనందున ఇతర ఓవర్‌మెన్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగిందని సత్యనారాయణ బదులిచ్చాడు. అనంతరం అధికారి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడంతో మస్టర్ తొలగించుకుని ఇంటికి వెళ్లినట్లు ఓవర్‌మెన్ పేర్కొన్నాడు. ఉత్పత్తి కోసం అనేక రకాలుగా శ్రమించి యాజమాన్యం వద్ద పేరు తెచ్చుకున్న తనను దూషించడంతో మానస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. కుటుంబీకులు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో బాధితున్ని కార్మికులతో పాటు కార్మిక సంఘాల నాయకులు వొడ్నాల రాజన్న, కనుకుల తిరుపతి, అమరకొండ రాజయ్య పరామర్శించారు. కాసిపేటగనిలో అధికారుల వేధింపులను తట్టుకోలేకపోతున్నామని కార్మికులు వాపోతున్నారు.

కుగ్రామంలో ప్రసవవేదన

- అండగా నిలిచిన వైద్యసిబ్బంది
- ఒకే రోజు మూడు కాన్పులు

వేమనపల్లి(బెల్లంపల్లి): ఇటీవల కురిసిన వర్షాలకు నీల్వాయి వాగు తాత్కాలిక వంతెన తెగిపోయింది. 25 గ్రామాల ప్రజలు పడవల సహాయంతో వాగు దాటుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పురిటినొప్పులతో బాధపడే ముగ్గురు గురుండ్లనానక్క, తెలిగసౌందర్య, తెలిగ మౌనికకు వైద్య సిబ్బంది అండగా నిలిచారు. వైద్యాధికారి రఫ్‌పాల్ సూచనల మేరకు స్టాఫ్‌నర్సులు శ్రీవాణి, శ్రీలత, ఫార్మాసిస్ట్ సౌందర్య ఏఎన్ఎం కళావతి వారికి మనో ధైర్యాన్నిచ్చారు. రాకపోకలు లేకున్నా స్థానికంగా ఉంటున్న వీరు పీహెచ్‌సీలోనే ముగ్గురికి సాధారణ డెలివరీలు చేసి శెభాష్ అనిపించుకున్నారు.

వాగు అవతలి గ్రామాలే..

గొర్లపల్లికి చెందిన గురుండ్ల నానక్క, సుంపుటం గ్రామానికి చెందిన తెలిగ సౌందర్య, మండలకేంద్రానికి చెందిన తెలిగ మౌనికకు ఉదయం నుంచి పురిటినొప్పులు మొదలయ్యాయి. వీరంతా నీల్వాయి వాగు ఇవతలి వైపు గ్రామస్తులే కావడంతో వాగుతో ఇబ్బందులు పడ్డారు. కాన్పు చేయటంలో ఏదైనా కష్టం వస్తే వీరికీ పడవ ప్రయాణమే దిక్కు. దీంతో వీరి గ్రామాల్లో ఉన్న ఆశా కార్యకర్తలు పీహెచ్‌సీలో సిబ్బంది పనితీరు గురించి కుటుంబాలకు వివరించారు. కాన్పుల విషయంలో భరోసా ఇచ్చారు. కుటుంబీకుల అంగీకారంతో పీహెచ్‌సీ కాల్ సెంటర్‌కు సమాచారం అందించారు. ఐటీడీఏ సహకారంతో ఏర్పాటుచేసిన అవ్వాల్‌కమిటీ అంబులెన్స్‌లో వారిని పీహెచ్‌సీకి తరలించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన పీహెచ్‌సీ సిబ్బంది పీహెచ్‌సీలో కాన్పులు చేసి ఊపిరి పీల్చుకున్నారు. ముగ్గురికీ మగశిశువులే జన్మించారు.



బాలింతలతో వైద్య సిబ్బంది

వాతావరణం

రానున్న 24 గంటల్లో సౌరాష్ట్ర, కచ్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తర పశ్చిమ బెంగాల్, పశ్చిమ తీర ప్రాంతాల్లో మధ్యస్థం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో మిగిలిన ప్రాంతాల్లో, జార్ఖండ్, బిహార్, ఉత్తర ప్రదేశ్ పర్వతాలకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో, ఉత్తర ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, హరియాణా, పంజాబ్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడతాయి.

గుంటూరు / ఆదిలాబాద్ వాతావరణం

గరిష్ఠం కనిష్ఠం

34.8°/24.0° / 32.6°/21.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	35.5	27.6
కోల్‌కతా	35.2	26.0
బెంగళూరు	28.5	31.1
ముంబై	30.5	23.1
చెన్నై	36.1	25.5

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
నెల్లూరు	36.8/27.0	కాకినాడ	33.8/24.0
ఒంగోలు	36.6/26.0	ఖమ్మం	33.0/20.0
చిత్తూరు	36.5/26.0	విశాఖపట్నం	32.7/24.6
తిరుపతి	36.5/26.0	శ్రీకాకుళం	32.6/26.5
అనంతపురం	35.0/25.0	విజయనగరం	32.6/26.5
విజయవాడ	35.0/24.6	నల్లగొండ	32.6/24.0
కడప	34.8/26.0	ఆదిలాబాద్	32.6/21.0
గుంటూరు	34.8/24.0	హైదరాబాద్	32.0/22.3
కర్నూలు	34.6/25.0	రంగారెడ్డి	32.0/22.3
కరీంనగర్	34.2/25.2	నిజామాబాద్	31.9/24.0
ఏలూరు	34.0/25.6	మెదక్	31.7/21.6
రాజమండ్రి	34.0/25.6	వరంగల్	31.6/24.5
తాడేపల్లిగూడెం	34.0/25.6	మహబూబ్‌నగర్	31.4/23.0

బుల్లితెర


www.sakshi.com

SAKSHI TV


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్‌ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.30 స్ర్కీన్‌ప్లే
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్ర్కీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 గూఢచారి 117
ఉ.09.30 శేషాద్రి నాయుడు
మ.12.00 పోస్ట్‌మ్యాన్
మ.03.00 శ్రీమతీ వెళ్లొస్తా
సా.06.00 ఆంధ్రుడు




మూవీస్ నౌ
ఉ.08.20 స్పిసిస్
ఉ.10.20 క్లిఫ్ హ్యాంగర్
మ.02.45 రష్ అవర్ 3
సా.05.55 సూపర్‌మాన్ రిటర్న్స్
రా.09.00 టాయ్ స్టోరీ




హెచ్‌బీవో
ఉ.08.09 ఘోస్ట్ షిప్
ఉ.09.42 ఫూల్స్ గుడ్
ఉ.11.38 కుంగ్‌ఫు పాండా 2
సా.05.10 ఐపీ మ్యాన్ 3
రా.07.00 ద అకౌంటెంట్



సోనీ పిక్స్
ఉ.0626 సెంటర్ స్టేజ్
ఉ.11.26 బ్యాటిల్‌షిప్
మ.01.47 ద ఇంక్రెడిబుల్ హల్క్
సా.06.13 వాటర్‌వరల్డ్
రా.09.00 జురాసిక్ పార్క్



మా మూవీస్
ఉ.07.00 పెద్దోడు చిన్నోడు
ఉ.09.00 ఆనంద్
మ.12.00 షాక్
మ.03.00 ఎందుకంటే ప్రేమంట
సా.05.00 సింగం



జీ సినిమా
ఉ.07.50 ఆవారా పాగల్ దీవానా
ఉ.10.54 ఐ
మ.02.42 సిర్ఫ్ తుమ్
సా.05.41 హసీనా మాన్ జాయేగీ
రా.09.00 నామ్ షబానా

తిరుమల సమాచారం

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 12 కంపార్టుమెంట్లు నిండాయి.


సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	–	ఖాళీ లేవు
రూ.50 గదులు	–	ఖాళీ లేవు
రూ.100 గదులు	–	ఖాళీ లేవు
రూ.500 గదులు	–	ఖాళీ లేవు

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ	–	250 ఖాళీ ఉన్నాయి
వసంతోత్సవం	–	150 ఖాళీ ఉన్నాయి
ఆర్జిత బ్రహ్మోత్సవం	–	200 ఖాళీ ఉన్నాయి
గురువారం ప్రత్యేక సేవ	:	తిరుప్పావడ



బాసర ఆలయ సమాచారం

బాసర: అన్నదానం.. రోజూ 12.30 గంటలకు ప్రారంభం

శ్రీసరస్వతీ అమ్మవారి ఆలయంలో నిత్యపూజలు, దర్శనవేళలు:

ఉదయం: 4గంటలకు ఆలయ ద్వారం తెరుచుట, 4.05 నుంచి 4.15 వరకు మేలుకొల్పు (గర్భాలయం శుభ్రంచేయడం), అభిషేకపూజ సామగ్రి, వాయిద్యాములతో గర్భలాయంలోనికి తీసుకరావడం, 4.15కు భక్తులకు అమ్మవారి ముఖమండప ప్రవేశం, 4.30కు అభిషేకం, తదుపరి అమ్మవారి మూలవిగ్రహదర్శనం, జలప్రాక్షణ, 6.30కు అమ్మవారికి ప్రాతఃకాల మహాహారతి, 7.30 నుంచి ఆర్జిత సేవలు.

మధ్యాహ్నం: 12.05 నుంచి 12.30 వరకు అమ్మవారికి నైవేద్య ఆరాధన, ఒంటిగంటకు ద్వార బంధనం, 2కు ద్వారం తెరుచుట, 2నుంచి సాయంత్రం 6వరకు సర్వదర్శనం, ఆర్జితసేవలు, 6.30కు అమ్మవారి ప్రదోశకాల పూజ నిర్వహించబడును.

రాత్రి: 7.05 నుంచి 7.25 వరకు అమ్మవారికి పూజలు... 7.30కు మహాహారతి, మంత్రపుష్పం, వేదస్వస్తి, 8.20కు అమ్మవారికి ఏకాంత సేవపూజ, 8.30కు ద్వారబంధనం.

ఫోన్ నంబర్లు

గదుల విచారణ	08752 255550
ఈవో	94910 00656
సూపరింటెండెంట్	94411 29737
వైశ్యసత్రం	08752 255521
బ్రాహ్మణసత్రం	08752 255522





Padi-Panta

లాభాల కాకర

- అధిక ధర పలుకుతున్న కాకరకాయ
- ఆసక్తి చూపుతున్న రైతులు



మంచిర్యాల అగ్రికల్చర్: పందిరి జాతి కూరగాయల్లో కాకరకాయకు విశిష్ట స్థానం ఉంది. అధిక దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాలు అందుబాటులో ఉన్నాయి. వాటికి మార్కెట్‌లో అధికధర పలుకుతోంది. దీంతో రైతులకు కాకర సాగు లాభదాయకంగా మారింది.దీనికి ఏడాది పొడవునా డిమాండ్ ఉంటుంది. సరైన సీజన్‌లో పంట రావాలంటే ఇప్పటినుంచే కాకరసాగుకు ఉపక్రమించడం మంచిది.

వాతావరణం

కాకర అధిక ఉష్ణోగ్రత, కాంతిని తట్టుకోదు. పూత సమయంలో అధికఉష్ణోగ్రత ఉంటే మగపూలు ఎక్కువగా రావడమే కాకుండా కాయ తయారీ మందగిస్తుంది. గరపనేలలు, ఎర్ర నేలలు అనుకూలమైనవి. నీరు నిల్వని బరువైన నేలలు అనకూలం.

ఈ రకాలు అనుకూలం..

కాకరలో తెల్ల, ఆకుపచ్చని కాయలుంటాయి. ఇవి చిన్నగా, పొడవుగా ఉంటాయి. వేసవిలో చిన్న కాయ రకాలు, వర్షాకాలంలో పొడవుకాయ రకాలు కాస్తాయి. కాలానికి అనుకూలమైన రకాలను ఎంచుకోవాలి. సాధారణ రకాల్లో పూసాదోవకాసమి, కోయంబత్తూరు లాంగ్, అర్కహరిత, పూసావివేక్, ప్రియ, హైబ్రిడ్ రకాల్లో...ఎంబీటీ హెచ్–101, 102, 104, 107, శ్వేత, ఎన్‌ఎస్– 33, ఎన్‌ఎస్– 431,432, బీఐటీ– 711 ఉన్నాయి. సాధారణ రకాలను సాగు చేసే రైతులు బాగా కాసే మొక్కల నుంచి పండు కాయలను సేకరించి, వాటి నుంచి విత్తనాన్ని నాటుకోవాలి.

ఇలా నాటాలి..

భూమిని 2– 3 సార్లు బాగా దున్ని గుల్లబారేట్లు చేసుకోవాలి. అరు అడుగుల దూరంలో సాళ్లు ఏర్పా టు చేసుకుని, సాళ్లలో ఎకరాకు 6– 8 టన్నుల పశువుల ఎరువును వేసుకోవాలి. ఈ సాళ్లలో 90 సెం. మీ దూరంలో రెండేసి విత్తనాల చొప్పున నాటుకోవాలి. ముందుగా పాదులు చేసుకున్నట్లయితే ఒక్కో పాదుకు 2– 3 కిలోల పశువుల ఎరువు వేసుకోవాలి. ఎకరాకు 50 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ పాదుల్లో పశువుల ఎరువుతో కలిపి వేసుకోవాలి. ఒక్కో పాదులో 2– 3 గింజలను 2 లేదా 3 చోట్ల నాటుకోవాలి. హైబ్రిడ్ రకాలైతే ఒక్క మొక్క, సాధారణ రకాలైతే 2 లేదా 3 మొక్కలను ఒక్కో పాదుకు ఉంచి మిగతావి తీసివేయాలి.

నీటి యాజమాన్యం

అవసరాన్ని బట్టి 4– 5 రోజులకొకసారి నీరందించాలి. డ్రిప్ పద్ధతిలో నీరు ఇచ్చేప్పుడు రోజుకు పాదుకు 10– 12 లీటర్ల చొప్పున నీరు వాదలాలి. మొక్కవయస్సు, ఎండ తీవ్రతను బట్టి నీరందించాలి. పం దిర్లు వేసేముందే అంతర కృషి చేసి కలుపు ను నివారించాలి. పందిరి వేసిన తర్వాత కలుపు వస్తే వాటిపై 8 మి.లీ గ్లైఫోసేట్, 10 గ్రాముల అమ్మోనియం సల్ఫేట్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎకరాకు 50 కిలోల యూరియా, 30 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ ఎరువులను నాటిన 30 రోజుల నుంచి ప్రారంభించి, మూడు భాగాలుగా 25–30 రోజుల వ్యవధిలో పాదుల్లో వేసి నీరు పెట్టాలి. పూత దశలో 10 గ్రాముల మల్టీ–కే మందును లీటర్ నీటికి కలిపి సాయంత్రం పిచికారీ చేయాలి. వేసవిలో ఆడపూల శాతం ఎక్కువగా రావడానికి 2 గ్రాముల బోరాక్స్‌ను లీటర్ నీటికి కలిపి 3– 4 ఆకుల దశ నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

పందిర్లపై పాకించుట

వెదురు బొంగుల పందిరి వేసి ప్లాస్టిక్ వైరుతో అల్లిన తర్వాత కాకర తీగలను గట్టి దారంతో కట్టి పైకి పాకించాలి. పందిళ్లను కనీసం ఆరు అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలి. కాకర గింజలు విత్తిన 40– 45 రోజులకు పూత ప్రారంభమై కాయ తయారు అవడానికి 12– 15 రోజులవుతుంది. కాయ సైజును బట్టి లేత కాయలను చూసి ముదరక ముందే కోసి, మార్కెట్‌కు తరలించాలి. ప్రతి 4– 5 రోజుకోసారి కోయాలి. ఎకరాకు దిగుబడి హైబ్రిడ్ రకాలైతే 6– 8 టన్నులు, సాధారణ రకాలైతే 4– 5 టన్నుల దిగుబడి వస్తుంది.



చికెన్ (సుగుణ)	స్కిన్	స్కిన్‌లెస్
	120	140

భవిష్యం

మేషం: పనుల్లో జాప్యం. ఆర్థిక ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఆకస్మిక ప్రయాణాలు. ఆలయ దర్శనాలు. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలలో చికాకులు.

వృషభం: శ్రమాధిక్యం. పనుల్లో తొందరపాటు. ప్రయాణాలలో అవాంతరాలు. వ్యయ ప్రయాసలు. బంధువులతో తగాదాలు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.



మిథునం: చిరకాల స్వప్నం నెరవేరుతుంది. విద్యావకాశాలు. ప్రముఖులతో పరిచయాలు. పలుకుబడి పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో నూతనోత్సాహం.

కర్కాటకం: కొత్త విషయాలు తెలుసుకుంటారు. ఆర్థిక ప్రగతి. పరిచయాలు పెరుగుతాయి. శుభవార్తలు. వాహనయోగం. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు కొత్త హోదాలు.

సింహం: పనుల్లో అవాంతరాలు. వృథా ఖర్చులు. బంధువులతో మాటపట్టింపులు. అనారోగ్యం. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళ పరిస్థితి.

కన్య: కొన్ని సమస్యలు వేధిస్తాయి. ఆరోగ్యభంగం. ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దూరప్రయాణాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

తుల: పరిచయాలు పెరుగుతాయి. ఆసక్తికర సమాచారం. విందువినోదాలు. యత్నకార్యసిద్ధి. ఉద్యోగావకాశాలు. వృత్తి, వ్యాపారాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

వృశ్చికం: కుటుంబ, ఆరోగ్యసమస్యలు. వ్యయప్రయాసలు. ఆదాయానికి మించిన ఖర్చులు. ప్రయాణాలు వాయిదా. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహం.

ధనుస్సు: చిన్ననాటి మిత్రుల కలయిక. విందువినోదాలు. కార్యజయం. భూములు, వాహనాలు కొంటారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు పదోన్నతులు.

మకరం: శ్రమ పెరుగుతుంది. ఆకస్మిక ప్రయాణాలు. ఇంటాబయటా ఒత్తిడులు. దైవ దర్శనాలు. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలలో నిరాశ.

కుంభం: పలుకుబడి పెరుగుతుంది. శుభవార్తలు. వాహనయోగం. చర్చలు ఫలిస్తాయి. వస్తులాభాలు. వ్యాపారాలలో పురోగతి. ఉద్యోగులకు విధుల్లో చికాకులు తొలగుతాయి.

మీనం: పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితుల సాయం అందుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూలత.

– సింహంభట్ల సుబ్బారావు

ఖాకీ నీడ..



పట్టణంలోని ఓ ప్రార్థన మందిరం వద్ద పోలీసులు

మందిరాల వద్ద ప్రత్యేక భద్రత

- జిల్లాకు 400ల మంది ట్రైనీ కానిస్టేబుళ్లు
- 5 చెక్ పోస్టులు ఏర్పాటు
- నవరాత్రులు, బక్రీద్ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత

మంచిర్యాలక్రైం: గణేష్ నవరాత్రులు, బక్రీద్ పండగ నేపథ్యంలో జిల్లాలో పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేపట్టారు. వినాయక మండపాలు, ప్రార్థన మందిరాలు ఖాకీ నీడలో కొనసాగుతున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నిఘా పెడుతున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ రోజువారీగా బందోబస్తు ఏర్పాటు చేస్తుండడం విశేషం.

400 మంది ట్రైనీలు...

బందోబస్తు కోసం జిల్లాకు 400 మంది ట్రైనీ కానిస్టేబుళ్లను కేటాయించారు. సంఘవిద్రోహశక్తులు చొరబడకుండా ఉండేందుకు 5 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రార్థన మందిరాల వద్ద శిక్షణ పొందుతున్న ఇద్దరు కానిస్టేబుళ్లతో పాటు ఒక రెగ్యూలర్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశారు. చెక్ పోస్టుల వద్ద స్పెషల్ పోలీసులను ఏర్పాటు చేశారు. అనుమానస్పదంగా కనిపించినా, గుర్తు తెలియని వాహనం వచ్చినా, పశువుల అక్రమ రవాణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

వినాయక మండపాల వద్ద...

జిల్లావ్యాప్తంగా ఈసారి 1750 గణేష్ మండపాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో సుమారు 150 ప్రాంతాలు సమస్యాత్మకంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీటి ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, ప్రత్యేక నిఘా, మఫ్టిలో సిబ్బంది పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. గతేడాది విజయవాడకు చెందిన పిక్ ప్యాకెటర్స్ బృందం చోరీలకు పాల్పడిన నేపథ్యంలో ఈసారి సీసీ కెమెరాల నిఘా పెంచారు.

ఐదు చెక్‌పోస్టులు..

సంఘవిద్రోహశక్తులు, పశువుల అక్రమ రావాణా నివారించేందుకు జిల్లాలో ప్రత్యేకంగా ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. లక్సెట్టిపేట, తాండూర్, బెల్లంపల్లి, జైపూర్, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో వీటిని ఏర్పాటు చేశారు. రాత్రి, పగలు వంతుల వారీగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

నిరంతర నిఘా



గణేష్ నవరాత్రుల సందర్భంగా జిల్లా కేంద్రంలో నిరంతర నిఘా ఏర్పాటు చేశాం. పాత నేరస్తులను బండోవర్ చేస్తున్నాం. 24గంటలు ప్రార్థన మందిరాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

- ప్రమోద్‌రావు, ఇన్‌చార్జి సీఐ, మంచిర్యాల

❑ రోడ్డు బాగు చేయరూ





మంచిర్యాలటౌన్: పట్టణంలోని రంగంపేట్ పవర్‌సిటీ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లకు వెళ్లేందుకు ఉన్న రహదారిపైనే చెత్త వేస్తున్నారు. మున్సిపాలిటీ వారు తీసుకు వచ్చిన చెత్తా చెదారాన్ని రోడ్డుపైనే వేయడంతో అటువైపుగా వెళ్లేవారికి ఇబ్బందిగా మారింది. నడిచేందుకు వీలు లేకుండా పూర్తి బురదగా తయారైంది. మున్సిపాల్ సిబ్బంది పట్టించుకుని సమస్య పరిష్కరించాలి.

- సదానందం, పవర్‌సిటీ రంగంపేట్, మంచిర్యాల

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9010204423

న్యూస్ బాక్స్

పాఠశాలకు కంప్యూటర్ సామాగ్రి అందజేత



సామాగ్రి అందజేస్తున్న ఐసీఎస్‌డీఎం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎల్‌ఐసీ మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కంప్యూటర్ సామాగ్రి అందజేశారు. ప్రింటర్, స్కానర్, జిరాక్స్, 10 వైట్‌బోర్డులు అందించారు. కరీంనగర్ ఎస్‌డీఎం వై. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతీ ఏటా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ఎల్ఐసీ జి.ఎస్ పురుషోత్తం, బ్రాంచ్‌మేనేజర్ ఐ.రాంకిషన్, ఏబీఎం బి. సాంబయ్య, పాఠశాల హెచ్‌ఎం లచ్చిరాం పాల్గొన్నారు.

కబడ్డీ విజేత జయరాణి విద్యార్థులు



విద్యార్థులతో జయరాణి యాజమాన్యం

జన్నారం: ఏనుగు లింగారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన మండలస్థాయి కబడ్డీ పోటీల్లో జయరాణి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. జయరాణి హైస్కూల్ విద్యార్థులకు రూ.3 వేలు నగదుతో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతి ఏఆర్ఎస్ పాఠశాల విద్యార్థులకు రూ.1 వెయ్యితో పాటు ట్రోఫీ స్టేట్‌బ్యాంకు మేనేజర్ జయప్రకాశ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో స్లేట్ హైస్కూల్ కరస్పాండెంట్ సుభాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

సూచనలు పాటిస్తే గణితం సులభం



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఈవో

మంచిర్యాలసిటీ: ఉపాధ్యాయుడి సూచనలు పాటిస్తే గణితం ప్రతి విద్యార్థికి సులభమేనని డీఈవో డాక్టర్ కె రవికాంత్‌రావు స్పష్టం చేశారు. పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో బుధవారం గణితం క్లబ్‌ను డీఈవో ప్రారంభించారు. గణితం కఠినంగా ఉంటుందని ఎక్కువ మంది విద్యార్థులు భయపడతారని, క్రమం తప్పకుండా క్లాస్‌కు హాజరయితే సులభంగా ఉంటుందన్నారు. ఎంఈవో దాసరి శ్రీనివాస్, హెచ్‌ఎం బోబిన్, డీన్ సురేష్ ఉన్నారు.

డీఈవో రవికాంత్‌రావు

ఉపాధ్యాయుడికి 'బంజారా కీర్తిపురస్కార్'



అవార్డుతో భిక్షపతినాయక్

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మాలవత్ భిక్షపతి నాయక్ బంజారా కీర్తిపురస్కార్ అవార్డు అందుకున్నారు. బంజారా సమాచార్ మాసపత్రిక ఆధ్వర్యంలో ఏటా ఈ అవార్డు అందజేస్తున్నారు. మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతీలో రామన్‌మెగాసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్, ఎంపీ సీతారాంనాయక్, ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, శంకర్‌లు అవార్డుతో సత్కరించారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

మంచిర్యాలసిటీ: ప్రతి ఒక్కరూ దివ్యాంగులను ఆదుకోవాలని మంచిర్యాల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అర్చన్ కోరారు. బుధవారం పట్టణంలోని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రిన్సిపాల్‌తో పాటు ఎన్‌పీడీవో కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు సౌకర్యాలు, సదుపాయాలు సమకూర్చితే వారు మరింత ఎదగడానికి అవకాశాలు ఉంటాయన్నారు.

సమాచారం

అటవీశాఖ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన, షెడ్యూల్ కులాలు, వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువతీయువకులకు ఐటీడీఏ అధీనంలోని పూర్వ పరీక్ష శిక్షణ కేంద్రం ద్వారా ఇచ్చే ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఆర్వీ కర్ణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం త్వరలో భర్తీ చేయనున్న అటవీ బీట్ అధికారుల ఉద్యోగ రాత పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు.శిక్షణ కేంద్రంలో ఎస్టీలకు 75 సీట్లు, ఎస్సీలకు 15, బీసీలకు 10 సీట్లు, 33 శాతం మహిళలకు , 3 శాతం దివ్యాంగ అభ్యర్థులకు కేటాయించామన్నారు. అటవీ బీట్ అధికారుల ఉద్యోగ పరీక్షకు పోటీ పడే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రిజిస్ట్రేషన్ ఫారంతో www.studycircle.cgg.gov.inలో వచ్చే నెల 6 వరకు అభ్యర్థుల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 10న దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం సెప్టెంబర్ 21 నుంచి ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2 లక్షలలోపు సంవత్సరపు ఆదాయం ఉండాలన్నారు. దరఖాస్తుదారులు కులం, విద్యా అర్హత పత్రాలు పరి శీలనకు తీసుకురావాలన్నారు. వివరాలకు 9440902151కు సంప్రదించాలన్నారు.

చత్రపతి సాహూ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో..

మంచిర్యాలక్రైం: అటవీశాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు చత్రపతి సాహూ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డీఎఫ్‌వో ప్రభాకర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా అటవీశాఖ కార్యాలయంలో బుధవారం ఉచిత శిక్షణ పోస్టర్ ఆవిష్కరించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన సీహూ స్టడీ సర్కిల్ యాజమాన్యాన్ని అభినందించారు. స్టడీ సర్కిల్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక ఎంవీఎన్ డిగ్రీ కళాశాలలో నిరుపేద విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్ సౌకర్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. చత్రపతి సాహూ మహరాజ్ సంఘర్షణ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు విక్రం, రవీందర్ పాల్గొన్నారు.

జనవరి నుంచి 'భగీరథ' నీళ్లు

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

- బెల్లంపల్లిలో స్వచ్ఛభారత్ అవగాహన సమావేశం



మాట్లాడుతున్న మంత్రి ఐకే రెడ్డి

బెల్లంపల్లి: రాష్ట్రంలో వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లు అందిస్తామని గృహనిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం బెల్లంపల్లి పద్మశాలి భవన్‌లో స్వచ్ఛభారత్ మిషన్‌పై అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్లనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని అన్నారు. నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులకు కేసీఆర్ కిట్లు అందిస్తుండటంతో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం 31 జిల్లాలను ఏర్పాటు చేశామన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో వచ్చే నెల 15 నుంచి డిసెంబర్ వరకు సర్వే జరుగుతుందని వివరించారు. ఈఏడాది చివరినాటికి ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి, ఇంకుడుగుంత నిర్మించుకోవాలన్నారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ తదితరులు మాట్లాడుతూ ఓడీఎఫ్‌పై అవగాహన కలిగించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.నర్సింగం, మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతారాణి, ఎంపీపీలు సుభాష్‌రావు, శ్రీదేవి, ఆర్డీఓ వీరన్న, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

4న చెస్ పోటీలు

మంచిర్యాలస్పోర్ట్స్: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సెప్టెంబర్ 4న జిల్లా స్థాయి అండర్–14,17 విభాగం చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రేనె రాజన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14 విభాగంలో పాల్గొనేవారు ఇద్దరు చొప్పున బాల,బాలికలు, అండర్–17 విభాగంలో ఇద్దరు చొప్పున బాల, బాలికలు ప్రతీ పాఠశాల నుంచి ఎనిమిది మందికి మించకుండా పోటీలో పాల్గొనడానికి అవకాశం ఉందన్నారు. పోటీకి వచ్చే క్రీడాకారులు చెస్‌సెట్‌తో హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు. వివరాలకు ఏ ప్రసాద్ 8106190358 నంబర్‌లో సంప్రదించి, తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా రాజన్న కోరారు.

బాస్కెట్‌బాల్ పోటీలు

సెప్టెంబర్1న అండర్–17 విభాగం బాల, బాలికల జోనల్ ఆదిలాబాద్ జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఎస్‌జీఎఫ్ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రేనె రాజన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కార్మల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు.పాల్గొనే క్రీడాకారులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన బోనాఫైడ్ సర్టిఫికెట్టుతోపాటు ఆధార్ కార్డుతో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఫ్రాన్సిస్‌ను సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

రేపు బాస్కెట్‌బాల్ పోటీలు

మంచిర్యాలస్పోర్ట్స్: సెప్టెంబర్ 1న సబ్ జూనియర్ బాలబాలికలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని కార్మల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ రిన్సీ, అసోషియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘునాథరెడ్డి, ఫ్రాన్సిస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జోనల్ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న డీటీవో గంగారాం

ఖేల్

మంచిర్యాలస్పోర్ట్స్: మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా జోనల్ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా డీటీవో గంగారాం ప్రారంభించారు. జోనల్ పరిధిలో ఎంపికైన అండర్–14,17 బాల, బాలికల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో డీవైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రాజన్న, డాక్టర్ దాసారపు శ్రీనివాస్, డాక్టర్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మీనారెడ్డి, బెల్లం శ్రీనివాస్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ రెడ్డి ఉన్నారు.

అఖిలభారత ఖేల్‌ఖుద్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ ప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శిశుమందిర్ విద్యార్థులు క్యారంలో అఖిలభారత ఖేల్‌ఖూద్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 27, 28 తేదీల్లో గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన క్షేత్ర స్థాయి ఖేల్‌ఖూద్(క్యారం) పోటీల్లో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు రంగు వెంకటేశ్, మొహర్లె గణపతి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో కర్నాటక, ఆంధ్రప్రదేశ్ జట్లతో తలపడి విజయం సాధించారు. వీరు డిసెంబర్ 1, 2 తేదీల్లో తమిళనాడులో జరిగే అఖిలభారత స్థాయి క్యారం పోటీల్లో పాల్గొననున్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధి పసర్తి మల్లయ్య బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెమెంటో అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి గుర్రాల వెంకటేశ్వర్లు, అక్కు విజయ్‌కుమార్, హెచ్‌ఎం గుండేటి కోటేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక సేవ

వంద అనాథశవాలకు అంత్యక్రియలు

మంచిర్యాలక్రైం: మంచిర్యాలలోని కల్వరి యువశక్తి సొసైటీ నిర్వాహకుడు ములు కల కుమార్ బుధవారం ఓ అనాథ శవానికి అంత్యక్రియలు చేశారు. కుమార్ ఇప్పటి వరకు వంద అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడంతో పలువురు అభినందించారు. కల్పన (30) అనే మహిళను గుర్తు తెలియని వ్యక్తులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వెళ్లిపోయారు. కల్పనను చూసుకునే వారు ఎవరు లేకపోవడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ యశ్వంత్‌రావు కల్వరి ఆనాథ వృద్ధుల ఆశ్రమంలో ఏప్రిల్ 13న చేర్పించారు. అప్పటి నుంచి కల్వరిలోనే ఉంటూ బుధవారం మృతి చెందినట్లు కుమార్ తెలిపారు. స్థానిక ఎస్సై ఆకుల అశోక్ పంచనామా నిర్వహించారు. ఆయన అనుమతితో అంత్యక్రియలు చేసినట్లు తెలిపారు.



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కల్వరి సభ్యులు

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో కేవలం తొమ్మిది నెలల్లోనే పూర్తిచేసిన భక్తరామదాసు ప్రాజెక్టు సైతం పాలేరు రిజర్వాయర్‌పై నిర్మించిందే. దీన్ని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా నాలుగు మండలాల పరిధిలోని 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది.


పాలేరు నిండాలంటే కావాల్సిన నీరు: 0.7 టీఎంసీలు

ప్రాజెక్ట్ రిపోర్టు

- **18,000** ఎకరాలు.. రిజర్వాయర్ వైశాల్యం
- **23** అడుగులు పూర్తిస్థాయి నీటిమట్టం
- **2.55** టీఎంసీలు నీటి నిలువ సామర్థ్యం
- **18.75** అడుగులు ప్రస్తుత నీటిమట్టం

పాలేరు.. పరవళ్లు

ఖమ్మం జిల్లాలోని 16 మండలాల పరిధి ఆయకట్టుకు జీవం



ఖమ్మం జిల్లా నుంచి వాకెపల్లి హన్మంతరెడ్డి :

పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఖమ్మం జిల్లాలోని 16 మండలాల ప్రజలకు జీవనాధారం. మత్స్యసంపదకు నెలవు. నాగార్జునసాగర్ ఎడమ కాలువను పాలేరుతోనే అనుసంధానం చేశారు. జిల్లాలో సాగర్ రెండో జోన్ ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. ఖమ్మం నగర ప్రజలతోపాటు వందలాది గ్రామాల ప్రజల దాహార్తిని పాలేరు రిజర్వాయర్ తీరుస్తున్నది.

లక్షలాది ఎకరాలకు సాగునీరు




పాలేరు రిజర్వాయర్ నుంచి ఎడమ కాలువ ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. జిల్లాలో 16 మండలాల్లో 80 కిలోమీటర్ల మేర కాలువను నిర్మించారు. దీని ఆయకట్టు పరిధిలో 2.80 లక్షల ఎకరాల్లో వరి, మరో 3 లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగవుతున్నాయి. పాలేరు పాతకాలువ ద్వారా కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో వరి, చెరకు పంటలకు నీరిస్తున్నారు.


గేట్లు ప్రత్యేకం



ఇక రిజర్వాయర్‌కు ఏర్పాటు చేసిన గేట్లు ప్రత్యేకం. రిజర్వాయర్ నిండితే దానికి ఎటువంటి ప్రమాదం లేకుండా వాటంతట అవే పడిపోయేలా ఫాలింగ్ గేట్లు అమర్చారు.

కొన్నాళ్లుగా కష్టాలు: సాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న పాలేరు రిజర్వాయర్‌కు కొన్నేళ్లుగా సాగర్ జలాలు సకాలంలో చేరకపోవడంతో జిల్లాలోని సాగర్ ఆయకట్టు రైతాంగం ఇబ్బంది పడుతోంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగర్ పూర్తిస్థాయిలో నిండక పాలేరుకు నీళ్లు రావడం లేదు. దీంతో రబీకి క్రాప్ హాలీడే ప్రకటించిన సందర్భాలున్నాయి.







గాడి మే గంజాయ్..

- ఒడిశా నుంచి తెలుగు రాష్ట్రాలకు రవాణా
- రైళ్లలో నిరంతర తరలింపు
- రవాణాకు ప్రొఫెషనల్స్‌ను వినియోగిస్తున్న వైనం
- వరుస పట్టివేతలు.. నార్కొటిక్స్ విభాగం ఆరా!



కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తూ వరంగల్ జీఆర్‌పీకి పట్టుబడిన ఒడిశాకు చెందిన గంజాయి ట్రాన్స్‌పోర్టర్లు

భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్లే కోణార్క్, సంబల్‌పూర్, నాగావళి, లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో గంజాయి ట్రాన్స్‌పోర్టర్లు నిత్యం ప్రయాణిస్తున్నారు. సాధారణ ప్రయాణికుల తరహాలో రైళ్లలో ఎక్కుతూ ట్రావెల్ బ్యాగుల్లో కేజీల కొద్దీ గంజాయిని తరలిస్తున్నారు. ఒక్క ట్రిప్పు గంజాయి సరఫరా చేస్తే రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు ట్రాన్స్‌పోర్టర్లకు గంజాయి వ్యాపారులు ఇస్తున్నారు. దీంతో ఒడిశాలో ఈ తరహా ట్రాన్స్‌పోర్టర్లు ఎక్కువయ్యారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదన వస్తుండడంతో వరంగల్ నగరానికి చెందిన కొందరు కూడా ట్రాన్స్‌పోర్టర్ అవతారం ఎత్తారు.

గంజాయ్ ఎక్స్‌ప్రెస్..

ఇటీవల తెలంగాణ సర్కార్ గంజాయి, డ్రగ్స్ అక్రమ వ్యాపారంపై కన్నెర్ర చేయడంతో రైళ్లలో గంజాయి రవాణా చేస్తున్న వారు వరుసగా అరెస్టు అవుతున్నారు.



వరంగల్ నుంచి అలువాల సదాశివుడు:

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం జోరుగా సాగుతోంది. హైదరాబాద్‌తోపాటు తెలుగు రాష్ట్రాల్లోని ద్వితీయ శ్రేణి పట్టణాలకు సైతం గంజాయి, డ్రగ్స్ వంటివి ఈజీగా చేరిపోతున్నాయి. ఇప్పటికే వేల సంఖ్యలో యువత మత్తుకు బానిస కావడంతో అక్రమార్కులు వ్యాపారాన్ని మరింత విస్తరిస్తున్నారు. అయితే ముఖ్యంగా ఒడిశా నుంచి నిత్యం వందల కేజీల గంజాయి తెలుగు రాష్ట్రాలకు చేరిపోతున్నట్టు ఇటీవల పట్టివేతలను చూస్తే తెలుస్తోంది. ఒడిశా రాష్ట్రంతోపాటు, ఆంధ్రప్రదేశ్ విశాఖ ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లో పండించిన గంజాయి పంటను శుద్ధి చేసి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ముంబైలకు తరలిస్తున్నారు. ఒడిశా నుంచి విశాఖపట్నం, విజయవాడ, కాజీపేట మీదుగా వచ్చే రైళ్లలో గంజాయి రవాణా నిత్యకృత్యమైంది.

పెరుగుతున్న పట్టివేతలు: జనవరి నుంచి ఇప్పటివరకు 14 కేసులు నమోదవగా 386 కిలోల గంజాయి పట్టుపడింది. జూలైలో నాలుగు కేసుల్లో వంద కిలోలకుపైగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడుతున్నందున ఈ మార్గం గుండా సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తే మేలు.

ఏసీ బోగీల్లోనూ..

గంజాయి రవాణా చేసే ట్రాన్స్‌పోర్టర్లు మొదట్లో జనరల్ బోగీల్లో ఎక్కువగా ప్రయాణించే వారు. జీఆర్‌పీ తనిఖీల్లోనూ జనరల్ బోగీల్లోనే గంజాయి ఆనవాళ్లు కనిపించేవి. కానీ గత కొద్ది రోజులుగా స్లీపర్‌క్లాస్, ఏసీ తరగతుల్లోనూ గంజాయి ట్రాన్స్‌పోర్టర్లు పట్టుబడుతుండటంతో రైల్వే వర్గాలు కలవరపడుతున్నాయి. తప్పని పరిస్థితిలో అన్ని బోగీల్లోనూ క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.

'కోణార్క్'లో నిత్యం!

వరంగల్‌కు చెందిన గంజాయి ట్రాన్స్‌పోర్టర్లను విచారించడం ద్వారా రవాణా తీరుతెన్నులు వెలుగుచూశాయి. ఉత్తర, దక్షిణ భారతదేశానికి సెంటర్ పాయింట్‌గా కాజీపేట రైల్వే సబ్ డివిజన్ ఉంది. ఒడిశా, ఏపీ, తమిళనాడు రాష్ట్రాల మీదుగా నార్త్ ఇండియాకు వెళ్లే రైళ్లు ఈ మార్గం ద్వారానే వెళ్లాలి. దీంతో ఈ మార్గాన్నే గంజాయి స్మగ్లర్లు ఎన్నుకొని సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. ఈ మార్గంలో ఒడిశా నుంచి విజయవాడ, వరంగల్, హైదరాబాద్ మీదుగా ముంబై వెళ్లే రైళ్లలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఒక్కటే ప్రతీరోజు ప్రయాణిస్తుంది. మిగిలిన రైళ్లు వీక్లీ, బైవీక్లీగా ఉన్నాయి. దీంతో స్మగ్లర్లు గంజాయి రవాణాకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను అధికంగా ఉపయోగించుకుంటున్నారు.

కుటుంబ సభ్యులుగా నటిస్తూ..



విశాఖపట్నం- విజయవాడ- కాజీపేట- బల్లార్షా రైల్వే మార్గం గంజాయి అక్రమ రవాణాకు కారిడార్‌గా మారింది. సాధారణ ప్రయాణికుల మాదిరిగా రైలెక్కి బ్యాగుల్లో గంజాయి సరఫరా చేస్తున్నారు. తరలించాల్సిన గంజాయి ఎక్కువగా ఉంటే స్త్రీ, పురుషులు కుటుంబ సభ్యుల్లా నటిస్తూ నాలుగైదు బ్యాగుల్లో తరలిస్తున్నారు. గంజాయి రవాణా వ్యవస్థీకృతం కావడంతో జీఆర్‌పీ సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఫలితంగా కోణార్క్‌లో నిత్యం ట్రాన్స్‌పోర్టర్లు పట్టుబడుతున్నారు.

గంజాయి ట్రాన్స్‌పోర్టర్లు ఉపయోగిస్తున్న రైళ్లు : కోణార్క్, లోకమాన్య తిలక్, సంబల్‌పూర్, నాగావళి ఎక్స్‌ప్రెస్ రైళ్లు..



జన్నారం సమీపంలోని జలపాతం

జన్నారం(ఖానాపూర్): అందాల జలపాతాన్ని చూడడానికి వందల మైళ్లు ఎందుకు ప్రయాణం.. మన తలాపునే మనసుకు హాయిగొలిపే జలపాతం ఉంది. పాలకుల నిర్లక్ష్యంతో తెరపైకి రావడం లేదు. జన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని సేవాదాస్‌నగర్ నుంచి అరకిలోమీటర్ దూరంలోని వాగు బండరాళ్లపై నుంచి జల సోయగాలు జాలువారుతున్నాయి. ఇక్కడికి ప్రతి ఆదివారం, సెలవు దినాల్లో స్థానికులు వస్తుంటారు. మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో జలపాతానికి ఆదరణ తగ్గింది. పదిహేనేళ్లుగా జారుడు బండ అని పిలువబడే ఈ జలపాతం వద్దకు వర్షాలంలో సందర్శకుల సంఖ్య పెరుగుతుంది. పర్యాటక శాఖ అధికారులు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరిస్తే మంచి పర్యాటక ప్రాంతమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో ఎత్తయిన బండరాయిని కొందరు పగులగొడుతుండడంతో మినీ జలపాతం మరికొన్ని రోజుల్లో కనుమరుగయ్యే ఆవకాశం ఉంది.

భోసిలో భక్తజన సందోహం

- పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తులు
- ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు
- మొక్కులు చెల్లించుకున్న ప్రముఖులు

తానూరు(ముథోల్): తానూరు మండలం భోసి గ్రామంలోని కర్ర గణపతిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. బుధవారం భైంసా ఆర్టీసీ డీఎం సారయ్య, ప్రముఖులు గణపతిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకుని ముడుపులు కట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రివేళలో వివిధ పాఠశాల విద్యార్థులు, కళాకారులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి.

కాలినడకన కర్ర గణపతికి ..

కర్ర గణేశుడి దర్శనానికి కాలినడకన వివిధ మండలాల నుంచి భక్తులు ఆధిక సంఖ్యలో చేరుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. రాత్రి వేళలలో నిర్వహించే హారతి కార్యక్రమాల్లో భక్తులు ఎక్కువగా పాల్గొంటుండడంతో ఆలయం జనసందోహంగా కనిపిస్తోంది. అనంత చతుర్థికి నిమజ్జనం చేయనుండడంతో రోజులు సమీపిస్తున్న తరుణంలో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.


ఆలయంలో హోమం


ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

సిల్వర్ జూబ్లీ గణనాథుడు


కిష్టంపేట ఆలయంలో పూజలందుకుంటున్న గణనాథుడు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో 'శ్రీ వీరాంజనేయ స్వామి' ఆలయంలో 25 ఏళ్లుగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్నారు. 1992 నుంచి ఆలయంలో వినాయక చవితి రోజున విగ్రహాన్ని ప్రతిష్టించి నవరాత్రులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నిత్యం భజనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ ఏడాది కూడా నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్నట్లు గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

- ఉమ్మడి జిల్లాలో హస్తకళలకు ఆదరణ క
- ఏళ్లుగా కొనసాగుతున్న కళాపోషణ
- మార్కెట్లో కానరాని డిమాండ్
- హస్తకళలకు గుర్తింపు దక్కినా ప్రయోజ
- ఇంకా అభివృద్ధి చెందని కళాకారులు
- ఆర్థిక సహాయం కోసం ఎదురుచూపుల
- కొత్త జిల్లాలు ఏర్పడ్డాక పట్టించుకునే వా

కెరమెరి(ఆసిఫాబాద్): *విసిరేసిన జీవితాలు.. చాలీచాలని బతుకులు.. 'వీటికి ఆదరణ ఎక్కు డుంది. శిల్పకళల్లో ఏముంది వేరే పని చూసు కోరాదు' అని ఎగతాళి చేసిన సందర్భాలు అనేకం. అయినా వాటన్నింటిని దాటుకుని తాతల కాలం నాటి వృత్తిపైనే ఆధారపడిన కుటుంబాలు ఎన్నో.. కళల్ని పోషిస్తున్న కళాకారులకు కుటుంబపోషణ భారమైంది. కానీ ఏదో ఒక రోజు తమ జీవితాలు మారుతాయని ఉమ్మడి జిల్లాలోని హస్తకళాకారులు ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజన కళాకారులపై ప్రత్యేక కథనం..*

ఉమ్మడి జిల్లాలో ఉన్న కళాకారుల వివరాలు

మండలం	కుటుంబాలు
కెరమెరి	25
జైనూర్	20
నిర్మల్	60
ఇచ్చోడ	2
గుడిహత్నూర్	5
వాంకిడి	10
నార్నూర్	2
ఆదిలాబాద్	3
తాంసీ	7



జాతీయ స్థాయిలో గుర్తింపు..

గడిచిన కొన్నేళ్లుగా హస్తకళల ద్వారా జీవనం సాగిస్తున్న కళాకారుల జీవితాల్లో మరుపురాని ఘట్టం. ఇన్నేళ్లుగా పడ్డ శ్రమకు గతేడాది జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. శిల్పకళపై ఆసక్తి పెరిగేలా గౌరవం దక్కింది. కెరమెరి మండలంలోని కెస్లాగూడ గ్రామానికి చెందిన శిల్పకళాకారుడు కోవ న్యానేశ్వర్‌కు 2016 నవంబర్‌లో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా 'శిల్పిగురు' అవార్డును అందుకున్నారు. దాంతో పాటు బంగారు పతకం, ఓ జ్ఞాపికను అందించారు. కేంద్రమంత్రులు శాలువాలతో సన్మానించారు. రూ. 2 లక్షల చెక్కును అందించారు. అనంతరం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతితో స్వయంగా భోజనం చేయడం మరుపురానిదని న్యానేశ్వర్ తెలిపాడు. దేశంలోని 69 మందికి జాతీయ అవార్డులు, 21 మందికి శిల్పిగురు అవార్డులు అందించారు. అందులో తెలంగాణ రాష్ట్రం నుంచి న్యానేశ్వర్‌కు శిల్పిగురు అవార్డు దక్కడం గర్వకారణం!

రువు

నం శూన్యం

రు కరువు



కళాకృతులు తయారు చేస్తున్న భూమేశ్వర్



కెస్లాగూడలో హస్తకళలను పరిశీలిస్తున్న స్టేప్ కమిషనర్ అబ్దుల్‌అజీం

ఎవరెవరు ఏం చేస్తారు..

హస్తకళలు మొత్తం ఐదు ఉన్నప్పటికీ కుమురం భీం జిలాల్లో శిల్పి, హస్తకళలు రెండే మనుగడలో ఉన్నాయి. జిల్లాలో ఇత్తడి, శిల్పి అనే రెండు కళలకు సంబంధించిన పరికరాలు తయారు చేస్తున్నారు. అందులో కెరమెరి మండలంలోని కెస్లాగూడ గ్రామంలో 25 కుటుంబాలు ఇత్తడితో పరికరాలు తయారు చేస్తుండగా, తాంసీ మండలం రాంపూర్‌లో ఏడు, జైనూర్ మండలంలోని ఉశేగాంలో 20 కుటుంబాలు ఇత్తడితో కళాఖండాలు తయారు చేస్తున్నారు. నిర్మల్‌లో 60 కటుంబాలు కొయ్య బొమ్మలు, ఇచ్చోడ మండలంలోని ఆడేగాం (కే)లో రెండు కుటుంబాలు రాతి విగ్రహాలు తయారు చేస్తున్నాయి. గుడిహత్నూర్‌లో ఐదు కుటుంబాలు భరోన్ క్రాఫ్ట్(దారంతో బట్టపై అల్లికలు, ఎంబ్రాయిడరీ) తయరు చేయడం. వాంకిడి మండలం ఖమానాలో 10 కుటుంబాలు వెదురుతో పరికరాలు, బొమ్మలు, ఇతర వస్తువులు తయారు చేస్తున్నారు. నార్నూర్ మండలంలోని ఖడ్కి(జి) గ్రామంలో రెండు కుటుంబాలు లక్కతో కళాకృతులు తయారు చేస్తూ జీవిస్తున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలో మూడు కుటుంబాలు అగర్‌బత్తీల తయారీలో నిమగ్నమయ్యాయి.



రాష్ట్రపతి చేతుల మీదుగా మెమొంటోను స్వీకరిస్తున్న న్యానేశ్వర్(ఫైల్)



ఇత్తడిని కరిగించి పోస్తున్న చిత్రం



కెస్లాగూడలో హస్తకళలను పరిశీలిస్తున్న తెలంగాణ హస్తకళా సంస్థ ఎండీ శైలజారామయ్యార్

హస్తకళ తప్పుతోంది



శిల్పిగురు అవార్డుకు ఎంపికైన కళాకృతులు



ఉషేగాంలో తయారైన కళాకృతులు

పంచబ్రాహ్మణ కళలు

తెలుగులో..

వడ్రంగి, శిల్పి, కమ్మరి, కుమ్మరి, కంసాలి

సంస్కృతంలో..

మనబ్రహ్మ, మయబ్రహ్మ, క్లష్టబ్రహ్మ, శిల్పబ్రహ్మ, శిశ్వాల్పు బ్రహ్మ

శిక్షణ కల్పించాలి



ప్రస్తుతం మాకు తెలిసిన విద్యతో ఆకృతులు తయారు చేస్తున్నాం. కానీ కొత్తకొత్త ఆకృతులు తెలియాలంటే, తయారు చేయాలంటే శిక్షణ చాలా అవసరం. గతంలోనే ఐటీడీఏ పీవో సారు బస్తర్‌కు శిక్షణ కోసం పంపిస్తామన్నారు. కానీ నేటికీ ఎవరినీ పంపించలేదు.

– మడావి కేశవ్‌రావు, కెస్లాగూడ కెరమెరి

ఒకే చోట చేర్పించాలి



అందరినీ ఒకే చోట చేర్పించేందుకు గతంలోనే మండల కేంద్రంలో హస్తకళా భవనం మరమ్మతులు పూర్తయ్యాయి. వెనువెంటనే మరమ్మతులకు చేరింది. అధికారులు మరింత చొరవ చూపి త్వరలో చేర్పించాలి. ఇతర పనులు పూర్తి చేయాలి.

– కోవ న్యానేశ్వర్, శిల్పి అవార్డు గ్రహీత

జీసీసీ నుంచి మైనం అందించాలి



జీసీసీ నుంచి మైనం, ఇత్తడి తదితర సామగ్రిని అందించాలి. ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదు. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాం. ప్రభుత్వం సహాయం అందిస్తే బాగుపడతాం. ఒక్క కెస్లాగూడ గ్రామంపైనే శ్రద్ధ చూపుతున్నారు. మా గ్రామాన్ని పట్టించుకుంటలేరు.

– సుర్పం గిరిజాబాయి, ఉశేగాం, జైనూర్

కళాకారులకు భరోసా

బర్ 23, 2016లో రాష్ట్ర యువజన సర్వీసుల కమిషనర్ మహ అబ్దుల్ అజీమ్ బెంగుళూరుకు చెందిన హ్యాండీ క్రాఫ్ట్ పరిశ్రమ డైరెక్టర్ నీలిమాతో కలిసి కెరమెరి మండలంలోని కెస్లాగూడలో కళలను పరిశీలించారు. హస్తకళలపై ఆధారపడుతున్న వారి కబాధకాలు తెలుసుకున్నారు. 2016 జనవరిలో తెలంగాణ కళల అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జైల మయ్యార్ కెస్లాగూడను సందర్శించి జాతీయ స్థాయిలో హస్తకళ గుర్తింపు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. మార్కెటింగ్‌కు యపడతామని హస్తకళాకారులను ఒకే చోట చేర్చి పనులు చేస్తా హామీ ఇచ్చారు. అదే ఏడాది ఫిబ్రవరి3న శ్రిష్టి ఆర్ట్స్ అండ్ డిజై క్నాలజీ, హ్యాండీ క్రాఫ్ట్ టెక్నాలజీ బెంగుళూరుకు చెందిన రిసెర్చ్ ర్స్ కెస్లాగూడను సందర్శించారు. హస్తకళా భవనం ఏర్పాటు నెల గడుస్తున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు.

పట్టింపు కరువు..

గతేడాది వరకు రాష్ట్ర అధికారులు కెస్లాగూడను సందర్శించి హామీలు గుప్పించారు. ఇప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా వీరి వైపు కన్నెత్తి చూడడం లేదు. గతేడాది వరకు కళాకారులను ఆదుకుంటామన్న ఐటీడీఏ కూడా పట్టించుకోవడం లేదు.

ఆదరణేది?

గతేడాది అక్టోబర్‌లో ఏర్పడిన కొత్త జిల్లాల తర్వాత కెరమెరి మండలం కుమురం భీం జిల్లాలో చేరింది. అయినప్పటికీ కళాకారులకు ఆదరణ లభించట్లేదు. ఉమ్మడి జిల్లాలో ఐటీడీఏ పీవో కర్ణణ్ శ్రద్ధ చూపగా ఆయన పదోన్నతిపై మంచిర్యాల కలెక్టర్‌గా వెళ్లడంతో ప్రస్తుతం కళాకారులను పట్టించుకునే వారు కరువయ్యారు.

ఆదుకున్న ‘లేపాక్షి’

లేపాక్షి సంస్థ వీరు చేస్తున్న హస్తకళలను చూసి మార్కెటింగ్ చేస్తోంది. ఒక్కో కుటుంబం నెలకు 20 కిలోల శిల్పకళలను తయారు చేస్తుంది. వీరు తయారు చేసిన వస్తువులను గతేడాది వరకు లేపాక్షి అధికారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం వారసంతల్లో అమ్ముతూ కాలం గడుపుతున్నారు. వారు చేస్తున్న ఆకృతుల్లో గుడి గంటలు, తాబేలు, గహాలంకారం, పూజ సామగ్రి, దీపాలు, దేవుళ్లు, నాయకుల ప్రతిమలు, ఎద్దులు, జాతీయ జంతువులు తదితర ప్రతిమలు రూపు దిద్దుకుంటున్నాయి.



ఏడు రోజుల పని విధానం వ్యతిరేకిస్తాం

ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య



మాట్లాడుతున్న ముస్కె సమ్మయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): కోలిండియా యాజమాన్యం ప్రతిపాదించిన ఏడు రోజుల పని విధానాన్ని వ్యతిరేకిస్తామని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య తెలిపారు. ఆర్కే 8 గనిపై బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ నేడు నిర్వహిస్తున్న వేజ్‌బోర్డు సమావేశంలో కార్మికులకు అభ్యంతరకరంగా ఉన్నవాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. మెరుగైన వేతన ఒప్పందానికి యాజమాన్యం ముందుకు రాకుంటే సమ్మెకు కూడా వెనుకాడబోమని వెల్లడించారు. 3 నెలల బోనస్‌ను మస్టర్లతో ముడిపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించామన్నారు. సిక్ లీవులకు ఎన్‌క్యాష్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌డీల పెంపు కోసం కోలిండియా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చామన్నారు. ఎల్‌టీసీ లీవులకు కూడా లమ్‌సమ్ ఎమౌంట్ పద్ధతిలో ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. సర్వీసు వెయిటేజ్ ఇంక్రిమెంట్లు, ఇతర డిమాండ్లపై కూడా చర్చలు జరుగుతాయన్నారు. మొదటి కేటగిరి కార్మికుడికి మినిమం గ్యారెంటీ బెనిఫిట్ రూ. 4900 లుగా, 4 శాతం స్పెషల్ అలవెన్సులు ఇవ్వడానికి కోలిండియా యాజమాన్యం ఒప్పుకుందన్నారు. దీంతో సుమారు రూ. 6 వేల వేతనం మొదటి కేటగిరి కార్మికునికి పెరుగుదల ఉంటుందన్నారు. మిగితా అంశాలపై నేడు జరిగే చర్చల్లో చర్చిస్తామన్నారు. వేతన ఒప్పందంపై అవగాహన లేని టీబీజీకేఎస్ తమను విమర్శించడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచీ సెక్రెటరీ కొట్టె కిషన్‌రావు, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంకటేశ్వర్‌రావు, ఫిట్ సెక్రెటరీ బాల్‌రెడ్డి, నాయకులు ఆర్ల పోశం, మోతె నారాయణ, జక్కుల నారాయణ, చంద్రయ్య, భీమిని పోశం, కొమురయ్య పాల్గొన్నారు.

మెరుగైన వేతన ఒప్పందంలో విఫలం

టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): కార్మికులకు నష్టం కలిగించేలా 10వ వేతన ఒప్పందం చేసుకువస్తే సహించేది లేదని టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆర్కే7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. జాతీయ సంఘాలన్ని కలిసి కార్మికులకు నష్టం చేసేలా ఒప్పందం చేసుకువచ్చే ప్రమాదం ఉందన్నారు. 18 మస్టర్లు ఉంటేనే మూడు నెలల బోనస్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఏడు రోజుల పనిదినాల ప్రతిపాదన విరమించుకోవాలన్నారు. 30 నెలల ఆవరేజ్‌తో పెన్షన్‌కు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. వేజ్‌బోర్డు చర్చల్లో లీవులు, స్పెషల్ అలవెన్సులపై చర్చించలేదన్నారు. పెన్షన్ మూల వేతనం పేరున సుమారు రూ.3500 రికవరీ చేయడం సరికాదన్నారు. 16 రోజులు మస్టర్లు ఉంటేనే అండర్ గ్రౌండ్ అలవెన్సు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెరుగైన వేతన ఒప్పందంలో జాతీయ సంఘాలు విఫలమయ్యాయని ఆరోపించారు. తాము గెలిచిన తరువాత సింగరేణిలో అవినీతిని పారద్రోలామని, వారసత్వ ఉద్యోగాలు, కార్మికులకు సొంతింటి పథకం సాధించి తీరుతామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వీరభద్రయ్య, సీహెచ్.అశోక్, కానుగంటి చంద్రయ్య, పానుగంటి సత్తయ్య, ఎం.రాఘవరెడ్డి, గంగయ్య, నెల్కి మల్లేశ్, ఫిట్ సెక్రెటరీ మొండయ్య, డి.శ్రీనివాస్, నాగయ్య పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌కు అండగా నిలవండి

- యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్

రామకృష్ణాపూర్(చెన్నూర్): గుర్తింపు సంఘంగా కార్మికులకు అనేక హక్కులు సాధించిన టీబీజీకేఎస్‌కు రాబోయే ఎన్నికలలో కార్మికులు అండగా నిలవాలని ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ కోరారు. రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో బుధవారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. తమ యూనియన్ ఆధ్వర్యంలోనే సింగరేణిలో కొత్తగా 5 వేల మందికి ఉద్యోగాలు సాధించామన్నారు. జాతీయ సంఘాల హయాంలో గోల్డెన్ హ్యాండ్ షేక్, అక్రమ డిస్మిస్‌ల పేరిట సుమారు 20వేల మంది కార్మికులను ఇంటికి పంపించారని ఆరోపించారు. ఏరియా ఆసుపత్రిని ఆధునికీకరించడంతో పాటు సిబ్బంది కొరతను కూడా తాము తీర్చామని చెప్పారు. మరిన్ని హక్కులు తమ యూనియన్ సాధిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం నాయకులు లక్ష్మణ్, బాపురావు, ముద్దసాని క్రిష్ణ, రాంబాబు, విమల పాల్గొన్నారు.

మారోమారు గుర్తింపు సంఘం మోసం

- ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ

మందమర్రి: గత ఎన్నికల్లో వారసత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామనే హామీతో గెలిచి ఐదేళ్లు పైరవీలు, పంచాయితీలతో కాలం గడిపిన టీబీజీకేఎస్ మరోమారు కార్మికులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం స్థానిక కేకే-1 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 10వ వేజ్‌బోర్డుపై కార్మికులకు లేనిపోని విషయాలను చెబుతూ జాతీయ కార్మిక సంఘాలపై బురదజల్లే విధంగా టీబీజీకేఎస్ నాయకత్వం ప్రయత్నిస్తోందన్నారు. వారసత్వం ఉద్యోగాలపై చేసిన ప్రకటనకు కట్టుబడి దరఖాస్తు చేసుకున్న కార్మికులను అన్‌ఫిట్ చేసి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఏఐటీయూసీలో చేరిన టీబీజీకేఎస్ కార్యకర్తలకు కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఏరియా ఉపాధ్యక్షుడు సోమిశెట్టి రాజేశం, భీమనాధుని సుదర్శన్, ఎస్.లక్ష్మన్, సత్యనారాయణ, రాయమల్లు, అంకతి సాయిలు, ఈర్ల సదర్శన్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌కు వ్యతిరేకంగా పని చేస్తాం

- వారసత్వ ఉద్యోగాల సాధన జేఏసీ

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ప్రకటించి ఎగొట్టిన టీబీజీకేఎస్‌కు వ్యతిరేకంగా పని చేస్తామని వారసత్వ ఉద్యోగాల సాధన జేఏసీ కన్వీనర్ కొమ్ముల శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని అడిగినందుకు గతేడాది టీబీజీకేఎస్ నాయకులు తమపై దాడిచేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం వారసత్వ ఉద్యోగాలు కల్పించకున్నా ప్రత్యామ్నాయ మార్గాలు చూపడం లేదన్నారు. వారసత్వ ఉద్యోగాల పేరుతో మోసం చేసిన టీబీజీకేఎస్, టీఆర్‌ఎస్‌ల ఓటమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్మిక బిడ్డలపై దాడి చేసిన టీబీజీకేఎస్ నేతలు ఓట్ల కోసం గనులపైకి వస్తున్నారని, వారికి తగిన గుణపాఠం చెప్పాలని కార్మికులను కోరారు. కమిటీ నాయకులు వడ్లాల సతీశ్, ఫయాజ్, ఎనగందుల వెంకటేశ్, రమేశ్, శ్రీనివాస్, సతీశ్, కుమారస్వామి పాల్గొన్నారు.

వాస్తవ లాభాలపై విచారణ జరపాలి

- కాగ్ డైరెక్టర్‌కు విన్నవించిన టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి

రామకృష్ణాపూర్(చెన్నూర్): 2016-17 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలపై విచారణ జరిపించాలని కాగ్ డైరెక్టర్‌కు విన్నవించినట్లు టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.సంజయ్‌కుమార్ తెలిపారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి 60 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తే రూ.1063 కోట్ల లాభాలు రాగా, 2016-17 ఆర్థిక సంవత్సరంలో 63.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి వస్తే కేవలం రూ.395 కోట్ల లాభాలు చూపటం ఏమిటని ప్రశ్నించారు. సింగరేణిపై ప్రభుత్వ జోక్యం ఎక్కువైందన్నారు. బతుకమ్మ, హరితహారం, పుష్కరాలు, సీఎసీఆర్ పేరిట సంస్థ నిధులను పక్కదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఎన్‌టీపీసీకి వచ్చిన లాభాలను కూడా సంస్థ చూపటం లేదన్నారు. కాగ్ జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

17న మందమర్రిలో కార్మికపోరు....

టీడీపీ ఆధ్వర్యంలో వచ్చేనెల 17న మందమర్రిలో కార్మిక పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంజయ్ తెలిపారు. దీనికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డితో పాటు నేతలు ఎల్.రమణ, ఇ.పెద్దిరెడ్డి, బోడ జనార్దన్ తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో నాయకులు గోపురాజం, లక్ష్మీనర్సయ్య, వెంకటేష్, శేఖర్, ప్రతాప్, సాగర్, రవి, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం



అధికారులను సన్మానిస్తున్న పర్సనల్ డిపార్టుమెంట్ ఉద్యోగులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంటులో పని చేసిన ఇద్దరు అధికారులను ఆ డిపార్టుమెంట్ అధికారులు, సిబ్బంది బుధవారం సన్మానించారు. డీజీఎం(పర్సనల్) జె.కిరణ్ బెల్లంపల్లి ఏరియాకు బదిలీ అయ్యారు. ఆఫీస్ సూపరింటెండెంట్‌గా చేసి రిటైర్డ్ అయిన ఎస్.వెంకటేశ్వర్లును ఈ సందర్భంగా శాలువతో సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. డీజీఎం(పర్సనల్) చిత్తరంజన్‌కుమార్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు, ఫైళ్ల క్లియరెన్సులో వీరు ఎంతో ఓర్పుతో పరిష్కరించారని కొనియాడారు. పీఎం కిరణ్‌కుమార్, రాజేశ్వర్‌రావు, డీవైపీఎం తుకారాం, ఇన్‌చార్జి సూపరిండెంట్ ప్రభు, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ రాజన్న, పీఆర్‌పీ సంపత్‌కుమార్, నాగమణి, విశ్వేశ్వర్‌రావు, రాజయ్య, నవీన్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వాల్ రైటింగ్ నిషేధం

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలోని గనులు, డిపార్టుమెంట్లు, క్వార్టర్లు, ఇతర ఆస్తుల గోడలపై రాతలను నిషేధించినట్లు శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం పీవీ.సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన శ్రీరాంపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సంఘాలు తమ ప్రచారం కోసం వాల్‌రైటింగ్ చేయరాదన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో పారిశ్రామిక సంబంధాలు మెరుగుపర్చడం కోసం అన్ని యూనియన్లు తమకు సహకరించాలని కోరారు.

ఏఐటీయూసీతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న అక్బర్‌అలీ

రామకృష్ణాపూర్(చెన్నూర్): ఏఐటీయూసీ ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆ యూనియన్ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ అన్నారు. మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో బుధవారం ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల కాలంలో ఆ ధిపత్యం కోసం నేతలు కొట్లాడుకుంటూ సమయాన్ని వృథా చేశారు తప్ప కార్మికులకు చేసిందేమీ లేదన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు సాధించకపోతే ఓట్లు అడగమని చెప్పిన టీబీజీకేఎస్ నేతలు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని గనులపైకి వస్తున్నారని దుయ్యబట్టారు. మెరుగైన 10వ వేతన ఒప్పందం, పెన్షన్ పెంపు, క్యాడర్ స్కీంలు తదితర సమస్యలు జాతీయ సంఘమైన ఏఐటీయూసీ ద్వారానే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు రామదుగు లక్ష్మణ్, మిట్టపెల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి మల్లయ్య, గంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు ఓట్లడిగే హక్కు లేదు



మాట్లాడుతున్న రమేశ్

జైపూర్(చెన్నూర్): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యేలకు ఓట్లు అడిగే హక్కు లేదని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు పేరం రమేశ్ అన్నారు. ఇందారం1ఏ గనిపై బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాల నుంచి ఎమరెన్సీ తలపించే విధంగా యాజమాన్యం ప్రవర్తిస్తున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు కార్మికుల పక్షాన నిలువలేదన్నారు. రాజకీయ పార్టీలు అసత్య ప్రచారం చేస్తూ కార్మికులను మోసం చేయాలని చూస్తున్నాయన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం యూనియన్‌లో పలువురు కార్మికులు చేరారు. వారిని కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు జీవన్ జోయల్, తిరుపతిగౌడ్, సారయ్య, కొమురయ్య, నర్సయ్య, భూమయ్య, మల్లేశ్, అశోక్, శ్రీనివాస్, సతీశ్, బాబురావు పాల్గొన్నారు.

వేజ్‌బోర్డుపై సందిగ్ధం

- బుధవారం రాత్రి వరకు రాంచీలో కొనసాగిన చర్చలు
- కొత్తగా ఏడు రోజుల పనివిధానం ప్రతిపాదించిన యాజమాన్యం
- ససేమిరా అంటున్న జాతీయ కార్మిక సంఘాలు

కోల్‌బెల్ట్(భూపాలపల్లి జిల్లా): దేశంలోని బొగ్గు రంగ పరిశ్రమల్లో పనిచేస్తున్న గని కార్మికుల వేతనాలు, అలవెన్స్‌ల పెంపు విషయంలో సందిగ్ధం నెలకొంది. పదో వేతన ఒప్పందం అమలు కోసం జాతీయ కార్మిక సంఘాలు, కోలిండియా యాజమాన్యం మధ్య ఇప్పటి వరకు జైపూర్, కేరళ, ఢిల్లీ, కోల్‌కతా రాంచీలలో ఎనిమిది సార్లు చర్చలు జరిగాయి. అన్నిసార్లూ అర్ధంతరంగానే ముగిశాయి. ఇప్పటి వరకు చర్చించిన అంశాలపై డ్రాఫ్ట్ తయారు చేసి కార్మిక సంఘాల ముందు ఉంచారు. దీనికి జాతీయ కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, బీఎంఎస్‌లు అంగీకరిస్తే ఈ నెల 31న(నేడు) పదో వేతనం ఒప్పందం కుదరనుంది.

> తొమ్మిదో వేతన ఒప్పందం 01–07–2011 తేదీ నుంచి 30–06–2016వ తేదీ వరకు అమలు జరిగింది. కార్మికుల, ఉద్యోగుల వేతనాలు 25 శాతం పెంచి చెల్లించారు. 01–07–2016వ తేదీ నుంచి పదో వేతన ఒప్పందం అమలు కావాల్సి ఉంది.

యాజమాన్య వైఖరిపై కార్మిక సంఘాల ఆగ్రహం

ఏడు రోజుల పనివిధానం అమలు చేయాలని ప్రయత్నిస్తుండగా జాతీయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కార్మిక సంఘాల డిమాండ్లు అంగీకరించాలంటే, ఈ విధానానికి ఒప్పుకోవాలని ముడి పెడుతోంది. యాజమాన్యం పట్టు వీడకపోతే కార్మిక సంఘాలు ఒప్పందానికి అంగీకరించని పరిస్థితి నెలకొంది. ఏడో రోజుల పనివిధానమంటే శ్రమ దోపిడేనని, అవసరమైతే సమ్మెకు దిగుతామని కొన్ని జాతీయ కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఈ నెల 24, 25 న జరిగిన చర్చల్లో ప్రధానంగా ఏడు రోజుల పని విధానం, ఇంటి కిరాయి, అటెండెన్స్ బోనస్, అండర్ గ్రౌండ్ అలవెన్సును వాస్తవ హాజర్లతో ముడిపెట్టడం వంటి పలు అంశాలను జాతీయ సంఘాలు అంగీకరించలేదు. ఏడు రోజుల పని విధానం ఒప్పుకుంటే కంపెనీకి రూ. 1100 కోట్లు మిగులుతాయని, అటువంటి క్రమంలో 20 శాతం ఎంజీబీని ఇవ్వగలమని యాజమాన్యం వెల్లడించగా యూనియన్‌లు నిరాకరించాయి. యాజమాన్యం దీంతో ఈనెల 29, 30వ తేదీల్లో మరో మారు డ్రాఫ్ట్ కమిటీ సమావేశం రాంచీలో నిర్వహించింది. చర్చల వివరాలు ఇంకా తెలియరాలేదు. డ్రాఫ్ట్ కమిటీలో తయారు చేసిన డిమాండ్లపై తుది చర్చల అనంతరం కోల్‌కతాలో ఈనెల 31న జేబీసీసీఐ సమావేశం నిర్వహించి 10వ వేతన ఒప్పందంపై పూర్తిస్థాయి ఎంఓయూ నిర్వహిస్తామని కోల్ ఇండియా లిమిటెడ్ ప్రకటించింది.

జాతీయ సంఘాల ప్రధాన డిమాండ్లు

1. కనీస వేతనం 50 శాతం పెంపు
2. ఇంక్రిమెంట్ రేటు 6 శాతం పెంపు
3. డీఏ 100 శాతం న్యూట్రలైజేషన్
4. అండర్‌గ్రౌండ్ అలవెన్సు పెంపు
5. ఇంటి అద్దె పెంపు కొత్త బేసిక్‌పై 10 శాతం పెంపు
6. లీవుల పరిమితిని పెంచాలి
7. ఎల్‌టీసీ, ఎల్‌ఎల్‌టీసీల పెంపు
8. వలంటరీ రిటైర్‌మెంట్ స్కీం కొనసాగింపు
9. 40 శాతం పెన్షన్ పెరుగుదల
10. గ్రాట్యూటీపై సీలింగ్ రూ.10 లక్షల నుంచి 20 లక్షలకు పెంపు
11. రిటైర్డ్ కార్మికులకు మెడికల్ సదుపాయం
12. నూతన భూగర్భ గనుల ఏర్పాటు
13. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలను పెంచి పర్మనెంట్ చేయాలి.

ఇప్పటివరకు చర్చించిన అంశాలపై డ్రాఫ్ట్ నోటు ఇలా..

- 10వ వేతన ఒప్పందం 01.07.2016 నుంచి ఐదేళ్ల పాటు కొనసాగుతుంది.
- 9వ వేతన ఒప్పంద కాలంలో ఉన్న వారందరికి దీని పరిధిలోకి వస్తారు.
- కనీస పెరుగుదల 30.06.2016న ఉన్న బేసిక్+ఎస్‌డీఏ+వీడీఏ+10 శాతం అటెండెన్స్ బోనస్ మీద 20 శాతం ఉంటుంది.
- 100 శాతం డీఏ న్యూట్రలైజేషన్ చేస్తారు.
- యాన్యువల్ ఇంక్రిమెంట్ బేసిక్ వేతనం మీద 3 శాతం ఉంటుంది.

అలవెన్సులు.

ఎ)అండర్ గ్రౌండ్ అలవెన్సు: 30.06.2016 ఉన్న బేసిక్ మీద 12.5 శాతం లెక్కించి దాని మీద 20 శాతంకలిపి వచ్చిన అమౌంట్ ఫ్రీజ్, అదేఅమౌంట్‌ను 10వ వేతన ఒప్పంద కాలంలో చెల్లిస్తారు.

బీ)స్పెషల్ అలవెన్సు 4శాతం: 01.07.2016న ఉన్న బేసిక్ మీద 4 శాతం లెక్కించి వచ్చిన అమౌంట్‌ను ఫ్రీజ్ చేసి అదే మొత్తం 10వ వేతన ఒప్పంద కాలంలో చెల్లిస్ధారు.

సీ)ఇంటి కిరాయి: రూరల్ ఏరియాలో 2శాతం 01.07.2016లో ఉన్న బేసిక్ మీద లెక్కించి ఫ్రీజ్ చేసి అదే మొత్తం 10వ వేతన ఒప్పంద కాలంలో చెల్లిస్తారు.

డీ) స్పెషల్ డియర్‌నెస్ అలవెన్స్: బేసిక్ మీద 1.795 శాతం ఉంటుంది.

ఈ) ఇతర అలవెన్సులు 30.06.2016న ఏవిధంగా ఉన్నాయో అదే విధంగా 10వ వేతన ఒప్పంద కాలంలో చెల్లిస్తారు.

సోషల్ సెక్యూరిటీ స్కీం..

కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం స్థిరీకరణ మీద వేసిన కమిటీ రెకమండ్ చేసినట్లుగా రివైజ్డ్ చేసిన బేసిక్, వీడీఏ మీద యాజమాన్యం 7 శాతం చెల్లిస్తుంది. కార్మికుడి నుంచి మరో 7 శాతం రికవరీ చేస్తుంది.

కార్మిక హక్కులు పోగొట్టిన ఏఐటీయూసీ

హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్

గోదావరిఖని(పెద్దపల్లి జిల్లా): సింగరేణిలో హక్కులను పోగొట్టింది ఏఐటీయూసీ కార్మిక సంఘమేనని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్ ఆరోపించారు. బుధవారం జీడీకే–1వ గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గోల్డెన్ షేక్ హ్యాండ్ పేరుతో 22 వేల మందిని ఇంటికి పంపించిన ఘనత ఏఐటీయూసీదేనని విమర్శించారు. ఆస్పత్రులను మూసివేయించిందని, అండర్‌గ్రౌండ్ గనుల మూసివేత, ప్రైవేటీకరణ జరిపించిందన్నారు. నాయకులు యాదగిరి సత్తయ్య, షబ్బీర్ అహ్మద్, కనవేణి బాలయ్య, కన్నం సత్యనారాయణ, కొల్లూరి బాలయ్య, గోరుపాటి ఆనంద్, బి.మోహన్, కోండ్ర శంకర్, బండారి సాగర్, గౌహార్‌బేగ్, తూడి రామస్వామి, జూపాక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

బేషరతుగా డిపెండెంట్ ఉద్యోగాలివ్వాలి

మందమర్రి(మంచిర్యాల జిల్లా): షరతులు లేకుండా సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు అమలు చేయాలని సింగరేణి డిపెండెంట్ యువసేన అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేష్ డిమాండ్ చేశారు. వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరవధిక నిరహార దీక్షలు ప్రారంభించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడారు. సభ్యులు కందుల వెంకటేశ్, బరిగల సతీష్, జాన రాజ్‌గౌడ్, ముంజం రాకేష్, కోమ్ము సమ్మయ్య, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. దీక్షలకు వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వొడ్నాల సతీష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సంగి సంతోష్, టీడీపీ చెన్నూరు నియోజక వర్గ ఇన్‌చార్జి దుర్గం నరేష్, దళిత బహుజన పార్టీ కన్వీనర్ చీర్ల సత్యం, తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజ్, సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపారు.



దీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

665 పోస్టులు.. 47వేల దరఖాస్తులు

బదిలీ వర్కర్ల దరఖాస్తుకు మూడు రోజులే గడువు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో బదిలీ వర్కర్ల పోస్టులకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. 665 ఖాళీలు ఉండగా ఈ నెల 30వ తేదీ వరకు 47 వేల దరఖాస్తులు వచ్చాయి. గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ఇటీవల సింగరేణి యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

పదో తరగతి అర్హతతో నియమించే ఈ పోస్టులకు ఆగస్టు 7వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. సెప్టెంబర్ 2వ తేదీ వరకు గడువు ఉంది. దరఖాస్తుదారులు తమ హార్డ్ కాపీలను సెప్టెంబర్ 12వ తేదీలోగా సమర్పించవచ్చు. దరఖాస్తుల స్క్రూట్నీ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉందని, అనంతరం పరీక్ష తేదీ నిర్ణయిస్తామని సింగరేణి అధికార వర్గాలు తెలిపాయి.



దరఖాస్తు చేసుకునేందుకు బారులుదీరిన అభ్యర్థులు

యాజమాన్యం వినకపోతే సమ్మెకు వెనుకాడం

సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ(పెద్దపల్లి జిల్లా): ఈ నెల 31న జరిగే పూర్తిస్థాయి జేబీసీసీఐ సమావేశంలో కార్మికులకు వ్యతిరేకంగా ఒప్పందం ఉంటే తాము పూర్తిగా వ్యతిరేకిస్తామని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఈవిషయంలో యాజమాన్యం వినకుంటే సమ్మెకు కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏరా ్పటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సింగరేణిలో గెలుపొం దిన జాతీయ యూనియన్ ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్ కార్మికులను మోస ం చేశాయని విమర్శించారు. కొమురయ్య, హన్మంతు, తిరుపతి, కొమురయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, సుధాకర్, అహ్మద్ పాషా, ప్రభాకర్, నాగేశ్వర్‌రావు, గోపాల్, లక్ష్మయ్య, రాజయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మన మంచిర్యాల
సాక్షి మంచిర్యాల
గురువారం | ఆగస్టు | 31 | 2017



వెండితెర



మంచిర్యాలలో..
శ్రీవెంకటేశ్వర–
జయ జానకి నాయక
ఏషియన్ శ్రీనివాస –
ఫిదా
లక్ష్మి – అర్జున్‌రెడ్డి
మయూరి – నేనే రాజు నేనే మంత్రి
సీసీసీ...
తిరుమల(స్క్రీన్–1)–
జయ జానకి నాయక
దేవి(స్క్రీన్–2) –
అర్జున్‌రెడ్డి



రోడ్డుపై నాటేసి నిరసన

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మ నుంచి శనగకుంటకు వెళ్లే దారిలో మాదాపూర్ గోండు గూడెం సమీపంలో రోడ్డు పూర్తిగా బురదమయమైంది. నడవడానికి కూడా కష్టంగా మారింది. రోడ్డు మరమ్మతులపై ఎవరూ పట్టించుకోకపోవడంతో గిరిజనులతో పాటు అటువైపు పొలాలు ఉన్న రైతులు బుధవారం వినూత్న నిరసన తెలిపారు. బురద రోడ్డుపై వరి నాట్లు వేసి ఆందోళన చేపట్టరు. అధికారులు ప్రజా ప్రతినిధులు ఇకనైనా స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరారు.

Zone Guide

రేపటి నుంచి రైతు సమన్వయ సమితి గ్రామసభలు

లక్సెట్టిపేట: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి రైతు సమన్వయ సమితి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1న కొత్తూరు, వెంకట్రావుపేట, ఇటిక్యాల, ఎల్లారం, 4న మోదెల, లక్సెట్టిపేట, దౌడపల్లి, కొత్తూరు, గొల్లకోట, మిట్టపల్లి, 5న తిమ్మాపూర్, లింగాపూర్, బలరావుపేట, రంగపేట, పోతపల్లి, 6న జెండావెంకటాపూర్, తలమల, చందారం, చల్లంపేట, లక్ష్మీపూర్ గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

అటవీ ఉద్యోగాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ

మంచిర్యాలసిటీ: ఛత్రపతి సాహూ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అటవీశాఖ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు స్టడీ సర్కిల్ అధ్యక్షుడు కుడుదుల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 3 నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందే వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల వారు శిక్షణ కేంద్రంలో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఐచ్ఛిక సెలవులు ఇవ్వాలి

మంచిర్యాలసిటీ: ప్రతిఏటా ఇచ్చే ఐదు ఐచ్ఛిక సెలవులు పాఠశాలలకే ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ మంచిర్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.శాంతికుమారి, రామన్న బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులు పోరాటం చేసి 20 ఏళ్ల కిందట సాధించుకున్న హక్కును రాష్ట్ర విద్యాశాఖ పోగొట్టడం సరికాదన్నారు. ప్రస్తుతం ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేసి, పాత విధానాన్నే కొనసాగించాలని వారు కోరారు.

మహాధర్నా పోస్టర్లు విడుదల

జన్నారం: సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న తలపెట్టిన మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఎస్సై రమేశ్‌గౌడ్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోరుతూ 1న సామూహిక సెలవులు పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి, రాష్ట్ర సహ అధ్యక్షుడు నాసాని రాజన్న, చందులాల్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, సీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కుర్ర శేఖర్, నాయకులు మల్లేశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ నిరసన


మంచిర్యాలటౌన్: సీపీఎస్ వెంటనే రద్దు చేయాలని కోరుతూ టీఎన్‌జీవోస్ మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఉద్యోగులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ 1న జిల్లా, రెవెన్యూ, మండల కార్యాలయాల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేయాలని పిలుపునిచ్చారు. నిరసనలో టీఎన్‌జీవోస్ మంచిర్యాల కన్వీనర్ సురేశ్ బాబు, కార్యదర్శి జి. శ్రీహరి, బి.రామ్మోహన్, కిరణ్, గోపాల్, రమేశ్ రాజశేఖర్, రవి, యేసయ్య, పద్మలత పాల్గొన్నారు.

ఏకదంత..మమ్మేలుకోవా

• గణనాథుడికి కొనసాగుతున్న పూజలు • ప్రత్యేక నైవేద్యాలు సమర్పణ • పలుచోట్ల నిమజ్జనాలు



లక్సెట్టిపేట: గోదావరి రోడ్డులో 101 రకాల నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు



మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని రెడ్డికాలనీలో స్వామివారికి 108 రకాల నైవేద్యాలు సమర్పించిన భక్తులు



హాజీపూర్: వేంపల్లిలో పూజలు..



నస్పూర్: శివాలయంలో పూజలు..



జన్నారం: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



మంచిర్యాలఅర్బన్: వినాయక వేషదారణలో రెవిల్యూషన్ పాఠశాల విద్యార్థులు



లక్సెట్టిపేట: నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు..

వసతి గృహం పరిశీలన

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి గంగరాం బుధవారం పరిశీలించారు. వసతి గృహంలోని తరగతి గదులు, వంటశాల పరిశీలించి సౌకర్యాల గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచి ప్రణాళికతో చదివి మంచి గ్రేడ్ సాధించాలని సూచించారు. అనంతరం రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు.

ఆదరణ చూసి ఓర్వలేకే ఆరోపణలు

దండేపల్లి: మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావుకు లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మంచిర్యాలలో జరుగుతున్న భూకబ్జాలను మీడియా బయటపెట్టినందుకు టీఆర్ఎస్ నాయకులు ప్రేంసాగర్‌రావును నిందించడం సరికాదన్నారు. భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నిరు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు గడ్డం త్రిమూర్తి, అక్కల వెంకటేశ్వర్లు, కృష్ణ, బుచ్చన్న, ఉదయ్, మల్లేష్, సంతోష్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణపరిమితి పెంపు

దండేపల్లి: స్త్రీనిధి రుణ పరిమితి పెంచినట్లు జోనల్ మేనేజర్ విజయభాస్కర్ పేర్కొన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో బుధవారం దండేపల్లి, జన్నారం మండలాల స్త్రీనిధి రుణ గ్రేడింగ్ నిర్వహించారు. రుణాలకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. రుణ పరిమితిని రూ.1.2లక్షలకు పెంచినట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వడ్డీ 13.5 శాతం నుంచి 13 శాతానికి కుదించినట్లు వెల్లడించారు.

వివేకానందలో ఎంఆర్ వ్యాక్సినేషన్

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామం వివేకానంద పాఠశాలలో బుధవారం ఎంఆర్ వ్యాక్సినేషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మన్, రాజలింగు అధ్వర్యంలో విద్యార్థులు ఎంఆర్‌వీ ఆకారంలో కూర్చుని టీకా ప్రతి ఒక్కరూ వేయించుకోవాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకూ 9 వేల మంది పిల్లలకు ఎంఆర్ టీకా వేసినట్లు వైద్యాధికారి క్రాంతికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వేజర్లు ఆరెల్లి లక్ష్మన్, రాజలింగం, సుశీల, ఏఎన్‌ఎంలు విశ్వాస, అపరంజి, అనురాధ, పద్మావతి, లహన్‌బాయి, పోచయ్య, అంగన్‌వాటీ టీచర్ విజయలక్ష్మి, ఆశా వర్కర్లు శైలజ, సువర్ణ, భూమక్క, రాజేశ్వరి, పాఠశాల హెచ్‌ఎం ఎంఏ యాసీన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



ఎంఆర్ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

'మార్తాండ సూర్యాలయం' నిర్మాత ఎవరు?



ఎం. వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల.



జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. 'కవిరాజ మార్గం'ను అమోఘవర్షుడు ఏ భాషలో రాశాడు?
1) బెంగాలీ 2) సంస్కృతం
3) కన్నడం 4) మరాఠి

2. 'దిల్వారా జైనాలయం' ఎక్కడ ఉంది?
1) రాజస్థాన్ 2) గుజరాత్
3) బెంగాల్ 4) కర్ణాటక

3. కాలచూరుల (హైహయులు) రాజధాని?
1) కనోజ్ 2) త్రిపురి
3) మౌంట్ అబూ 4) ఢిల్లీ

4. గహద్వాల చంద్రదేవుడు విధించిన ప్రత్యేక పన్ను ఏది?
1) పురిటి సుంకం 2) గణాచారి సుంకం
3) పొయ్యి సుంకం
4) తురుష్క దండన సుంకం

5. కింది వాటిలో చాంద్‌బర్దాయ్ హిందీలో రాసిన గ్రంథం?
1) పృథ్వీరాజ్ రాశో 2) రాజస్థాన్ కథావళి
3) నైషధ చరిత్ర 4) శిశుపాల వధ

6. మధ్యప్రదేశ్‌లోని ఖజురహో దేవాలయాన్ని ఎవరు నిర్మించారు?
1) సోలంకీలు 2) చౌహాన్‌లు
3) చందేలులు 4) గహద్వాలులు

7. కింది వాటిలో సరైన జత ఏది?
1) విక్రమశిల విశ్వవిద్యాలయం – ధర్మపాలుడు
2) సోమనాథ దేవాలయం – ప్రభాస్ పఠాన్
3) మిహిర భోజుడు – ప్రతీహార వంశం
4) పైవన్నీ సరైనవే

8. మిహిరభోజుని ఆస్థానాన్ని సందర్శించిన అరబ్బు యాత్రికుడు ఎవరు?
1) సులేమాన్ 2) అబ్దుల్ రజాక్
3) ఫిరదౌసి 4) లేన్‌పూల్

9. జతపరచండి.

రాజవంశం	రాజధాని
i) చౌహాన్‌లు	a) అన్హిల్‌వాడ్
ii) పరమారులు	b) ఖజురహో
iii) సోలంకీలు	c) గౌర్
iv) చందేలులు	d) ధారానగరం
v) సేన	e) అజ్మీర్

1) i-a, ii-b, iii-c, iv-d, v-e
2) i-e, ii-d, iii-a, iv-b, v-c
3) i-a, ii-d, iii-c, iv-b, v-e
4) i-e, ii-d, iii-a, iv-b, v-c

10. పృథ్వీరాజ్ చౌహాన్ వివాహమాడిన గహద్వాల జయచంద్రుడి కుమార్తె ఎవరు?
1) శీలమహాదేవి 2) సంయుక్త
3) మాచల్దేవి 4) పద్మిని

11. మొదటి తరైన్ యుద్ధం ఏ సంవత్సరంలో జరిగింది?
1) క్రీ.శ. 1191 2) క్రీ.శ. 1192
3) క్రీ.శ. 1193 4) క్రీ.శ. 1194

12. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కల్నల్ టాడ్ – రాజస్థాన్ కథావళి
2) షానామా – ఫిరదౌసి
3) జగన్నాథాలయం – భువనేశ్వర్
4) హిందూ జాతీయ వీరుడు – పృథ్వీరాజ్ చౌహాన్

13. చందేవార్ యుద్ధ విజేత ఎవరు?
1) గజనీ మహమ్మద్
2) మహమ్మద్ ఘోరి
3) పృథ్వీరాజ్ చౌహాన్ 4) జయచంద్రుడు

14. 'ముంజేశ్వర' చెరువు ఎక్కడ నిర్మించారు?
1) ధారానగరం 2) ఢిల్లీ
3) అజ్మీర్ 4) జోధ్‌పూర్

15. తమ శీల సంరక్షణకు రాజపుత్ర స్త్రీలు ఆత్మహత్య చేసుకోవడాన్ని ఏమంటారు?
1) జనానా 2) జిజియా
3) జౌహార్ 4) సల్లేఖన

16. 'సమరాంగణ సూత్రధార' గ్రంథాన్ని పరమార భోజుడు ఏ అంశాలపై రాశాడు?
1) వాస్తు అంశాలు 2) రాజనీతి అంశాలు
3) యోగా అంశాలు
4) అలంకారశాస్త్ర అంశాలు

17. 'పంచరత్నాలు' అనే కవులను పోషించిన వారెవరు?
1) మొదటి భీమరాజు 2) లక్ష్మణసేనుడు
3) విజయసేనుడు 4) జయసింహుడు

18. కింది వాటిలో గాంగయ నరసింహదేవుడు నిర్మించిన నిర్మాణం ఏది?
1) సూర్యాలయం (మెంఢోరా)
2) సూర్యాలయం (అల్మోరా)
3) సూర్యాలయం (కోణార్క్)
4) కైలాసనాథాలయం (ఎల్లోరా)

19. టిబెట్‌లో అతిశదీపాంకరుడు ప్రచారం చేసిన బౌద్ధమత శాఖ ఏది?
1) మహాయానం 2) హీనయానం
3) తాంత్రికయానం 4) వజ్రయానం

20. 'జ్ఞానమే మోక్షానికి మార్గం' అని ప్రబోధించిందెవరు?
1) ఆదిశంకరాచార్యులు
2) రామానుజాచార్యులు
3) మధ్వాచార్యులు 4) వల్లభాచార్యులు

21. 'ప్రతీహారులు' అంటే..?
1) శిల్పులు 2) వ్యాపారులు
3) నావికులు 4) ద్వార పాలకులు

22. త్రైపాక్షిక పోరాటం రాష్ట్రకూట, పాల, ప్రతిహార రాజ్యాల మధ్య ఏ భూభాగం కోసం జరిగింది?
1) రాయచూర్ 2) కనోజ్
3) ఢిల్లీ 4) నవద్వీపం

23. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కందరీయ మహాదేవాలయం – ఖజురహో
2) గిరిజాదేవి శక్తి పీఠం – కటక్
3) ఉడిపి – కర్ణాటక
4) విఠలాలయం – హంపీ

24. 'రాజతరంగిణి' గ్రంథం ఎవరికి సంబంధించింది?
1) కశ్మీర్ రాజులు 2) సేన రాజులు
3) సోలంకీలు 4) పరమారులు

25. 'భారత చరిత్ర పితామహుడు' ఎవరు?
1) చాంద్‌బర్దాయ్ 2) జె.ఎన్. సర్కార్
3) కల్హణుడు
4) మామిడిపూడి వెంకటరంగయ్య

26. పృథ్వీరాజ్ చౌహాన్ (మూడో పృథ్వీరాజ్) రాణి సంయుక్తను ఏ విధమైన వివాహం చేసుకున్నాడు?
1) స్వయంవర వివాహం
2) రాక్షస వివాహం 3) బ్రహ్మ వివాహం
4) ప్రజాపత్య వివాహం

27. మహమ్మద్ బిన్ ఖాసీం సైన్యాలను ఎదుర్కొన్న దాహిర్ రాజు భార్య పేరు?
1) రాణీబాయి 2) పరిమళదేవి
3) సూరజ్‌దేవి 4) రాణి పద్మిని

28. అరబ్బులు హిందువులు, బౌద్ధులు ఇతర పాలితులను ఏమని వ్యవహరించారు?
1) జిమ్మీలు 2) త్రైవైఫ్‌లు
3) కాఫిర్‌లు 4) మ్లేచ్ఛులు

29. గజనీ మహమ్మద్ ధ్వంసం చేసిన శ్రీ చక్రస్వామి ఆలయం ఎక్కడ ఉంది?
1) కనోజ్ 2) మధుర
3) ముల్తాన్ 4) స్థానేశ్వరం

30. సోమనాథ్ దేవాలయాన్ని గజనీ మహమ్మద్ ఎప్పుడు ధ్వంసం చేసాడు?
1) క్రీ.శ. 1020 2) క్రీ.శ. 1022
3) క్రీ.శ. 1023 4) క్రీ.శ. 1025

31. కింది వాటిలో సరైంది ఏది?
1) కితాబ్–ఉల్–యామ్ని గ్రంథం – ఉత్బి
2) కితాబ్–ఉల్–హింద్ గ్రంథం – అల్‌బెరూనీ
3) బహ్మన్‌నామా గ్రంథం – అజారీ
4) పైవన్నీ సరైనవే

32. గజనీ మహమ్మద్ దండయాత్రను తొలిసారి ఎదుర్కొన్న హింద్‌షాహీ రాజు ఎవరు?
1) జయపాలుడు 2) ఆనందపాలుడు
3) త్రిలోచనపాలుడు 4) భీమపాలుడు

33. ఖజురహోలోని దేవాలయాలను ఏ శైలిలో నిర్మించారు?
1) ఇండో–గ్రీక్ 2) ఇండో–ఆర్యన్
3) ద్రావిడ 4) గోథిక్

34. జతపరచండి.

i) జయనకుడు	a) కుమారపాల చరిత్ర
ii) రాజశేఖరుడు	b) మాలతీ మాధవం
iii) హేమచంద్రుడు	c) ప్రబోధ చంద్రోదయం
iv) భవభూతి	d) పృథ్వీరాజ విజయం
v) ఆనందవర్ధనుడు	e) కర్పూర మంజరీ

1) i-e, ii-a, iii-d, iv-c, v-b
2) i-c, ii-e, iii-b, iv-a, v-d
3) i-d, ii-e, iii-a, iv-b ,v-c
4) i-b, ii-c, iii-a, iv-e, v-d

35. కశ్మీర్‌లోని 'మార్తాండ సూర్యాలయం' నిర్మాత ఎవరు?
1) హరిసింగ్
2) లలితాదిత్య ముక్తాపీడుడు
3) బాలాదిత్య 4) జయపాలుడు

36. 'శిలా నిర్మిత సుందరనగరం' అని దేన్ని పిలిచేవారు?
1) ఉదయ్‌పూర్ 2) భగత్‌పూర్
3) జైపూర్ 4) జోధ్‌పూర్

37. 'ఖండన ఖండఖాద్యం' గ్రంథకర్త ఎవరు?
1) శ్రీహర్షుడు 2) దండి
3) పద్మగుప్తుడు 4) కల్హణుడు

38. ప్రతీహారులు తాము ఎవరి సంతతికి చెందిన వాళ్లమని చెప్పుకొన్నారు?
1) ఇంద్రుడు 2) లక్ష్మణుడు
3) వరుణుడు 4) బ్రహ్మ

39. విద్యాధరుడు అనే రాజు ఏ వంశానికి చెందినవాడు?
1) ఛంధేల 2) సోలంకీ
3) పాల 4) పరమార

40. 'అరబ్బుల సింధూపై దండయాత్ర ఫలితం లేని విజయం' అని అన్నదెవరు?
1) జె.ఎన్. సర్కార్
2) రాధాకుముద్ ముఖర్జీ
3) లేన్‌పూల్ 4) వి.ఎ. స్మిత్

41. హర్షుడి పాలనాకాలం ఏది?
1) క్రీ.శ. 606 - 647
2) క్రీ.శ. 606 - 656
3) క్రీ.శ. 606 - 666
4) క్రీ.శ. 600 - 647

42. 'సూర్య శతకం' రాసిందెవరు?
1) బాణుడు 2) మతంగ దివాకరుడు
3) భర్తృహరి 4) మయూరుడు

43. కింది వాటిలో సరికాని జత?
1) యాత్రికుల్లో యువరాజు – హుయాన్‌త్సాంగ్
2) మహామోక్ష పరిషత్ – స్థానేశ్వరం
3) నలంద విశ్వవిదాలయం – రాజ్‌గిర్
4) కాదంబరి గ్రంథం – బాణుడు

44. హర్షుడి తొలి రాజధాని ఏది?
1) కనోజ్ 2) ఉజ్జయిని
3) శ్రీనగర్ 4) స్థానేశ్వరం

45. కింది వాటిలో హుయాన్‌త్సాంగ్ రచన ఏది?
1) నేచురల్ హిస్టరీ 2) ది ట్రావెల్స్
3) సి–యూ–కి 4) ఫో–కో–కి

46. 'సకలోత్తరాపథేశ్వరుడు' అనేది ఎవరి బిరుదు?
1) భాస్కర వర్మ 2) రెండో పులకేశి
3) రెండో ధ్రువసేనుడు 4) హర్షుడు

47. హర్షుడి వంశం ఏది?
1) పుష్యభూతి 2) పశ్చిమ చాళుక్య
3) ప్రతీహార 4) గహద్వాల

48. కింది వాటిలో హర్షుడి రచన కానిది ఏది?
1) నాగానందం 2) చండీ శతకం
3) రత్నావళి 4) ప్రియదర్శిక

49. రెండో పులకేశి, హర్షుడి రాజ్యాల సరిహద్దుగా ఉన్న నది ఏది?
1) యమున 2) గోమతి
3) నర్మద 4) కావేరి

50. 'రాజశ్రీ' ఎవరు?
1) హర్షుడి తల్లి 2) హర్షుడి కుమార్తె
3) హర్షుడి సోదరి 4) హర్షుడి పినతల్లి

51. కింది వాటిలో సరైన జత ఏది?
1) మహామోక్ష పరిషత్ – ఐదేళ్లకోసారి
2) ప్రభాకర వర్ధనుడు – హూణ హరిణ కేసరి
3) గృహవర్మ – మౌఖరి వంశం
4) పైవన్నీ సరైనవే

52. జతపరచండి.
పదజాలం
i) రాజస్తానీయ
ii) మహాబలాధీకృత
iii) భాండాగారాధీకృత
iv) తుల్యమేయ
v) ధ్రువాధికరణ
అర్థం
a) కోశాధికారి
b) అమ్మకం పన్ను
c) పన్ను వసూలు చేసే అధికారి
d) సేనాపతి
e) విదేశీ వ్యవహారాలు
1) i-e, ii-d, iii-c, iv-b, v-a
2) i-e, ii-b, iii-c, iv-d, v-a
3) i-c, ii-d, iii-a, iv-b, v-e
4) i-e, ii-d, iii-a, iv-b, v-c

53. సి–యూకి గ్రంథం ప్రకారం, క్రీ.శ. 7వ శతాబ్దంలో భారతీయులు ఏం తినరని పేర్కొన్నారు?
1) ఉల్లి, వెల్లుల్లి
2) మిరపకాయ, కందిపప్పు
3) అల్లం, మెంతులు
4) పెసరపప్పు, మినప పప్పు

54. కనోజ్‌లో జరిగిన సర్వమత మహాసభ అధ్యక్షుడెవరు?
1) భాస్కర వర్మ 2) హుయాన్‌త్సాంగ్
3) తాయిసుంగ్ 4) గౌడశశాంకుడు

55. 'దానధర్మ క్షేత్రం' అని ఏ ప్రాంతాన్ని పిలుస్తారు?
1) కనోజ్ 2) అజ్మీర్
3) ప్రయాగ 4) శ్రీనగర్

56. హర్షుడి తండ్రి ఎవరు?
1) ఆదిత్య వర్ధనుడు 2) రాజ్య వర్ధనుడు
3) ప్రభాకర వర్ధనుడు
4) భాస్కర వర్మ

57. కింది వాటిలో సరైన జత ఏది?
1) యశోమతీదేవి – హర్షుడి తల్లి
2) కామరూప – అసోం
3) సోమోద్భవ – నర్మదా నది
4) పైవన్నీ సరైనవే

సమాధానాలు

1) 3	2) 1	3) 2	4) 4	5) 1
6) 3	7) 4	8) 1	9) 2	10) 2
11) 1	12) 3	13) 2	14) 1	15) 3
16) 1	17) 2	18) 3	19) 4	20) 2
21) 4	22) 2	23) 2	24) 1	25) 3
26) 2	27) 1	28) 1	29) 4	30) 4
31) 4	32) 1	33) 2	34) 3	35) 2
36) 4	37) 1	38) 2	39) 1	40) 3
41) 1	42) 4	43) 2	44) 4	45) 3
46) 4	47) 1	48) 2	49) 3	50) 3
51) 4	52) 4	53) 1	54) 2	55) 3
56) 3	57) 4			

మౌలికాంశాలపై పట్టు సాధిస్తే సమాధానాలు సులువే!



సూర సత్యనారాయణ
ప్రిన్సిపల్, మైనారిటీ
రెసిడెన్షియల్ స్కూల్,
శేరిలింగంపల్లి.

'నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ)ని సమర్థంగా అమలు చేసేలా పదో తరగతి జీవ శాస్త్రంలో అధ్యాయాలను పొందుపర్చారు. విద్యార్థులు ప్రతి పాఠ్య భాగంలోని మౌలికాంశాలపై పట్టు సాధిస్తే, ప్రశ్నలను ఏ రూపంలో ఇచ్చినా సులభంగా సమాధానాలు రాయొచ్చు.

పదో తరగతి
బయాలజీ
ప్రత్యేకం

అధ్యాయాల విశ్లేషణ

జీవశాస్త్రంలో మొత్తం పది అధ్యాయాలున్నాయి. అవి

1) పోషణ – ఆహార సరఫరా వ్యవస్థ
2) శ్వాసక్రియ – శక్తి ఉత్పాదక వ్యవస్థ
3) ప్రసరణ – పదార్థ రవాణా వ్యవస్థ
4) విసర్జన – వ్యర్థాల తొలగింపు వ్యవస్థ
5) నియంత్రణ – సమన్వయ వ్యవస్థ
6) ప్రత్యుత్పత్తి – పునరుత్పాదక వ్యవస్థ
7) జీవక్రియలో సమన్వయం
8) అనువంశికత
9) మన పర్యావరణం – మన బాధ్యత
10) సహజ వనరులు

సీసీఈ విధానంలో అధ్యాయాల వారీగా వెయిటేజీ ఉండదు. పబ్లిక్ పరీక్షల్లో విద్యా ప్రమాణాలకు మాత్రమే వెయిటేజీ ఉంటుంది.

విద్యా ప్రమాణాలు

విద్యా ప్రమాణాలు	వెయిటేజీ	మార్కులు
విషయావగాహన	40%	16
ప్రశ్నించడం, పరికల్పన చేయడం	10%	04
ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు	15%	06
సమాచార సేకరణ, నైపుణ్యాలు, ప్రాజెక్ట్ పనులు	15%	06
బొమ్మలు గీయడం, నమూనాలు తయారు చేయడం	10%	04
అభినందించడం, సౌందర్యాత్మక స్పృహ కలిగి ఉండటం, విలువలు పాటించడం, నిజ జీవిత వినియోగం, జీవ వైవిధ్యంపై సానుభూతి కలిగి ఉండటం	10%	04
మొత్తం	**100%**	**40**

- విద్యార్థులు విద్యా ప్రమాణాల వారీగా వెయిటేజీని దృష్టిలో ఉంచుకొని పాఠ్యాంశాలను అధ్యయనం చేయాలి.
- ప్రతి పాఠం చివర ఇచ్చిన కీలక పదాలను నిర్వచన రూపంలో చదవాలి.
- ప్రతి టాపిక్‌ను మైండ్ మ్యాపింగ్ విధానంలో చదివితే బాగా గుర్తుంటుంది.
- ప్రతి యూనిట్‌ను క్షుణ్నంగా చదవాలి, బట్టీపట్టే విధానాన్ని పూర్తిగా మానుకోవాలి.
- ప్రయోగాలు సొంతంగా చేయాలి. వాటికి సంబంధించిన అంశాలను తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో చర్చించి వివరంగా నమోదు చేసుకోవాలి.
- ప్రతి పాఠం చివర ఉన్న ప్రశ్నలను మాదిరి ప్రశ్నలుగా తీసుకొని అధ్యయనం చేయాలి.
- ఫ్లో చార్ట్లు, రేఖా చిత్రాలు, పటాలు, సరిపోల్చుకునే టేబుళ్లు, ప్యాసేజ్‌లకు సంబంధించినవి బాగా సాధన చేయాలి.
- పాఠ్యాంశంలోని విషయాల ఆధారంగా సొంతంగా నోట్స్ రూపొందించుకోవాలి.
- పాఠంలో ఇచ్చిన విషయాల గురించి ఆలోచించాలి, చర్చించాలి. ఆ విషయాలను నిత్య జీవిత అంశాలతో అన్వయించుకుంటూ చదవాలి.
- పాఠ్య పుస్తకంలోని సమాచారంతోపాటు గ్రంథాలయం, ప్రయోగశాల, ఇంటర్నెట్, క్షేత్ర పర్యటనలు, వృత్తి నిపుణులను కలవడం ద్వారా కావాల్సినంత సమాచారాన్ని సేకరించాలి.
- మూల్యాంకనానికి సంబంధించి నిర్దిష్ట నమూనాలో 'కీ' ఉండదు. కాబట్టి ప్రశ్నకు సంబంధించిన జవాబులు కచ్చితంగా ఇలానే రాయాలి అనే నియమం లేదు. అందువల్ల విద్యార్థులు స్వేచ్ఛగా, విశ్లేషణాత్మకంగా జవాబులు రాయొచ్చు.

ప్రశ్నపత్రం - ప్రశ్నల సరళి

టెన్త్ పబ్లిక్ పరీక్షలో జీవశాస్త్ర ప్రశ్నపత్రం 40 మార్కులకు ఉంటుంది. సమయం 2 గంటల 45 నిమిషాలు. ప్రశ్నపత్రం చదవడానికి 15 నిమిషాల సమయాన్ని అదనంగా ఇస్తున్నారు.

సెక్షన్-1

క్రమసంఖ్య 1 నుంచి 4 వరకు వ్యాస రూప ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు 4×4=16. ఈ నాలుగు ప్రశ్నలకు ఇంటర్నల్ చాయిస్ ఉంటుంది.

సెక్షన్-2

క్రమసంఖ్య 5 నుంచి 10 వరకు స్వల్ప సమాధాన ప్రశ్నలుంటాయి. వీటికి నాలుగు లేదా ఐదు వాక్యాల్లో జవాబులు రాయాలి. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు 2×6=12 వీటికి చాయిస్ ఉండదు.

సెక్షన్-3

క్రమ సంఖ్య 11 నుంచి 17 వరకు అతి స్వల్ప సమాధాన ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు 1 మార్కు 1×7=7. ఈ ప్రశ్నలకు ఒకటి లేదా రెండు వాక్యాల్లో సమాధానాలు రాయాలి.

సెక్షన్-4

క్రమసంఖ్య 18 నుంచి 27 వరకు బహుళైచ్ఛిక సమాధాన తరహా (మల్టిపుల్ చాయిస్) ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు అరమార్కు కేటాయించారు. ½×10=5.

పరీక్ష విధానం - ఉత్తీర్ణత లక్ష్యం

వార్షిక పబ్లిక్ పరీక్షలో భౌతిక, రసాయన శాస్త్రం 40 మార్కులకు, జీవశాస్త్రం 40 మార్కులకు ఉంటాయి. రెండు పేపర్లు కలిపి 80 మార్కుల్లో ప్రతి విద్యార్థి కనీసం 28 మార్కులు (35 శాతం) సాధిస్తే ఉత్తీర్ణులుగా పరిగణిస్తారు.

నిర్మాణాత్మక మూల్యాంకనం

భౌతిక రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించి 20 మార్కులను నిర్మాణాత్మక మూల్యాంకనానికి (Formative Assesment) కేటాయించారు. ఈ నిర్మాణాత్మక మూల్యాంకనంలో కనీస మార్కులు సాధించాలనే నియమం లేదు.

The validity of the GST registration?



K.V. Gnana Kumar
Director,
DBS, Hyderabad

BANK
POs, Clerks
Banking Special Awareness

Model Questions

1. The Banking Ombudsman may reject a complaint at any stage if it appears to him that a complaint made to him ____:
   a) If the Compensation sought from the Banking Ombudsman is beyond Rs. 20 lakh
   b) If it requires consideration of elaborate documentary and oral evidence
   c) If the proceedings before the Banking Ombudsman are not appropriate for adjudication of such complaint
   d) If the complaint is without any sufficient cause
   e) All the above
2. Who among the following set up the Credit Guarantee Fund Trust for Micro and Small Enterprises (CGTMSE)?
   a) GOI b) Ministry of MSME
   c) SIDBI d) a & c
   e) Reserve Bank of India
3. Who among the following can issue Commercial Paper(CP)?
   a) Corporates
   b) Primary Dealers
   c) All India Financial Institutions
   d) a, b, & c e) a & b only
4. As per the latest audited balance sheet, If the tangible net worth of the company is not less than ______ crore, then the corporate would be eligible to issue CP.
   a) 4 b) 3 c) 2
   d) 5 e) None of these
5. Compensation amount not exceeding Rs. _____ lakh to the complainant for mental agony and harassment may be awarded by Banking Ombudsman.
   a) 1 b) 2 c) 3
   d) 5 e) None of these
6. As per the existing Priority Sector guidelines Which of the following categories are there?
   a) Export Credit b) Agriculture
   c) Social Infrastructure
   d) Renewable Energy
   e) All of these
7. Currency note of Rs. 500 will have ' five bleed lines on left and right in raised print'. Similarly how many bleed lines are there on the left and right in Rs. 2000 currency note?
   a) 3 b) 4 c) 6 d) 7 e) 8
8. Which of the following forms are used for Acknowledgement of registration for GST?
   a) Form GSTR -1
   b) Form GSTR -2
   c) Form GST REG-02
   d) Form GST REG
   e) None of these
9. If the fourth letter in PAN CARD is 'P' then it denotes _____:
   a) Company b) Firm
   c) Person d) Trust
   e) HUF
10. The validity of the GST registration certificate is:
    a) One year b) Two years
    c) Five years
    d) Valid till it is canceled
    e) None of these
11. The Headquarters of TransUnion CIBIL is located in _________ :
    a) Chennai b) Kolkatta
    c) Mumbai d) Bengaluru
    e) None of these
12. Net Owned Funds of a Non-Banking Finance Company should be Rs.______ to get the NBFC license from RBI.
    a) 100 Lakh b) 150 Lakh
    c) 200 Lakh d) 250 Lakh
    e) None of these
13. In NRE account "R" stands for:
    a) Residential b) Recoverable
    c) Resident d) Residual
    e) None of these
14. Bharat Nirman is a four-year business plan embarked by the Government of India for providing rural infrastructure in the areas of:
    a) Irrigation & water supply
    b) Electrification c) Housing
    d) Telecommunication & connectivity
    e) All the above
15. NIXI stands for:
    a) National & International Exchange of India
    b) National Internet Exchange of India
    c) National Inter Exchange Interest
    d) None of the above
    e) National Industrial Exchange of India
16. The present chairman of the US Federal Reserve is:
    a) Alan Greenspan
    b) Gordon Brounes
    c) Janet Yellen d) George Bush
    e) Ben Bernanke
17. The name of Microsoft Corporation India's IT initiative for setting up IT kiosks in rural areas is named:
    a) Aadhar b) Saksham
    c) Swadhan d) Shakthi
    e) Pradhan
18. The Demutualisation Ordinance amending the Securities Contracts (Regulation) Act, 1956 deals with:
    a) Operations of foreign mutual funds in India
    b) Rules and regulations for issue of different securities in the capital market
    c) Compulsory corporatisation of stock exchanges to bring about transparency and efficiency in their operations
    d) Process of converting paper based securities into electronic form
    e) Only a & b

KEY

1) e	2) d	3) d	4) a
5) a	6) e	7) d	8) c
9) c	10) d	11) c	12) c
13) c	14) e	15) b	16) c
17) b	18) c		

గుర్తించండి



raft
hike
kiwi
branch
sweater
teacher
lolipop
log

b	p	b	i	h	t	h	b	b
r	g	r	k	w	n	i	w	r
e	l	a	z	m	f	k	j	a
h	o	n	a	v	o	e	o	f
c	g	c	p	b	n	u	p	t
a	v	h	j	g	q	z	t	u
e	c	n	z	t	i	w	i	k
t	r	e	t	a	e	w	s	t
i	l	o	l	i	p	o	p	j

పైన ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి

దారి కనుక్కోండి

తన స్నేహితులతో కలిసి వచ్చిన వంకాయ తప్పిపోయింది. తన స్నేహితుల వెళ్లడానికి దారి చూపిస్తారా?



నాన్నా చెప్పవా?

పెంగ్విన్లు సముద్రంలో ఎలా ఉండగలుగుతాయి?




మన భూగోళం మీద, మంచుతో నిండిన అంటార్కిటికా ప్రాంతంలో నివసించే పెంగ్విన్లు అద్భుతమైన డైవర్లనీ, గజఈతగాళ్ళనీ వర్ణించ వచ్చు. ఇవి సముద్రంలో 500 మీటర్ల లోతు దాకా వెళ్లడమే కాకుండా, పైకి రాకుండా సుమారు 15 నిమిషాల దాకా నీటిలోపల ఉండ గల్గుతాయి. ఇందుకు ఒక ముఖ్య కారణమే ఉంది లెండి.

పెంగ్విన్ల శరీర ఉష్ణోగ్రత సాధారణంగా 38 డిగ్రీల సెల్సియస్ వుంటుంది. అయితే ఇవి సముద్రం లోపలికి దిగాక వాటి ఉష్ణోగ్రత 11 డిగ్రీలకు పడిపోతుంది. దాంతో వాటి శరీరం లోపలి కణజాలాలన్నీ తమ తమ జీవన చర్యల వేగాన్ని తగ్గిస్తాయి. అంటే వాటికి అవసరమైన ఆమ్లజని వేగాన్ని తగ్గిస్తాయి. అంటే వాటికి ఆవసరమైన ఆక్సిజన్ కూడా గణనీయంగా తగ్గిపోతుందన్నమాట. ఈ కారణంగా అవి అంతకు ముందు పీల్చుకున్న గాలిలోని ఆక్సిజన్ సాయంతో సుమారు 15 నిమిషాల దాకా నీటి లోపల ఉండగల్గుతాయి.


ఒకవేళ సముద్రం లోపలికి వెళ్ళాక వాటి శరీర ఉష్ణోగ్రత పడిపోయి తద్వారా జీవన చర్యలు మందగించకుండా ఉన్నట్లయితే పెంగ్విన్లు అంతసేపు నీటిలో ఉండటం అసాధ్యమవు తుంది. ఎందుకంటే వాటి శరీరానికి.... పావుగంట సేపు బతికేందుకు కావలసిన ఆక్సిజన్‌ని తమలో నిలుపుకోగలిగే సామర్థ్యం వుండదు.

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 8 తేడాలను గుర్తించండి



నీడను గుర్తించండి

పక్కన ఇచ్చిన 5 నీడల్లో ఈ జంతువు అసలు నీడ ఏదో గుర్తించండి



కనుక్కోండి



ఔరా!


డచ్ దేశస్థులు ఏడాదికి సగటున వెయ్యి కిలోమీటర్లు ప్రయాణిస్తారు




ప్రపంచ దేశాలతో పోల్చినపుడు చైనాలో ఉరిశిక్షలు 4 రెట్లు అధికం



కింద ఇచ్చిన బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



రంగులు వేయండి



రైతు సంక్షేమమే లక్ష్యం

జిల్లా రైతు సమన్వయ కమిటీల ఇన్‌చార్జి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ బృహత్తర కార్యాచరణతో ముందుకు సాగుతున్నారని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, గృహనిర్మాణ శాఖల మంత్రి, మంచిర్యాల జిల్లా రైతు సమన్వయ కమిటీల ఇన్‌చార్జి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం హాజీపూర్ మండలం పద్మావతి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన రైతు సమన్వయ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వివిధ రకాల ప్రయోజనాలు రైతాంగానికి అందేలా సీఎం కేసీఆర్ రైతు సమన్వయ సమితులను ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని వివరించారు. రాష్ట్రస్థాయిలో రూ.500 కోట్ల రివాల్వింగ్ ఫండ్ కేటాయించనున్నారని తెలిపారు. పెట్టుబడి పథకంలో భాగంగా ఎకరానికి రూ.4వేలు రెండు సీజన్లలో అందిచనున్నారని చెప్పారు. సమితుల ఏర్పాటుతో రైతులే స్వయం నిర్ణేతలుగా మారనున్నారని, రైతే రాజు అన్న నానుడి టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వాస్తవం కానుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు మాట్లాడుతూ, రైతుల ఆత్మగౌరం పెంచేలా సీఎం కేసీఆర్ ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేశారని అన్నారు. త్వరలో ఏర్పాటు కానున్న రైతు సమన్వయ సమితులతో రైతుల మోములో ఆనందం కనిపించనుందన్నారు. ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ఇక ఎలాంటి కష్టాలు రాకూడదని సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని అన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల పాటు మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తూ రైతులకు తోడుగా నిలుస్తుందన్నారు. సాగునీరు, ఉచిత విద్యుత్‌తో పాటు ఇప్పుడు రైతుపై పెట్టుబడి భారం కూడా లేకుండా ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ అత్తి సరోజ, డీసీసీబీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ బేర సత్యనారాయణ, వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని 18 మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

వేగంగా ‘డబుల్’ ఇళ్ల నిర్మాణాలు

- గృహనిర్మాణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి ఐకే రెడ్డి, ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: రాష్ట్రవ్యాప్తంగా డబుల్ బెడ్ రూమ్‌ల ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని గృహనిర్మాణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి శివారు కన్నాల హైవే పక్కన నిర్మాణం జరుగుతున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి మంత్రి పరిశీలించారు. నిరుపేదలు కూడా ఆత్మగౌరవంగా బతకాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్‌ల ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో 2.70 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఏకంగా లక్ష ఇళ్లు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1.70 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి తొలి విడతలో 400, మలి విడతలో వెయ్యి చొప్పున ఇళ్లను మంజూరు చేశామన్నారు. జీ ప్లస్ వన్ తరహాలో ఇళ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పనులు జరుగుతున్నందువల్ల ఇన్నాళ్లుగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు సాగలేదన్నారు. ఇప్పుడు అన్ని నియోజకవర్గాల్లో జోరందుకున్నాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లకు ఉచితంగా ఇసుకను అందిస్తున్నామని తెలిపారు. సిమెంట్ కంపెనీలతో మాట్లాడి సిమెంట్ ధర తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఒక్కో కాంట్రాక్టర్ 20 వరకు ఇళ్లు నిర్మించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు ఉత్సాహంగా ఉన్న నియోజకవర్గాల్లో వేగవంతంగా నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో 10 శాతం కేటాయించడానికి సీఎం అంగీకరించారని చెప్పారు. ఇందుకు సంబంధించిన జీవో జారీ కావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎస్.నర్సింగం, ఎంపీపీ సుభాష్‌రావు ,ఆర్‌అండ్ బీ అధికారులు ఉన్నారు.

విమోచన దినం అధికారికంగా నిర్వహించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి

దండేపల్లి(మంచిర్యాల): సెప్టెంబరు 1న తెలంగాణ విమోచన దినం అధికారికంగా నిర్వహించే వరకు టీఆర్‌ఎస్‌పై ఒత్తిడి తెస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల మల్లారెడ్డి అన్నారు. దండేపల్లిలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుకు ముందు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని చెప్పిన కేసీఆర్, రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఎందుకు అధికారికంగా నిర్వహించడం లేదో చెప్పాలన్నారు. ఎంఐఎం పార్టీకి బయపడి విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని వారు ఎద్దేవా చేశారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1నుంచి 7వరకు తెలంగాణాలోని పది జిల్లాల్లో విమోచన యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోనె శ్యాంసుందర్, జిల్లా నాయకులు గోలి రాము, పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణమూర్తి, మల్లూరి భూమన్న, మండల అధ్యక్షుడు బోడకుంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లిలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

సమస్యలు పరిష్కరిస్తా.. కష్టపడి చదవండి

- చెన్నూర్‌లో కేజీబీవీ విద్యార్థులతో డీఈవో రవికాంత్



విద్యార్థినులకు దుప్పట్లు అందజేస్తున్న డీఈవో

చెన్నూర్: విద్యాలయంలో నెలకొన్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తానని, కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధించాలని జిల్లా విద్యాధికారి రవికాంత్ అన్నారు. బుధవారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థినులకు మంజూరైన దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్య పరిష్కారానికి వారం రోజుల్లో కొత్త బోరు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సెప్టిక్ ట్యాంక్ చెడిపోవడంతో మరుగుదొడ్లు నిండిపోయాయని వెంటనే సెప్టిక్ ట్యాంక్‌ను నిర్మించాలని కాంట్రాక్టర్ రాజేశ్వర్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని, విద్యార్థినులు ఆందోళన చెందకుండా చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో రాధాకృష్ణమూర్తి ఉన్నారు.

మా ఊరికి బస్సులు నడపండి

- బస్టాండ్‌లో సౌకర్యాలు మెరుగుపర్చండి..
- ట్రిప్పులు పెంచండి: ప్రయాణికులు
- డయల్ యువర్ డీఎంకు స్పందన

మంచిర్యాలఅర్బన్: ‘మాఊరికి బస్సు నడపండి.. బస్‌స్టేషన్‌లో ఫ్యాన్లు ఏర్పాటు చేయండి.. మరుగుదొడ్ల నిర్వహణ బాగా లేదు’ అంటూ ఒక్కో సమస్యను ప్రయాణికులు వెల్లడించారు. బుధవారం నిర్వహించిన డయల్‌యువర్ డీఎంకు 20 ఫోన్ కాల్స్ వచ్చినట్లు మంచిర్యాల డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత తెలిపారు. రామకృష్ణాపూర్‌కు చెందిన రాజేశ్వర్ మంచిర్యాల బస్టాండ్‌లో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్ల నిర్వహణ బాగాలేదని దృష్టికి తెచ్చారు. బెల్లంపల్లికి చెందిన నరేష్ బెల్లంపల్లి మార్కెట్లో బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టాలని కోరగా స్థల సేకరణ ఇబ్బందిగా ఉందని, పురపాలక సంఘం స్థలం సమకూర్చితే ఏర్పాటుకు కృషి చేస్తామని శ్రీలత స్పష్టం చేశారు. మందమర్రికి చెందిన విజయ్‌కుమార్ క్యాతన్‌పల్లి మీదుగా మందమర్రి మార్కెట్, అందుగులపేట, సారంపల్లి, జెండా వెంకటపూర్ గ్రామాలను కలుపుతూ మందమర్రి మార్కెట్ మీదుగా మంచిర్యాలకు బస్సు నడపాలని కోరారు. మందమర్రికి చెందిన విఘ్నేష్ మందమర్రి మార్కెట్ నుంచి కొమురవెల్లి, వేములవాడ బస్సు నడపడంతో పాటు హైదరాబాద్‌కు బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. మంచిర్యాలకు చెందిన రాజగోపాల్ మంచిర్యాల నుంచి షిర్డీకి బస్సునడపాలని, చెన్నూరు బస్‌స్టేషన్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని, తెల్లవారు జామున 4గంటలకు చెన్నూరు నుంచి హైదరాబాద్‌కు బస్సు నడపించాలని, బస్సుల ట్రిప్పులు పెంచాలని కోరారు.

ప్రయాణం.. ప్రమాదం



జీపులపై ప్రమాదకరంగా ప్రయాణిస్తూ..

ఆ దారిలో బస్సులు నడవవ్.. బస్సులు వెళ్లడానికి సరైన రోడ్డు లేదు. పరిమితికి మించినా, ప్రమాదమని తెలిసినా బిక్కు బిక్కుమంటూ ప్రయివేటు వాహనాలపై నిత్యం ప్రయాణించాల్సిందే.. చెన్నూర్ నుంచి కోటపల్లి మండలంలోని పలుగ్రామాలకు వెళ్లే ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరాలంటే గంటల తరబడి ఇలా ప్రయాణించాల్సిందే..

- గెల్లు నర్సయ్య, సాక్షి ఫొటోగ్రాఫర్, మంచిర్యాల



మరమ్మతులు చేయరూ..!



దుగ్నెపల్లి గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టుపై ఏర్పడిన గుంత

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి మీదుగా దుగ్నెపల్లి గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టుపై గుంత ఏర్పడి రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనదారులు అందులో పడిపోతున్నారు. మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి

మీ దృష్టికి వచ్చిన సమస్యలు.. మీ చుట్టూ జరిగే అవినీతి అక్రమాలు.. ఆసక్తికర విశేషాలు ఏవైనా సరే... లక్షలాది మందితో పంచుకోవాలనుకుంటున్నారా? అయితే వాటిని మాకు పంపండి. దీనికోసం మీరు చేయాల్సిందల్లా మీరు గమనించిన అంశాల్ని మీ ఫోన్‌లో బంధించి మాకు వాట్సప్ చేయడమే. ప్రాధాన్యతను బట్టి వాటిని మేం ప్రచురిస్తాం. మరెందుకాలస్యం క్లిక్‌మనిపించండి.. వాట్సప్ చేయండి.

మా ఫోన్ నెంబర్ : 8790811433

వర్షాలతో పత్తికి జీవం

- ఏపుగా పెరుగుతున్న పత్తి
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



గోదావరి నది పరివాహక ప్రాంతంలో పచ్చబడ్డ పత్తిపంట

చెన్నూర్: నియోజకవర్గంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి పంటకు ప్రాణం పోసినట్లైంది. కురుస్తున్న వర్షానికి ఎండిపోయే దశకు చేరిన పత్తి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. పత్తి పంటలు పచ్చబడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలోని చెన్నూర్, కోటపల్లి, జైపూర్, మందమర్రి, భీమారం మండలాల్లో సుమారు 15 వేల హెక్టార్లలో పత్తి పంట సాగు చేస్తున్నారు.

నష్టాల్లోంచి గట్టెక్కేనా?

గత ఏడాది ప్రారంభంలో పత్తికి ధర లేకపోవడంతో రైతులు నష్టాల పాలయ్యారు. ఈ ఏడాది సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిస్తే గత ఏడాది చేసిన అప్పులు తీర్చుకుందామన్న ఆశతో రైతులు ఎక్కువ స్థాయిలో పత్తి పంటను సాగు చేశారు. గత వారం రోజుల వరకు వర్షాలు జాడే లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. అల్పపీడన ద్రోణి కారణంగా గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పంటలకు జీవం పోయినట్లైంది. రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆశలు చిగురించాయి.

భారీ వర్షాలు కురిస్తే అంతే...

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పత్తి పంటకు ఢోకా లేకుండా ఉంది. మరింత భారీ వర్షాలు కురిస్తే పంట నీట మునిగి నాశనం అయ్యే ప్రమాదం ఉంటుంది. అంతేకాకుండా భారీ వర్షాలు పడితే కాయ సమయంలో పురుగు పడే అవకాశం లేక పోలేదు. ఇప్పటికి కురిసిన వర్షాలు పత్తి పంటకు అనుకులంగా ఉన్నాయని రైతులు అంటున్నారు.

పత్తి పైనే ఆశ



వరి పంట పోయినట్లే. ఇక పత్తి మీదనే ఆశ. ఈ ఏడాది 8 ఎకరాలపత్తి పంట సాగు చేశా. ఇప్పటి వరకు పత్తి మంచిగానే ఉంది. రానున్న రోజుల్లో వర్షాలు కురిస్తేనే పంట చేతికి వత్తుంది. లేదంటే పెట్టిన పెట్టుబడులు భూమిలో పోసినట్లే. గత ఏడాది పత్తికి మంచి ధర ఉండే. ఈ ఏడాది అదే ధర ఉంటే రైతులకు లాభం ఉంటుంది.

–మానిశెట్టి శ్రీనివాస్, రైతు

ధర ఉంటే బయట పడుతాం



ఈ ఏడాది పత్తికి ఢోకా ఉండదు. మరో రెండు వానలు పడితే పత్తి కాతకు వస్తుంది. దిగుబడి కూడా మంచిగానే ఉంటుందని ఆశ పడుతున్నాం. పోయిన ఏడాది మాదిరిగా పత్తికి ధర ఉంటే బయట పడుతాం. పత్తికి ధర లేకుంటే అప్పులే మిగులుతాయి. ఇతర పంటలన్నీ పోయాయి. పత్తి పంటే రైతులకు ప్రాణం పోయాలి.

–బాపురెడ్డి, సుందరశాల

అర్హులకే సబ్సిడీ రుణాలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

భీమారం: అర్హులైన లబ్ధిదారులకే సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని మండల అభివృద్ధి అధికారి నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మద్దికల్, ఆరెపల్లి భీమారం గ్రామాల్లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులకు రుణాలు మంజూరు చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో సబ్సిడీ రుణాలు అందిస్తుందని అన్నారు. దళారుల ప్రమేయం లేకుండా దరఖాస్తుదారునితో వివరాలు తెలుసుకొని రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అర్హులకే రుణాలు మంజూరు చేసేందుకు గ్రామాల్లోనే ఇంటర్వ్యూలు నివహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భీమారం ఎస్‌బీఐ బ్రాంచి ఫీల్డ్ అసిస్టెంట్ సుకుమార్, ఈవోపీఆర్‌డీ సతీశ్‌కుమార్, సర్పంచులు డేగ రమేశ్, ఎల్కటూరి శంకరమ్మ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను డీఈవో రవికాంత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈవో రాధాకృష్ణమూర్తి ఉన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

అక్రమ నిర్మాణాలు కూల్చాలని ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చెన్నూర్: పట్టణంలోని కుమ్మరికుంట శిఖం భూమిలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే కూల్చివేయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూకబ్జాలు పెరిగిపోయాయన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల అండదండలతో కిందిస్థాయి నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జూల లక్ష్మణ్, బుచ్చన్న, ప్రతాప్, తిరుపతి, సంపత్ కుమార్, సురేశ్, శైలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటుకు మంత్రి హామీ

భీమారం: భీమారంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరికి టీఆర్‌ఎస్ జిల్లా నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి వినతిపత్రం అందించారు. బుధవారం రాత్రి మంచిర్యాలలో ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, ఎంపీ బాల్క సుమన్‌తో కలిసి మంత్రి శ్రీహరిని కలిశారు. పురాతనం నుంచి పెద్ద గ్రామంగా ఉన్న భీమారం లో కళాశాల కావాలనే ఆకాంక్ష ఎప్పటినుంచో ఈప్రాంత ప్రజల్లో ఉందని ఆయన మంత్రి కి వివరించడంతో ఏర్పాటుకు మంత్రి హామీ ఇచ్చారు. శ్రీకోదండరామాలయలంలో ధూప దీప, నైవేద్యం కోసం నిధులు మంజూరు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కలిసి వివరించారు. టీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు వేముల శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

పెయింటర్స్ అసోసియేషన్ కార్యవర్గం

రామకృష్ణాపూర్: బిల్డింగ్ పెయింటర్స్ అసోసియేషన్ పట్టణ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బత్తుల మీ నయ్య, ఉపాధ్యక్షుడిగా కలవల రాజేందర్, కార్యదర్శిగా గజ్జెల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా బత్తిని శ్రీనివాస్, తాళ్లపెల్లి కుమారస్వామి, కోశాధికారిగా వెంకటస్వామి, ఆర్గనైజర్లుగా చంద్రయ్య, కల్లెం గంగాధర్, అఫ్జల్, ఆకుల సంపత్‌లను ఎన్నుకున్నారు. వీరితో పాటు మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రైతు సమన్వయ కమిటీల ఏర్పాటు

మందమర్రిరూరల్: మండలంలో రైతు సమన్వయ కమిటీని ఎన్నుకోనున్నట్లు ఏవో సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. 1న అందుగులపేట, చిర్రకుంట, పొన్నారం, 4న అమరవాధి, మందమర్రి, మామిడిగట్టు, 5న కాతనపల్లి, లేమూర్, వెంకటాపూర్, 6న తిమ్మాపూర్, సారంగపల్లిలో ఎన్నుకోనున్నట్టు తెలిపారు.





నక్షత్రం
శ్రీనివాసటాకీస్
11.00,2.00,6.00, 9.00

గణనాథులకు ప్రత్యేక పూజలు



రామకృష్ణాపూర్: కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు



మందమర్రి: గనిపై పూజల్లో పాల్గొన్న మేనేజర్ శ్రీనివాస్‌రావు, కార్మికులు



చెన్నూర్‌రూరల్: ఆస్నాదలో పూజల్లో పాల్గొన్న యువకులు

Zone Guide

నేడు బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ

మందమర్రి: పట్టణంలోని సింగరేణి ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పర్చుకున్న కార్మికులకు ఇళ్ల పట్టాలివ్వాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం కార్మిక కాలనీలలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన కార్మికులకు తాను నివసిస్తున్న కంపెని క్వార్టర్‌ను అతనికే కేటాయించి పట్టాలను ఇవ్వాలన్నారు. కార్మికులు, కార్మికేతరులు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

1 నుంచి వార్డుల్లో స్పెషల్ డ్రైవ్

మందమర్రి: మందమర్రి మున్సిపాలిటి 24 వార్డుల్లో సెప్టెంబర్1 నుంచి అక్టోబర్ 9వరకు పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టనున్నట్లు కమిషనర్ గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

పులిమడుగులో వైద్యశిబిరం

రామకృష్ణాపూర్: తిమ్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోనిలో బుధవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 14 మందికి రక్తపరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ రవి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా, టీబీ అధికారి గంగాధర్, సర్పంచ్ తిరుపతి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

చెన్నూర్: సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీజీటీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మధుసూదన్ అన్నారు. బుధవారం తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ కమిషన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా టీఎన్‌జీవోఎస్ అధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండి ప్రకాశ్, టీఎన్‌జీవోఎస్ తాలుకా అధ్యక్షుడు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాంకుమార్, సానియా, జ్ఞానానందం, సాధిక్‌అలీ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్లు బుధవారం నిరసన తెలిపారు.మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్‌కుమార్‌కు క్యాజువల్ లీవ్ పత్రాలను అందజేశారు. పంచాయతీ రాజ్ విభాగపు ఏఈ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అబ్రహాం, పంచాయతీ కార్యదర్శి సర్వశ్రేష్ఠ, క్యాతనపల్లి బిల్ కలెక్టర్ శంకర్, స్వరూప ఉన్నారు.



చెన్నూర్: వినతిపత్రం అందజేస్తున్న టీజీటీపీ నాయకులు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లేశంగౌడ్



చెన్నూర్: బార్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడిగా పొన్నం మల్లేశంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఆకుదారి రాంభావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మాజీ అధ్యక్షులు రమేశ్‌చందర్ గిల్డా, కొలిపాక రవీందర్, మద్ది కార్తీక్, ఎస్.రమేశ్ పాల్గొన్నారు.

ప్రత్యేకగది కేటాయించాలి

మందమర్రి: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక గది కేటాయించాలని కోరుతూ సికిల్ సెల్ సొసైటి జిల్లా కోఆర్డినెటర్ కాసర్ల శ్రీనివాస్ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కలెక్టర్లకు వినతి పత్రం అందించారు. గతంలో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తలసేమియా వారి కోసం కేటాయించిన గదిలో ప్రసూతికి వచ్చిన వారు ఉండటం వలన సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు రక్తం ఎక్కించేందుకు బెడ్స్ లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

కొండచిలువ హతం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అమరవాదిలో బుధవారం గ్రామస్తులు కొండచిలువను హతమార్చారు. ఓ ఇంట్లో కోళ్ళను తింటుండగా చూసిన గ్రామస్తులు మొదట తీగతో కట్టివేయగా కొండచిలువ నుంచి మూడు కోళ్ళు బయటపడ్డాయి. అనంతరం బండరాయితో దానిని హతమార్చారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

జైపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇందారం ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి బి.శ్రీనివాస్, జైపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలీస్‌మాధుర్య, ఓపెన్‌స్కూల్ కో–కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పదోతరగతి ప్రవేశానికి 14సంవత్సరాలు పూర్తి చేసుకుని ఉండాలని, ఇంటర్‌కు పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించిన వారు సంబంధిత హైస్కూల్‌లో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 4వరకు అడ్మిషన్లు స్వీకరిస్తామని, టెన్త్‌కు రూ.100, ఇంటర్‌కు రూ.200ఫైన్‌తో సెప్టెంబర్ 14వరకు అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

టీడీపీ నుంచి ఇద్దరి తొలగింపు

మందమర్రి: పట్టణంలోని టీడీపీకి చెందిన ఇద్దరు నాయకులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజక వర్గ ఇన్‌ఛార్జి దుర్గం నరేష్, వాసాల సాగర్ వారికి వారే పదవులను సృష్టించుకుని పార్టీలో గ్రూపులు చేస్తూ క్రమశిక్షణను ఉల్లంఘించినట్లు తెలిపారు. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం వల్లే పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను విమర్శిస్తే ఊరుకోం

చెన్నూర్: పట్టణంలో జరుగుతున్న విషయాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఎలాంటి సంబంధం లేకున్నా బీజేపీ, టీడీపీ పార్టీల నాయకులు విమర్శిస్తే ఊరుకునేది లేదని టీఆర్‌ఎస్ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గంగిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయిని సతీశ్‌లు అన్నారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పై ఆరోపణలు చేయడం ఫ్యాషన్ అయిపోయిందన్నారు. దామోదర్‌రెడ్డి, సుధాకర్, పెండ్యాల లక్ష్మణ్, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

టార్పాలిన్లు పంపిణీ

భీమారం: రైతులు పండించే ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీ పై మంజూరు చేసిన టార్పాలిన్లను బుధవారం మండల వ్యవసాయ విస్తరణ అధికారి వనాదేవి రైతులకు పంపిణీ చేశారు. ఈమేరకు ఆమె మాట్లాడుతూ మండలానికి 150 టార్పాలిన్లు మంజూరయ్యాయని, రైతులు రూ.1400లు చెల్లించి టార్పాలిన్లు పొందవచ్చునన్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న టార్పాలిన్ కవర్లను మండల వ్యవసాయ అధికారిని సుజాత బుధవారం పంపిణీ చేశారు. మండలానికి నూట ముప్పై ఎనిమిది కవర్లు వచ్చాయని ఆమె తెలిపారు.

గీత కార్మికులను ఆదుకోవాలి

చెన్నూర్: గీత కార్మికులను ఆదుకోవాలని మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్ రావు అధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు గడ్డం వివేకానందకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో గతంలో 6 వేల ఈత, తాటి ఉన్నాయని, మూడేళ్ల క్రితం వివిధ రోగాలతో 4500 ఈత, తాటి చెట్లు చని పోయాయని తెలిపారు. ఈత, తాటి వనం చనిపోయిన ఎక్సైజ్ అధికారులు కార్మికుల వద్ద నుంచి 6 వేల చెట్లకు సంబంధించిన రెంటల్‌ను వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులు ఈత, తాటి చెట్ల ద్వారా వచ్చిన కల్లు అమ్మితే రెంటల్ కట్టేందుకు సరిపోవడం లేదన్నారు. కుల వృత్తిని నమ్ముకుంటే కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వివేక్ సానుకులంగా స్పందించి ఎక్సైజ్ కమిషనర్ చంద్రవర్ధన్‌తో మాట్లాడారు. స్థానిక అధికారులతో సర్వే చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాలగౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు మల్లాగౌడ్, బెల్లంపల్లి లక్ష్మీరాజాగౌడ్, అశోక్‌గౌడ్, రాంమూర్తి, మల్లాగౌడ్ పాల్గొన్నారు.

అందుబాటులో టార్పాలిన్లు

చెన్నూర్‌రూరల్: మండలంలోని రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న టార్పాలిన్లు వ్యవసాయశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని ఏవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. టార్పాలిన్ ధర రూ.2500లు ఉంటే సబ్సిడీతో రూ.1250కి మాత్రమే అందజేస్తున్నామన్నారు. టార్పాలిన్లు కావాల్సిన రైతులు వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

'హక్కులు పోగొట్టినట్లయితే దేనికైనా సిద్ధం'

మందమర్రి: సింగరేణిలో టీబీజీకేఎస్ ఏర్పడినప్పటి నుంచి ఏ ఒక్క హక్కును పోగొట్టినట్లయితే దేనికైనా సిద్ధమని ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో ఏరియా కేకే–5 గని కమిటీ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు పాల్గొని కార్మికుల నుద్దేశించి ప్రసంగించారు. జాతీయ కార్మిక సంఘాలు, సీమాంధ్ర ప్రభుత్వాలతో కలిసి చేసిన విధ్వంసానికి సింగరేణి విల విలలాడిందని ఆయన అన్నారు. సింగరేణి కొంగు బంగారంగా ఉన్న సింగరేణిని జాతీయ కార్మిక సంఘాలు తమ స్వార్థపూరిత కుట్రలతో సంస్కరణల పేరుతో కార్మికుల హక్కులను కాలరాసిందని ఆయన ధ్వజమెత్తారు. కార్మికుల కోసం పుట్టిన టీబీజీకేఎస్‌తోనే కార్మికులు, కార్మికులతోనే మేమంత ఉన్నామని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, నాయకులు జె.రవీందర్, ఓ రాజశేఖర్, దాసరి రాములు, శంకర్‌రావు, వీరారెడ్డి, సారయ్య, రాంచందర్, కార్మికులు పాల్గొన్నారు.



బురద రోడ్లపై నడిచేదెలా



బురదమయంగా గంగారం గ్రామానికి వెళ్లే రోడ్డు

బెల్లంపల్లి: నెన్నెల మండలం గంగారం గ్రామానికి వెళ్లే రోడ్డు చిరు జల్లులకే చిత్తడిగా మారుతోంది. రోడ్డంతా బురదగా మారి రాకపోకలు చేయడానికి వీలు లేకుండా తయారైంది. బైక్‌లు బురదలో జారి కింద పడుతున్నాయి. చిన్నారులు, మహిళలు, వృద్ధులు బురదలో నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9701909596

అగ్రస్థానంలో బీపీఏ ఓసీ2



ఓసీ2లో బొగ్గు ఉత్పత్తి జరుగుతున్న డీ బ్లాక్

- బెల్లంపల్లి రీజియన్‌లో బొగ్గు ఉత్పత్తిలో ప్రథమం
- 2016 ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్ల లాభాలు

తాండూరు: బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో బెల్లంపల్లి బీపీఏ–ఓసీ2 ప్రాజెక్టు దూసుకుపోతోంది. సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన వార్షిక లక్ష్యసాధనలో పురోభివృద్ధి సాధిస్తూ ప్రత్యేకతను చాటుకుంటోంది. బెల్లంపల్లి రీ జియన్‌లో ప్రథమ స్థానంలో నిలిచి లాభాల బాటలో పయనిస్తోంది.

ఓసీ2 ప్రారంభం ఇలా...

బెల్లంపలి ఏరియా పరిధిలో 2006 సంవత్సరంలో బీపీఏ–ఓసీ2 ఏర్పాటుకు రంగం సిద్ధం చేయగా 2007లో బొగ్గు ఉత్పత్తి ఆరంభమైంది. ఇందుకు సంబంధించి పనులను యాజమాన్యం ప్రణాళికలు రూపొందించి క్రమంగా చేపట్టింది. ఓపెన్‌కాస్టు పరిధిలో సీ, బీ, డీ బ్లాక్‌లలో బొగ్గునిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. 18 ఏళ్ల జీ వితకాలంతో ప్రారంభించిన ఈ ఓపెన్ కాస్టులో... సీ బ్లాక్‌లో ఆరు సంవత్సరాల్లో 24 లక్షల టన్నులు, బీ బ్లాక్‌లో నాలుగు సంవత్సరాల్లో 16 లక్షల టన్నులు, డీ బ్లాక్‌లో ఎనిమిది సంవత్సరాల్లో 30 లక్షల టన్నుల చొప్పున బొగ్గు ఉత్పత్తి చేయాలని సంకల్పించింది. 2007 లో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ ఆరంభమైంది.

ఎన్నో అడ్డంకులు...

ఈ ప్రాజెక్టు ప్రారంభంలో భూ సేకరణకు అవరోధాలు డీ, బీ బ్లాక్‌ల అనుమతి ప్రతిబంధకంగా మారాయి. ఓపెన్‌కాస్టులో బొగ్గు ఉత్పత్తి కోసం 108 హెక్టార్ల అటవీభూమిని సేకరించే క్రమంలో అనుమతుల్లో తీవ్ర జాప్యం జరిగింది. గిరిజనుల నుంచి వ్యతిరేకత రావడం, అటవీ హక్కు చట్టాలు అనుమతుల విషయంలో మరింత తలనొప్పిగా మారింది. ఈ కారణంగా 2011లో బీ, డీ బ్లాక్‌ల్లో ఉత్పత్తి అని వార్యంగా నిలిచిపోయింది.

సమష్టి కృషితోనే..



ఏరియా జీఎం మార్గదర్శకాలతో ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి చేస్తున్నాం. అందువల్లే లక్ష్యాన్ని సునాయసంగా అధిగమించి లాభాలు సాధించాం. దీనికితోడు అధికారులు, కార్మికులు, టెక్నీషియన్ల సమష్టి కృషి ఉంది. అందుబాటులో ఉన్న యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ లక్ష్యాలను సాధించగలుగుతున్నాం.

- ఎల్.రమేశ్ (మేనేజర్ బీపీఏ ఓసీ-2)

అడ్డంకులు అధిగమించి...

ఓపెన్‌కాస్టు పరిధిలోని డీ, బీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తిని చేపట్టేందుకు తలెత్తిన అడ్డంకులను క్రమంగా యాజమాన్యం అధిగమించింది. మరోవైపు అటవీశాఖ నుంచి అనుమతులు రావడంతో 2016 ఏప్రిల్‌లో తొలుత బీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించారు. ముందస్తుగా నిర్ణయించిన ప్రకారంగా ఏడాదికి నాలుగు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితో పద్దెనిమిదేళ్ల పాటు చేపట్టాల్సిన ప్రాజెక్టులో మార్పులు జరిగాయి. బీ, డీ బ్లాకుల్లో ఐదు సంవత్సరాల జీవితకాలంతో ఏడాదికి పది లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నారు. 2016–17 ఆర్థిక సంవత్సరంలో 74శాతం బొగ్గు ఉత్పత్తితో రూ.120 కోట్ల లాభాలను ఆర్జించింది.

రీజియన్‌లో అగ్రస్థానం..

బెల్లంపల్లి రీజియన్‌లో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లో ఉన్న భూగర్భ, ఓపెన్‌కాస్టు గనులు అన్నింటిలో బీపీఏ–ఓసీ2 బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలతో అగ్రస్థానం దక్కించుకుంది. ప్రథమ త్రైమాసికంలో జూన్ నాటికి 130 శాతం బొగ్గు ఉత్పత్తితో మొదటి స్థానంలో నిలిచింది. జూలై మాంసాంతానికి నిర్ధేశించిన 2.30 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికిగాను 3.16 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితో 131 శాతంతో ప్రథమస్థానంలో కొనసాగుతోంది. ఎస్సార్పీ–1 (భూగర్భగని), కై రిగూడ ఓసీపీ, కేకే–1, ఆర్‌కే–6 భూగర్భ గనులు తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నాయి.

న్యూస్ బాక్స్

చీరల లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలి

తాండూర్: బతుకమ్మ పండుగ సందర్భంగా పంపిణీ చేయనున్న చీరల కోసం అర్హులైన లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ రామచంద్రయ్య సూచించారు. బుధవారం ఆయన కార్యాలయంలో వీర్‌వోలు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆహార భద్రత కార్డు కలిగి ఉండి, 18 సంవత్సరాల వయస్సు పైబడిన మహిళల జాబితాను సిద్ధం చేయండంతో పాటు చీరల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో డీటీ మానిక్‌రావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్యాంలాల్, వీఆర్వోలు ఆశీర్వాదం, గణమతి, మదును, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా మల్లేష్

కాసిపేట: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా చింతల మల్లేష్ ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా అల్లాల రాజు, ఉపాధ్యక్షుడిగా మెరుగు తిరుపతిని ఎన్నుకున్నట్లు నాయకులు పేర్కొన్నారు. బుధవారం బెల్లంపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎంపిక చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మహేశ్వర్‌రెడ్డి, అరవిందరెడ్డిలకు నూతన కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా నాయకులు గాదెం శ్రీనివాస్, చెంద్రమౌళి, ప్రదీప్, కొమురయ్య, తదితరులున్నారు.

'మిషన్ భగీరథ' పనులు పరిశీలన

తాండూర్: మండలంలోని బోయపల్లిలో జరుగుతున్న మిషన్ భగీరథ పనులను తహసీల్దార్ రామచంద్రయ్య బుధవారం పరిశీలించారు. పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పైప్‌లైన్ కోసం కందకాలు తవ్వేటప్పుడు నీటి పైప్‌లైన్ చెడిపోకుండా, టెలిఫోన్ వైర్లు తెగిపోకుండా జాగ్రత్త వహించాలన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ

తాండూర్: మండల కేంద్రానికి చెందిన తాళ్లపల్లి వెంకటేశ్వర్‌రావు ఇటీవల అకాల మృతి చెందాడు. ఆయనకు కుటుంబాన్ని బుధవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. వెంకటేశ్వర్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

కస్తూరిబాలో తనిఖీ...

స్థానిక కస్తూరిబా విద్యాలయాన్ని మంత్రి అకస్మికంగా తనిఖీ చేశారు. ఏ సమస్య ఉన్నా ఎమ్మెల్యే చిన్నయ్య దృష్టికి తీసుకురావాలని ఆయన ఫోన్ నెంబర్ ఇచ్చారు. తనిఖీ సమయంలో ప్రత్యేకాధికారి లేకపోవడంతో హాజరు పట్టికలో గైర్హాజరయినట్లు మంత్రి రాశారు. మంత్రి వెంట ఎమ్మెల్యే చిన్నయ్య, గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మన్ మహేందర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ మురళీధర్‌రావు, జెడ్పీ మాజీ చైర్మన్ పురుషోత్తంగౌడ్, నాయకులు బానయ్య, శంకర్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.



కస్తూరిబాలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఐకేరెడ్డి

కబడ్డీ పోటీలకు ఎంపిక

తాండూర్: జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని తంగళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 29న మంచిర్యాలలో జరిగిన అండర్– 17 విభాగంలో బండి సాగర్, ఎస్‌కే సల్మాన్ అనే ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబర్చి జోనల్‌స్థాయికి ఎంపికయ్యారు. వీరిని ఎంఈవో ప్రభాకర్, పీఈటీ స్వప్న, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.



అభినందిస్తున్న ఎంఈవో ప్రభాకర్

లోకల్ వాయిస్

పీఈటీని నియమించాలి



భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ పాఠశాలలో పీఈటీ లేడు. దీంతో ఆటలకు దూరమవుతున్నాం. కలెక్టర్ వచ్చినప్పుడు దృష్టికి తీసుకెళ్లాం. పీఈటీని నియమించాలని డీఈవోకు సూచించారు. కానీ ఇప్పటి వరకూ నియమించలేదు.

- దురుశెట్టి లక్ష్మణ్, పదోతరగతి, జన్కాపూర్

పూడిక తీయించాలి




కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ లింగాల వాగు ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువలకు తుమ్మ చెట్లు పెరగడంతో కాలువలు పూడుకుపోయాయి. అధికారులు స్పందించి పూడిక తీయిస్తే రైతులకు మేలు.

- కొండు నరేశ్, జన్కాపూర్



వెండితెర



అర్జున్‌రెడ్డి
రామకృష్ణ (బెల్లంపల్లి)
11.15, 2.15, 6.15, 9.15

జయ జానకి నాయక
బాలాజీ (బెల్లంపల్లి)
11.15, 2.15, 6.15, 9.15

జయ జానకి నాయక
వెంకటరమణ 70ఎంఎం
(కాగజ్‌నగర్)11.00,2.00,
6.00, 9.00





రోడ్డు కష్టాలు తీరేదెన్నడూ..

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి గ్రామపంచాయతీ గురువాపూర్‌లో రోడ్లు బురదమయంగా మారి రాకపోకలకు గ్రామస్తులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రతియేటా ఇదే దుస్థితి అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై గుంతలతో ఈగలు, దోమలు వృద్ధిచెంది రోగాలబారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికే అంటువ్యాధుల బారిన పడి 15 మంది వరకూ మంచంపట్టినట్లు చెబుతున్నారు.

ఏకదంత..మమ్మేలుకోవా

- గణనాథుడికి ఘనమైన పూజలు

బెల్లంపల్లి: పట్టణంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మున్సిపాలిటీ 26వ వార్డు హన్మాన్‌బస్తీ వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆర్.ప్రవీణ్ ఆధ్వర్యంలో బాల వినాయక సేవా సమితి శ్రేణులు అన్నదానం నిర్వహించారు. 51 రకాల ప్రసాదాలతో నైవేద్యాలు సమర్పించారు. దూది వస్త్రంతో మాలదారణ చేశారు. బజారు ఏరియా ప్రాంతం కాంట్రాక్టర్ బస్తీ వరసిద్ధి వినాయక మండలి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున శివలింగం ప్రతిష్ఠిచి రుద్రాభిషేకం చేశారు. రైల్వే స్టేషన్ ఏరియా వినాయకుడి వద్ద మహిళలు కుంకుమ పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. కన్నాలబస్తీ లక్ష్మీ గణపతి వినాయక మండలి వద్ద చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్సెస్ పోటీలు నిర్వహించారు.

శివాలయ గణపతికి ప్రత్యేక పూజలు..

వేమనపల్లి: మండలంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు శోభాయమానంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరాలయంలో అర్చకుడు కాకిరాల వెంకన్న ఆధ్వర్యంలో బుధవారం శివాలయ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మంగళహారుతులతో తరలివచ్చారు. గణనాధుడికి గుగ్గిళ్లు, ఉండ్రాళ్లు, లడ్డూలు నైవేద్యంగా సమర్పించారు.

కాసిపేటలో..

కాసిపేట: మండలంలోని కాసిపేట, దేవాపూర్, ముత్యంపల్లి, కొండాపూర్, వినాయక మండపాళ్ల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. వర్తకసంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



బెల్లంపల్లి: శివలింగానికి క్షీరాభిషేకం



కాసిపేట: పూజలు చేస్తున్న భక్తులు



వేమనపల్లి: మంగళహారతులతో భక్తులు

పంట నష్టం పరిహారం చెల్లించాలని ప్రదర్శన



ప్రదర్శనగా వెళ్తున్న నాయకులు

బెల్లంపల్లి: నెన్నెల మండలం నందులపల్లిలో ఓ పేద కుటుంబానికి చెందిన పత్తి మొక్కలను తొలగించి నష్టం చేసిన ఘటనలో బాధితులకు పరిహారం మంజూరు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం బెల్లంపల్లి పాత బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ అటవీ శాఖ అధికారులు తొలగించిన మొక్కలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ నందుల పల్లి శివారు సర్వే నె.672లో ప్రభుత్వ భూమిని 25 ఏళ్ల క్రితం పేదలకు పంపిణీ చేసి పట్టాలు ఇచ్చారని తెలిపారు. ఆ భూమిలో పత్తి సాగు చేస్తుండగా అటవీ శాఖ అధికారులు దౌర్జన్యంగా మొక్కలు తొలిగించి, పంటను ధ్వంసం చేశారన్నారు. బాధితులకు పరిహారం ఇవ్వకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిప్పమనోహర్, కార్యదర్శి ప్రకాష్, నాయకులు శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి’

కాసిపేట: ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి పర్యటనలో ప్రొటోకాల్ పాటించకుండా తనకు సమాచారం అందించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కాసిపేట2 ఎంపీటీసీ కొండబత్తుల సంధ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆమె సోమగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంపీటీసీ అయిన తనకు కార్యక్రమ సమాచారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దం తిరుపతి, యూత్‌కాంగ్రెస్ నాయకుడు వేముల కృష్ణ, రాంచందర్, మండల ఉపాధ్యక్షుడు కూకట్ల దేవేందర్, గట్టయ్య, నాగరాజు తదితరులున్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ టీఎన్‌జీవోల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

బెల్లంపల్లి: సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరుతూ టీఎన్‌జీవోలు పట్టణంలో బుధవారం పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. రైల్వే స్టేషన్ ఏరియా నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ సాగింది. సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వంపై వొత్తిడి తేవడానికి రాష్ట్ర నాయకత్వం చర్యలు చేపట్టిందన్నారు. ర్యాలీలో టీఎన్‌జీవో సంఘు నాయకులు ప్రవీణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

Zone Guide

నేడు గ్రామసభలు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఆంధ్రబ్యాంకు పరిధిలోని సోనాపూర్, మల్కేపల్లి, ధర్మరావుపేట, దేవాపూర్ గ్రామపంచాయతీలలో నేడు ఎస్సీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్‌హై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో గ్రామసభలో పాల్గొనాలని కోరారు.

రేపు కబడ్డీ పోటీలు

వేమనపల్లి: వేమన యూత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రేపు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కుబిడే ఇందిర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు 9640669050, 9948393816 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు ఉచిత ఫిజియోథెరపీ వైద్యశిబిరం

కాసిపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నేడు ఉచిత ఫిజియోథరపీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో దామోదర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్లలోపు శారీరక దివ్యాంగులను ఫిజియోథెరపిస్ట్ కుమార్, స్వామి, ఐఈఆర్‌పీ పరీక్షిస్తారని వెల్లడించారు.

రేపటి నుంచి రైతు గ్రామసభలు

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో సెప్టెంబర్ 1 నుంచి 6వ తేదీ వరకు రైతు సమన్వయ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి విజయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామం నుంచి 15 మందితో కమిటీ ఎంపిక చేస్తామన్నారు. ఈ గ్రామసభలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు, రెవెన్యూ అధికారులు, గ్రామ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

ఇంటర్వ్యూ

పకడ్బందీగా ప్రజా పంపిణీ వ్యవస్థ

అంశం : రేషన్ దుకాణాల పనితీరు

విజయానంద్, తహసీల్దార్, కన్నెపల్లి



భీమిని: కన్నెపల్లి మండలంలో ప్రజాపంపిణీ వ్యవస్థ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయానంద్ పేర్కొన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరుపై ‘సాక్షి’ ఆయనను పలకరించింది.

సాక్షి: ప్రజాపంపిణీ వ్యవస్థ ఎలా ఉంది.?

తహసీల్దార్: మండలంలో 15 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అందులో నాలుగు గ్రామాలకు రేషన్ డీలర్లు లేరు. మండలవ్యాప్తంగా మొత్తం 5,817 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి కార్డుదారుడికి అవసరమైన సరుకులు ప్రతి నెలా అందిస్తున్నాం.

సాక్షి: రేషన్ దుకాణాల పనితీరుపై.?

తహసీల్దార్: డీలర్లు దుకాణాలను సక్రమంగా తెరిచి ఉంచాలి. నెలలో మొదటి తేదీ నుంచి చివరి వరకు సరుకులు అందిస్తున్నాం. దుకాణాలు ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు తెరిచి ఉంచాలి.

సాక్షి: అందిస్తున్న సరకులు.?

తహసీల్దార్: రేషన్ దుకాణాల ద్వారా కిరోసిన్, బియ్యం అందిస్తున్నాం. అంత్యోదయ కార్డులు ఉన్న వారికి కిలో పంచదార అందిస్తున్నాం. ఇతర సరుకుల సరఫరా నిలిపివేయడంతో పంపిణీ చేయలేకపోతున్నాం.

సాక్షి: కొత్త రేషన్‌కార్డులు అందిస్తున్నారా.?

తహసీల్దార్: ప్రస్తుతానికి ఆ ప్రక్రియ లేదు. కాకపోతే ఇదివరకు కార్డు లేని వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

గురువారం
ఆగస్టు | 31 | 2017
సాక్షి

• తలాపునే అందాల జలపాతం


జన్నారం సమీపంలోని జలపాతం

జన్నారం(ఖానాపూర్): అందాల జలపాతాన్ని చూడడానికి వందల మైళ్లు ఎందుకు ప్రయాణం.. మన తలాపునే మనసుకు హాయిగొలిపే జలపాతం ఉంది. పాలకుల నిర్లక్ష్యంతో తెరపైకి రావడం లేదు. జన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని సేవాదాస్‌నగర్ నుంచి అరకిలోమీటర్ దూరంలోని వాగు బండరాళ్లపై నుంచి జల సోయగాలు జాలువారుతున్నాయి. ఇక్కడికి ప్రతి ఆదివారం, సెలవు దినాల్లో స్థానికులు వస్తుంటారు. మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో జలపాతానికి ఆదరణ తగ్గింది. పదిహేనేళ్లుగా జారుడు బండ అని పిలువబడే ఈ జలపాతం వద్దకు వర్షాలంలో సందర్శకుల సంఖ్య పెరుగుతుంది. పర్యాటక శాఖ అధికారులు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరిస్తే మంచి పర్యాటక ప్రాంతమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో ఎత్తయిన బండరాయిని కొందరు పగులగొడుతుండడంతో మినీ జలపాతం మరికొన్ని రోజుల్లో కనుమరుగయ్యే ఆవకాశం ఉంది.

భోసిలో భక్తజన సందోహం

• పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తులు
• ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు
• మొక్కులు చెల్లించుకున్న ప్రముఖులు


ఆలయంలో హోమం



ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

తానూరు(ముథోల్): తానూరు మండలం భోసి గ్రామంలోని కర్ర గణపతిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. బుధవారం భైంసా ఆర్టీసీ డీఎం సారయ్య, ప్రముఖులు గణపతిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకుని ముడుపులు కట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రివేళలో వివిధ పాఠశాల విద్యార్థులు, కళాకారులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి.

కాలినడకన కర్ర గణపతికి ..

కర్ర గణేశుడి దర్శనానికి కాలినడకన వివిధ మండలాల నుంచి భక్తులు ఆధిక సంఖ్యలో చేరుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. రాత్రి వేళలలో నిర్వహించే హారతి కార్యక్రమాల్లో భక్తులు ఎక్కువగా పాల్గొంటుండడంతో ఆలయం జనసందోహంగా కనిపిస్తోంది. అనంత చతుర్థికి నిమజ్జనం చేయనుండడంతో రోజులు సమీపిస్తున్న తరుణంలో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

సిల్వర్ జూబ్లీ గణనాథుడు


కిష్టంపేట ఆలయంలో పూజలందుకుంటున్న గణనాథుడు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో 'శ్రీ వీరాంజనేయ స్వామి' ఆలయంలో 25 ఏళ్లుగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్నారు. 1992 నుంచి ఆలయంలో వినాయక చవితి రోజున విగ్రహాన్ని ప్రతిష్టించి నవరాత్రులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నిత్యం భజనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ ఏడాది కూడా నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్నట్లు గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

హస్తకళ తప్పతోంది

• ఉమ్మడి జిల్లాలో హస్తకళలకు ఆదరణ కరువు
• ఏళ్లుగా కొనసాగుతున్న కళాపోషణ
• మార్కెట్లో కానరాని డిమాండ్
• హస్తకళలకు గుర్తింపు దక్కినా ప్రయోజనం శూన్యం
• ఇంకా అభివృద్ధి చెందని కళాకారులు
• ఆర్థిక సహాయం కోసం ఎదురుచూపులు
• కొత్త జిల్లాలు ఏర్పడ్డాక పట్టించుకునే వారు కరువు

కెరమెరి(ఆసిఫాబాద్): విసిరేసిన జీవితాలు.. చాలీచాలని బతుకులు.. 'వీటికి ఆదరణ ఎక్కుడుంది. శిల్పకళల్లో ఏముంది వేరే పని చూసుకోరాదు' అని ఎగతాళి చేసిన సందర్భాలు అనేకం. అయినా వాటన్నింటిని దాటుకుని తాతల కాలం నాటి వృత్తిపైనే ఆధారపడిన కుటుంబాలు ఎన్నో.. కళల్ని పోషిస్తున్న కళాకారులకు కుటుంబపోషణ భారమైంది. కానీ ఏదో ఒక రోజు తమ జీవితాలు మారుతాయని ఉమ్మడి జిల్లాలోని హస్తకళాకారులు ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజన కళాకారులపై ప్రత్యేక కథనం..


కళాకృతులు తయారు చేస్తున్న భూమేశ్వర్


కెస్లాగూడలో హస్తకళలను పరిశీలిస్తున్న స్పెషల్ కమిషనర్ అబ్దుల్‌అజీం

ఉమ్మడి జిల్లాలో ఉన్న కళాకారుల వివరాలు

మండలం	కుటుంబాలు
కెరమెరి	25
జైనూర్	20
నిర్మల్	60
ఇచ్చోడ	2
గుడిహత్నూర్	5
వాంకిడి	10
నార్నూర్	2
ఆదిలాబాద్	3
తాంసీ	7



శిల్పిగురు అవార్డుకు ఎంపికైన కళాకృతులు

జాతీయ స్థాయిలో గుర్తింపు..

గడిచిన కొన్నేళ్లుగా హస్తకళల ద్వారా జీవనం సాగిస్తున్న కళాకారుల జీవితాల్లో మరుపురాని ఘట్టం. ఇన్నేళ్లుగా పడ్డ శ్రమకు గతేడాది జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. శిల్పకళపై ఆసక్తి పెరిగేలా గౌరవం దక్కింది. కెరమెరి మండలంలోని కెస్లాగూడ గ్రామానికి చెందిన శిల్పకళాకారుడు కోవ న్యానేశ్వర్‌కు 2016 నవంబర్‌లో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా 'శిల్పిగురు' అవార్డును అందుకున్నారు. దాంతో పాటు బంగారు పతకం, ఓ జ్ఞాపికను అందించారు. కేంద్రమంత్రులు శాలువాలతో సన్మానించారు. రూ. 2 లక్షల చెక్కును అందించారు. అనంతరం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతితో స్వయంగా భోజనం చేయడం మరుపురానిదని న్యానేశ్వర్ తెలిపాడు. దేశంలోని 69 మందికి జాతీయ అవార్డులు, 21 మందికి శిల్పిగురు అవార్డులు అందించారు. అందులో తెలంగాణ రాష్ట్రం నుంచి న్యానేశ్వర్‌కు శిల్పిగురు అవార్డు దక్కడం గర్వకారణం!

ఎవరెవరు ఏం చేస్తారు..

హస్తకళలు మొత్తం ఐదు ఉన్నప్పటికీ కుమురం భీం జిలాల్లో శిల్పి, హస్తకళలు రెండే మనుగడలో ఉన్నాయి. జిల్లాలో ఇత్తడి, శిల్పి అనే రెండు కళలకు సంబంధించిన పరికరాలు తయారు చేస్తున్నారు. అందులో కెరమెరి మండలంలోని కెస్లాగూడ గ్రామంలో 25 కుటుంబాలు ఇత్తడితో పరికరాలు తయారు చేస్తుండగా, తాంసీ మండలం రాంపూర్‌లో ఏడు, జైనూర్ మండలంలోని ఉశేగాంలో 20 కుటుంబాలు ఇత్తడితో కళాఖండాలు తయారు చేస్తున్నారు. నిర్మల్‌లో 60 కటుంబాలు కొయ్య బొమ్మలు, ఇచ్చోడ మండలంలోని ఆడేగాం (కే)లో రెండు కుటుంబాలు రాతి విగ్రహాలు తయారు చేస్తున్నాయి. గుడిహత్నూర్‌లో ఐదు కుటుంబాలు భరోన్ క్రాఫ్ట్(దారంతో బట్టపై అల్లికలు, ఎంబ్రాయిడరీ) తయరు చేయడం. వాంకిడి మండలం ఖమానాలో 10 కుటుంబాలు వెదురుతో పరికరాలు, బొమ్మలు, ఇతర వస్తువులు తయారు చేస్తున్నారు. నార్నూర్ మండలంలోని ఖడ్కి(జి) గ్రామంలో రెండు కుటుంబాలు లక్కతో కళాకృతులు తయారు చేస్తూ జీవిస్తున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలో మూడు కుటుంబాలు అగర్‌బత్తీల తయారీలో నిమగ్నమయ్యాయి.


ఉశేగాంలో తయారైన కళాకృతులు

కళాకారులకు భరోసా

నవంబర్ 23, 2016లో రాష్ట్ర యువజన సర్వీసుల కమిషనర్ మహమ్మద్ అబ్దుల్ అజీమ్ బెంగుళూరుకు చెందిన హ్యాండీ క్రాఫ్ట్ పరిశ్రమ ఖాఖ డైరెక్టర్ నీలిమాతో కలిసి కెరమెరి మండలంలోని కెస్లాగూడలో హస్తకళలను పరిశీలించారు. హస్తకళలపై ఆధారపడుతున్న వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. 2016 జనవరిలో తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జైల జారామయ్యర్ కెస్లాగూడను సందర్శించి జాతీయ స్థాయిలో హస్తకళలకు గుర్తింపు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. మార్కెటింగ్‌కు సహాయపడతామని హస్తకళాకారులను ఒకే చోట చేర్చి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. అదే ఏడాది ఫిబ్రవరి3న శ్రిస్టి ఆర్ట్స్ అండ్ డిజైన్ టెక్నాలజీ, హ్యాండీ క్రాఫ్ట్ టెక్నాలజీ బెంగుళూరుకు చెందిన రిసెర్చ్ స్కాలర్స్ కెస్లాగూడను సందర్శించారు. హస్తకళా భవనం ఏర్పాటు చేసి నెల గడుస్తున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు.

పట్టింపు కరువు..

గతేడాది వరకు రాష్ట్ర అధికారులు కెస్లాగూడను సందర్శించి హామీలు గుప్పించారు. ఇప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా వీరి వైపు కన్నెత్తి చూడడం లేదు. గతేడాది వరకు కళాకారులను ఆదుకుంటామన్న ఐటీడీఏ కూడా పట్టించుకోవడం లేదు.

ఆదరణేది?

గతేడాది అక్టోబర్‌లో ఏర్పడిన కొత్త జిల్లాల తర్వాత కెరమెరి మండలం కుమురం భీం జిల్లాలో చేరింది. అయినప్పటికీ కళాకారులకు ఆదరణ లభించట్లేదు. ఉమ్మడి జిల్లాలో ఐటీడీఏ పీవో కర్ణణ్ శ్రద్ధ చూపగా ఆయన పదోన్నతిపై మంచిర్యాల కలెక్టర్‌గా వెళ్లడంతో ప్రస్తుతం కళాకారులను పట్టించుకునే వారు కరువయ్యారు.

ఆదుకున్న 'లేపాక్షి'

లేపాక్షి సంస్థ వీరు చేస్తున్న హస్తకళలను చూసి మార్కెటింగ్ చేస్తోంది. ఒక్కో కుటుంబం నెలకు 20 కిలోల శిల్పకళలను తయారు చేస్తుంది. వీరు తయారు చేసిన వస్తువులను గతేడాది వరకు లేపాక్షి అధికారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం వారసంతల్లో అమ్ముతూ కాలం గడుపుతున్నారు. వారు చేస్తున్న ఆకృతుల్లో గుడి గంటలు, తాబేలు, గహాలంకారం, పూజ సామగ్రి, దీపాలు, దేవుళ్ల, నాయకుల ప్రతిమలు, ఎద్దులు, జాతీయ జంతువులు తదితర ప్రతిమలు రూపు దిద్దుకుంటున్నాయి.


రాష్ట్రపతి చేతుల మీదుగా మెమెంటోను స్వీకరిస్తున్న న్యానేశ్వర్(ఫైల్)


ఇత్తడిని కరిగించి పోస్తున్న చిత్రం


కెస్లాగూడలో హస్తకళలను పరిశీలిస్తున్న తెలంగాణ హస్తకళా సంస్థ ఎండీ జైలజారామయ్యర్

పంచబ్రాహ్మణ కళలు

తెలుగులో..
వడ్రంగి, శిల్పి, కమ్మరి, కుమ్మరి, కంసాలి

సంస్కృతంలో..
మనబ్రహ్మ, మయబ్రహ్మ, క్షత్రబ్రహ్మ, శిల్పబ్రహ్మ, శిశ్వాల్పు బ్రహ్మ

శిక్షణ కల్పించాలి



ప్రస్తుతం మాకు తెలిసిన విద్యతో ఆకృతులు తయారు చేస్తున్నాం. కానీ కొత్తకొత్త ఆకృతులు తెలియాలంటే, తయారు చేయాలంటే శిక్షణ చాలా అవసరం. గతంలోనే ఐటీడీఏ పీవో సారు బస్తర్‌కు శిక్షణ కోసం పంపిస్తామన్నారు. కానీ నేటికీ ఎవరినీ పంపించలేదు.

– మడావి కేశవ్‌రావు, కెస్లాగూడ కెరమెరి

ఒకే చోట చేర్పించాలి



అందరినీ ఒకే చోట చేర్పించేందుకు గతంలోనే మండల కేంద్రంలో హస్తకళా భవనం మరమ్మతులు పూర్తయ్యాయి. వెనువెంటనే మరమ్మతులకు చేరింది. అధికారులు మరింత చొరవ చూపి త్వరలో చేర్పించాలి. ఇతర పనులు పూర్తి చేయాలి.

– కోవ న్యానేశ్వర్, శిల్పి అవార్డు గ్రహీత

జీసీసీ నుంచి మైనం అందించాలి



జీసీసీ నుంచి మైనం, ఇత్తడి తదితర సామగ్రిని అందించాలి. ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదు. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాం. ప్రభుత్వం సహాయం అందిస్తే బాగుపడతాం. ఒక్క కెస్లాగూడ గ్రామంపైనే శ్రద్ధ చూపుతున్నారు. మా గ్రామాన్ని పట్టించుకుంటలేరు.

– సుర్పం గిరిజాబాయి, ఉశేగాం, జైనూర్